UNIVERSAL
LIBRARY
OU_206180
UNIVERSAL
LIBRARY

ప్రాక్ ప్రతీచీ గ్రంథమాల: ౨

# హిందూ జీవన పథము

సర్. డాక్టర్. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎమ్. ఏ. గారు

1926 వ సంవత్సరమున ఆక్స్‌ఫర్డులో మాంచెస్టరు
కళాశాలయందు గావించిన అప్టన్ ఉపన్యాసములు

అనువాదకుడు:

కామరాజు హనుమంతరావు

EAST AND WEST SERIES,

*Editor* : **K. Hanumanta Rao**

# సర్వస్వామ్య సంకలితము

1933

దీని వెల

రు 1-0-0.

ప్రకాశకులు:

ప్రాక్ ప్రతీచీగ్రంథాలయము, రాజమహేంద్రవరము.

I have looked through the Telugu translation of the Hindu view of Life made by Mr. K. Hanumantha Rao. All those who are aware of the difficulty of the task will agree that Mr. Hanumantha Rao has done his work with great care. Throughout we perceive an earnest attempt to keep faithful to the original. It is hoped that the reading public of the Telugu country will appreciate his work.

S. RADHAKRISHNAN.

ఈపుస్తకమును గురించి శ్రీరాధాకృష్ణన్ గారి యభిప్రాయము:

"నేను రచించిన "Hindu view of life" అను గ్రంథమునకు కామరాజు హనుమంతరావుగారు ఆంధ్రమునందు జేసిన భాషాంతరీకరణము నేను స్వాంతముగ జదివితిని. హనుమంతరావుగారు కడు జాగరూకతతో తద్గ్రంథమును భాషాంతరీకరించి రని యట్టి కార్యమందలి కష్ట మెఱిగిన వారెల్ల రంగీకరింతు రని నమ్ముచున్నాను. మాతృకయందలి భావములను సరిగ ననువదించుటకు వా రతిశ్రద్ధతో కృషి సలిపి రని పుస్తకమునందంతటను కానవచ్చును. ఆంధ్రపాఠకలోకము వారి యనువాద గ్రంథము నాదరింతు రని యూహించుచున్నాను."

# భూమిక.

సర్వసృష్టిలో మానవు డుత్తమస్థాన మధిష్ఠించెను. భౌతికశక్తులను వశపరచుకొనుటలోను, ప్రాపంచికజీవనము సుఖప్రదముగ జేసికొనుటలోను మానవ బుద్ధి కౌశలము వ్యక్తమగుచున్నది. సర్వదేశములందు సామాన్యముగ నెల్లప్పుడు, జనులు తమ యైహికజీవనమునందు దృష్టి నిలిపి ప్రాపంచికైశ్వర్యముల పెంపొందించు కృషియందు నిమగ్నులగుదురు. కాని మనుష్యుడు నశ్వరమగు కేవల లౌకిక సంపదతో తృప్తి నొందడు. “నవిత్తేన తర్పణీయో మనుష్యః” అనునుపనిషద్వాక్యము ఈసత్యమును పూర్ణముగ వెల్లడించుచున్నది. సర్వాధారుడయి విశ్వవిభుడుగను జీవరక్షకుడుగను,సృష్టియందుఅనశ్వరుడగు పరమేశ్వరుడు ప్రత్యక్షమగుచున్నాడు. ప్రాచీనార్యులు ఆయన దర్శనము పొంది ధన్యులయిరి. ఆ జగదాశ్రయుని పొందుట మానవుని “పరమాగతిః” అనియు, ఆయనను బడయకున్నయెడల మానవునకు “మహతీ వినష్టిః” అనియు వారు దృఢముగ విశ్వసించిరి. వారు సకల విద్యలలో బ్రహ్మవిద్యకు ప్రాధాన్యత నిచ్చిరి. “అధ

పరా యయా తదక్షర మధిగమ్యతే* అను ప్రవచనము వారివిద్యావిషయకాదర్శమును స్పష్టముగజూపుచున్నది. "Seek ye first the Kingdom of God" ఈశ్వరరాజ్యమును ప్రథమముమున నన్వేషింపుడని జీసను కూడ ఈ జీవితపరమావధినె కనపరచెను. బ్రహ్మజ్ఞానము సమకూర్చు తత్త్వవిచారణము మానవున కత్యంతావశ్యక మని వేరుగ జెప్పవలయునా?

పాశ్చాత్యులు భౌతికవిజ్ఞానమును పెంపొందించుటకు చాల పాటుపడిరి. పదార్థవిజ్ఞానశాస్త్రము, రసాయనశాస్త్రము, జీవశాస్త్రము మున్నగునవి దినదినము వారి నిరంతరకృషి మూలమున, మహోన్నతస్థితికి వచ్చినవి. సాధారణముగ పాశ్చాత్యు లీ భౌతికశాస్త్రముల నాధారపరచుకొని తత్త్వవిచారణము సలుపుదురు. తన్మూలమున వారి తత్త్వజ్ఞానము ఒక ప్రత్యేకలక్షణముతో వెలయుచున్నది. పాశ్చాత్యులు ప్రకృతిద్వారమున బ్రహ్మమును సమీపించుటకు యత్నించుచుండ, హిందూతత్త్వజ్ఞులు మానవాత్మయొక్క యనుభవములను ముఖ్యాధారములుగ గైకొని బ్రహ్మమును తెలిసికొనుటకు పాటుపడిరి. హిందువుల తత్త్వవిచారణము మరియొక రూపము దాల్చినద్ది. పాశ్చాత్యులయొక్కయు

ప్రాగ్దేశీయులయొక్కయు తత్త్వజ్ఞానము క్రోడీకరించి గ్రహించుట మిక్కిలి ప్రయోజనకరము.

ఇటీవల రామమోహనుడును దయానందుడును వివేకానందుడును, ప్రస్తుతము గాంధిమహాత్ముడును, ఈ నవభారతప్రవర్తకలు, కేవల శాస్త్రప్రమాణమునె జూపక తమ హేతుపూర్వకవాదములతో ధర్మప్రచారము సలుపగడంగిరి. ఈ యుగమున హేతుజ్ఞాన మంతకంతకు వృద్ధి నొందుచున్నది. దానిని పూర్తిగ తృప్తిపరుపక యీశ్వరభక్తిని జనులలో పాదుగొల్పుట యసంభవము. రవీంద్రుని ధర్మబోధనలు తత్త్వజ్ఞాన మిళితములగుటచేత విద్యాధికుల దృష్టిని నేడు ఆకర్షించినవి. అయినను వారు భావనయందు నెక్కుడు తీవ్రతను కనపరచి కవిశేఖరుడయి లోకప్రసిద్ధి జెందిరి. తత్త్వజ్ఞాన సంపాదనమునందు విశేషకృషి సలిపి ప్రాక్ప్రతీచీదేశములందు నేటివరకు తత్త్వజ్ఞానము గాంచిన యభివృద్ధి యంతయు విపులముగను విస్పష్టముగను ప్రకటించుటలో మన సుప్రసిద్ధాంధ్రులగు శ్రీ రాధాకృష్ణన్ గారు జగద్విఖ్యాతి బడసిరి. వారు ఆంగ్లమున నవర్గళధారతో సద్గ్రంథములు రచించుటయె గాక, మహోపన్యాసములు సయితమొసంగుచు తత్త్వజ్ఞానమును ప్రపంచమున వెదజల్లుచున్నారు.

వారు పాశ్చాత్యుల తత్త్వశాస్త్రములను కూలంకష ముగ పఠించిరి. హిందువుల ధర్మగ్రంథముల నామూలా గ్రముగ జదివి వ్యాఖ్యాతము చేసిరి. వారు తత్త్వజ్ఞానము సమగ్రదృష్టితో వ్యక్తపరచుటయందు అసాధారణ ప్రజ్ఞను కనపరచున్నారు.

జీవనము సహజముగ సంతతముగను విశసించును గదా! వంశపారంపర్యముగ లభించి యంతర్గతములై యున్న కొన్ని ప్రత్యేకగుణములతో ప్రతిజాతియొక్క జీవనము విలసిల్లుచుండును. సంప్రదాయ సిద్ధమయిన స్వభావమును విపులము, ప్రకాశవంతము చేయుటకే బాహ్యప్రబోధము తోడ్పడవలెను. హిందువులు తమ ధర్మముయొక్క తత్త్వమును స్వరూపమును బాగుగ గ్రహించి దానిని సర్వదా కాలానుగుణముగను సర్వజన హితకరముగను పెంపొందించుట యత్యంతావశ్యకము. పాశ్చాత్యసంపర్కము హిందూదేశమునకు గలిగిన ప్రథమదినములలో ఆంగ్లవిద్యార్థులందు పాశ్చాత్యజీవన వ్యామోహము ప్రబలి స్వధర్మ విచారణము మృగ్యమయ్యెను. కాని క్రమక్రమముగ హిందూనాయకులు స్వసంప్రదాయ లక్షణములను ప్రకటించుచు తదనుగుణముగ ధర్మజీవనము పెంపొందింప హిందువులను హెచ్చ

రింప మొదలిడిరి. శ్రీ రాధాకృష్ణన్ గారు నేడు హిందూ ధర్మముయొక్క విశేషత్వమును లోకమునకు చాటుచు నెంతయొ జాతీయప్రబోధము కలిగించుచున్నారు.

సర్వదేశస్థుల మన్ననకు పాత్రములై యున్న వారి యుపన్యాసములలో హిందూజీవనపథమునుగురించి ఆక్స్ఫర్డు నగరమున మాంచెస్టరు కళాశాలయందు ప్రథమమున ప్రసంగింపబడి పిమ్మట వారి సహధర్మిణి కంకితముగ గ్రంథరూపమున ప్రచురింపబడిన అప్టన్ మహోపన్యాసము లాంధ్రలోకమునకు పరిచయము చేయుభాగ్యము నాకు లభించినందులకు కడు సంతసిల్లుచున్నాను. దానిని భాషాంతరీకరించుటకై నాకనుజ్ఞ నిచ్చినందులకు శ్రీ రాధాకృష్ణన్ గారికి హృదయపూర్వక వందనము లర్పించుచున్నాను. మరియు నా కోరికపై వారు నా వ్రాతప్రతిని జదివి దానియందు తెనుభావము లెంతవరకు సరిగ వ్యక్తము లయ్యెనో పరిశీలించి కొన్ని సూచనలు చేసి నా యత్నమునకు తోడ్పడినందులకు వారి కత్యంత కృతజ్ఞుడను. ఆంధ్రులీ యుత్తమధర్మోపన్యాసములందలి సారమును గ్రోలి తమ జీవితములందు నూతనవికాసము బడయుదురు గాక!

అనువాదకుడు

# పీఠిక

హిందూ జీవనపథముయొక్క మూలసిద్ధాంతము
లను వెల్లడించుటకు ఉద్దేశింపబడిన యీ క్రిందివి యుపన్యా
సములు, ఉపన్యసింపబడిన రూపముననే, ముద్రితము
లయినవి. ఏవి ముఖ్యముగ చెప్పవలసియుండునో, ఏవి
విడిచినచో హిందూ జీవనపథమును గూర్చి పూర్తిగ
జెప్పుట కానేరదో, అట్టి విషయములు గొన్ని యీ
యుపన్యాసములందు జేరలేదనియు, అంతియగాక నిదర్శ
నములతోను హేతువులతోను నిరూపణము గావలసిన
యభిప్రాయములు గొన్ని యట్లు చర్చించి నిరూపితములు
గాకయె వీనియందు నూరక పేర్కొనబడెననియు, నే
నెరుగుదును. ధర్మవిషయక హిందూ తత్త్వ విచారణ
మును హాస్కెల్ ఉపన్యాసములలో (Haskell
Lectures) చాలవరకు గావించియున్నాను. అవి యీ
ఆగస్టుమాసములో చికాగో విశ్వవిద్యాలయమున
నొసంగు గౌరవము నాకు లభించెను. అవి ప్రచురింపబడి
నప్పుడు, ఈ పుస్తక మందలి కొన్ని గొప్పకొఱతలు తీర
గలవని తలంచుచున్నాను. అంతవరకు పాఠకలోకము

హిందూ ధర్మమునుగురించి కొంత గ్రహింపగలుగుటకు ఈ సంక్షిప్తవివరణము తోడ్పడినయెడల సంతుష్టుడ నయ్యెదను.

వ్రాతప్రతిని దయతో చదివినందులకు నా స్నేహితులగు ప్రొఫెసర్ జె. ఎస్. మెకంజిగారికి నేను మిగుల కృతజ్ఞుడను.

న్యూయార్కు నగరము<br>9 సెప్టెంబరు, 1926. } స. రా.

ఈ క్రింది సవరణలు గమనింప ప్రార్థితులు :

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| ౧౫ | ౧౨ | ముగ జీవితముగ, | మును, జీవితమును |
| ౩౯ | ౧౪ | మే మేమి | మేమి |
| ౪౭ | ౧౬ | వాహాసముల | వాహాసములు |
| ౫౦ | ౧౧ | స్వాహాషిని | స్వాహాపుని |
| ౬౫ | ౪ | ముసు | మునను |
| ౧౦౪ | ౭ | విషయిక | విషయి |
| ౧౬౧ | ౧౦ | ఛండాలుర | చండాలుర |
| ౧౫౧ | ౫ | సామరస్వము | సామరస్యము |

# విషయములు

పుట.


ప్రథమోపన్యాసము

ఈశ్వరానుభవము : తల్లక్షణము, తత్త్వము. ౧

ద్వితీయోపన్యాసము

మతముల సంఘర్షణము : హిందువుల వైఖరి ... ౪౦

తృతీయోపన్యాసము

హిందూ ధర్మము : 1 ... ... ౮౭

చతుర్థోపన్యాసము

హిందూ ధర్మము : 2 ... .... ౧౪౮

# ప్రథమోపన్యాసము

## ఈశ్వరానుభవము:—తల్లక్షణము, తత్త్వము.

ఆక్స్ఫర్డునగరపు మాంచెస్టరు కళాశాలాధికారులు, ముఖ్యముగ కళాశాలాధ్యక్షులు జాక్సుగారు, హిందూధర్మమూలసిద్ధాంతములనుగురించి యుపన్యసింపుడని నన్నత్యంతదయతో కోరినందులకు వారికి ప్రథమమున కృతజ్ఞత వెలిబుచ్చుచు నేఁటి సాయంకాలోపన్యాసము మొదలిడుచున్నాను. నా కృషినిగూర్చి అధ్యక్షులు జాక్సుగారు సెలవిచ్చిన ప్రశంసావచనములు, దానియందలి విశేషములకన్న, వారి హృదయవిశాలతనె యధికముగ వ్యక్తీకరించుచున్నవి. హిందూధర్మముయొక్క యుత్పత్తివికాసములను గాని తదంతర్గర్భిత దార్శనికభావములను గాని నాలు గుపన్యాసములలో వివరించుట యసాధ్యము. హిందూజీవనపథముయొక్క ప్రధానాశయములనె సూచించి, యిక్కాలమున మనల బాధించు కొన్ని సమస్యల నా పథ మెట్లు పరిష్కరింపగలదో బోధపరచుటకు యత్నించెదను. ఇది యయినను అతిసంక్షిప్తముగనె నిర్వహింపగలను.

ఎల్లర నెదుర్కొను మొదటి కష్టము హిందూ ధర్మమన నేమో నిర్వచించుటయె. అనేకుల కది యర్థ శూన్యమగు పదమువలె కనబడును. అది సమస్తవిశ్వాస సంకలితమగు వివిధవస్తుప్రదర్శనశాలవంటిదా, సకల బాహ్యానుష్ఠానసమన్వితమగు కలగూరగంపవంటిదా, లేక సర్వదేశస్వరూపవిలసితమగు భూగోళపటమువంటిదా ? దాని కెట్టి యర్థమయిన నుంచినయెడల, ఆ యర్థము వేర్వేరు కాలములందు, వేర్వేరు సంఘములందు వేర్వేరుగ పరివర్తనము జెందుచు వచ్చెను. అది వేదకాలమున నొక యర్థము, బ్రాహ్మణకాలమున నింకొక యర్థము, బౌద్ధకాలమున మూడవ యర్థము తెలుపుచుండెను; శైవునికి ఒక విధముగను, వైష్ణవునికి నింకొక విధముగను, శాక్తేయునికి మూడవవిధముగను గ్రాహ్యమగును. హిందూధర్మము తన దరిజేరిన జనుల యాచారభావములను కాలక్రమమున నెంత సులభముగ తనయందిముడ్చుకొనెనో, దాని భిన్నాకృతులయందలి సమాన సూత్రము కనుగొనుట మన కంత కష్ట మగుచున్నది. దాని వివిధరూపములను భిన్నచారిత్రికయుగములను పరస్పరసంబంధమున సమకూర్చు నాధ్యాత్మికైక్యత లేని యెడల, అది యెట్లు ఘనకార్యముల నిర్వహించెనో

నిశ్చయించుట యసాధ్యము. సృష్టిలోని యంధశక్తుల నానల నుంచిన, గ్రీకుసంప్రదాయజనితము కానిదేదియు ప్రపంచమున పెంపొంద దను నభిప్రాయము పాశ్చాత్త్యులం దొక లోకోక్తిగ నేర్పడినది. కాని యది పూర్తి సత్యము కాదు. హిందూధర్మము చూపిన స్వతంత్రాధారములు ననుసరించి ప్రపంచములో నర్థభాగము వర్ధిల్లుచున్నది. చైనా జపానులు, టిబెటు సయామీలు, బర్మా సిలోనులు, హిందూదేశమును తమ ధర్మజీవనమునకు జన్మస్థానముగ పరిగణించును. హిందూదేశనాగరికత యయినను అల్పాయువు కలది కాదు. దాని చారిత్రికాంశము లిప్పటికి నాలుగువేల సంవత్సరములకు పూర్వమువరకు వ్యాపించి యున్నవి. నాడే యది మహోన్నతి జెంది యనంతర మప్పుడప్పుడు మందమయినట్టియు దాదాపుగ కదలికయే కాన్పింపనట్టియు గమనము కలిగియున్నను, నేటివరకు నేకధారగ ప్రవహించినది. నాలుగైదువేల సంవత్సరములపైనుండియు నాధ్యాత్మికచింతనానుభవముల వలని సంఘర్షణమును శ్రమను భరించినది. భిన్ననాగరికతలకు, జాతులకు జెందిన జనులు, చరిత్ర ప్రారంభమునుండియు, హిందూదేశములోనికి గ్రుమ్మరుచున్నను, హిందూధర్మము తన యానైక్యతో

నిలుపుకొనగలిగెను ; ప్రచారమునకు గడంగిన మతములు కూడ, తమకు రాజ్యాధికారప్రాపక మున్నను, తమ యందు హైందవజనబాహుళ్యమును జేర్చుకొను సశక్తము లయ్యెను. ప్రబలతర పరసంప్రదాయములందు కాన్పింపని జీవశక్తి యేదో హిందూసంప్రదాయమునకు కలదని విదితమగుచున్నది. వృక్షమున జనరసప్రసరణము కలదని తెలిసికొనుటకు దానిని ఛేదింప నక్కరలేదు; అటులనే హిందూధర్మమునకు జీవమున్నదని గ్రహించుటకు శల్యపరీక్ష యనావశ్యకము.

పశ్చిమోత్తరరాజధాని, పంజాబు అని యిప్పుడు పిలువబడు ప్రాంతములకు సరిపోవునట్టియు, సింధు నదియు దాని యుపనదులును ప్రవహించునట్టియు ప్రదేశమును హిందూధర్మమూలస్థాపకులో, తత్ప్రాథమికావలంబకులో ఆక్రమించిన నాటనుండియు హిందూధర్మమున కాపేరు వచ్చెను.* సింధునదీప్రాచ్యతీరనివాసులు పారసీకులచేతను వారియనంతరము దాడివచ్చిన పాశ్చాత్యులచేతను హిందువు లని పిలువబడిరి. పంజాబునుండి ఈ ధర్మము గంగానదీప్రాంతములవరకు వ్యాపించి యచ్చటి యాదిమనివాసుల పెక్కు మతవిశ్వాసముల

* ఋగ్వేదము, VIII 24. 27.

నెదుర్కొనెను. అక్కడనుండి దక్షిణదేశమునకు ప్రాకి ద్రావిడనాగరికతతో కలిసి తత్సంపర్కముచే కొంత పరివర్తనము జెందెను, తుదకు దానినె వశపరచుకొనెను. యూనాద్యాభ్యాగతవర్ణపరిణామము మరియు పలుమార్పులనొందినను, ఆ నాగరికత సింధునదీతీరమున పొడసూపిన ప్రాచీనవైదిక ధర్మముయొక్క ప్రత్యేక స్వరూపమును మాత్రము సదా కాపాడుకొనెను. "హిందూ" శబ్దమునకు మొదట దేశమునే కాని మతమును సూచించు అర్థములేదు. విస్పష్టమగు నొక ప్రత్యేకప్రదేశమందలి నివాసము దానిని స్వీకరించెను. కొలదిగనో, గొప్పగనో యనాగరికులై యున్న యాదిమజాతులు, విశేషనాగరికులగు ద్రావిడులు, వైదికార్యులు—ఎల్లరు నేకమాతృభూమి సంతతి వారగుటచే హిందువులై*. హైందవ స్త్రీపురుషులు భిన్నదేవతారాధకులును, నానాకర్మనిష్ఠకులును, వివిధజనసమూహములకు జెందినవారునై యుండిరను విస్పష్టవిషయము హిందూతత్త్వజ్ఞు లంగీకరించిరి.

* తద్ వర్షం భారతం నామ భారతీ యత్ర సంతతిః।

। భారతేషు స్త్రియః పుంసో నానా వర్ణాః ప్రకీర్తితాః।
నానా దేవార్చనే యుక్తా నానా కర్మాణి కుర్వతే.

కూర్మపురాణము.

మీదుమిక్కిలి విదేశస్థులు ఆదినుండియు దేశమున గుంపులు గుంపులుగ ప్రవేశించి యందే నివసించి యీ సమస్యను మరింత క్లిష్టము చేసిరి. ఉత్తరమునుండి దక్షిణమునకు రెండువేల మైళ్లును, పశ్చిమమునుండి తూర్పునకు పదునెనిమిదివందల మైళ్లును పొడవు గలిగిన యీ మహాఖండమందు, అత్యంత విభిన్నములును దుర్జేయములు నయిన పెక్కు తెగలతో గూడి సర్వత్ర వ్యాప్తి నొందిన జనసమూహము ఏకహిందూసంఘముగ నెట్లు పరిణమిల్లెను ? దేశమున విశేషభాగమందు ఆధ్యాత్మికమగు నైక్యభావము కొలది శతాబ్దములలో నలముకొనెననియు, జ్ఞానోన్నతివిషయమున భిన్నశ్రేణులయందుండిన జనసంఘములు ఏకభావవాతావరణమున నిమగ్న మయ్యెననియు నంగీకరింపక తప్పదు. హిందువుల యంతశ్శాఖాభేదము లించుమించుగ బాహ్యములె; కాని హిందువులు ఒక సమానచరిత్రను ఒక సమాన సారస్వతమును ఒక సమాననాగరికతను గల ప్రత్యేకధార్మికవ్యక్తిత్వముతో వర్థిల్లిరి. “ అన్యదేశసంబంధాభావముచే గాని, రాజకీయౌన్నత్యమువలనగాని సంఘటిల్లెడు నైక్యతకంటె ఘనతరమగు గభీరాంతరిక భావైక్యత హిందూదేశమునకు నిస్సందేహముగ కలదు. ఆ యైక్యత

రక్తమునకు, వర్ణమునకు, భాషకు, దుస్తులకు, నడతలకు, కులమునకు జెందిన యసంఖ్యాకవిభేదముల నతిక్రమించును." అని విన్సెంటు స్మిత్తు (Vincent Smith) అభిప్రాయ మొసంగెను*. భిన్నజాతీయులను మిళితముజేసి శాంతిసౌఖ్యములతో జీవించుటకు శక్తివంతులనుగ మార్చుటలో తనకు దారిచూపి సాయపడు నేచారిత్రికజ్ఞానము లేకయే హిందూధర్మము స్వకీయపద్ధతుల నవలంబింప వలసినచ్చెను. జాతిమతనాగరికతావిషయములను గురించిన దురభిప్రాయములతో ప్రపంచమిప్పుడు నిండియున్నది. స్వవినాశకరములగు సంఘర్షణములనుండి మనల రక్షించు నుపాయముకొరకు తాత్కాలికముగ సధైర్యముతో మన మన్వేషించుచున్నారము. మతసంఘర్షణసమస్యను హిందూధర్మము పరిష్కరించు విధానమునుండి మనము నేర్చుకొనవలసిన పాఠములుండకపో వని నమ్మవచ్చును.

మతవిషయమున హిందువుల వైఖరి యాకర్షణీయము. మూఢమనోవిశ్వాసములు ఒక మతమునుండి మరియొక మతమును దూరముచేయును; కాని హిందూధర్మము తన కట్టహద్దుల కల్పించుకొనదు.

*Oxford History of India.

జ్ఞానము వివేకమునకు, నీమము అనుభవమునకు, బాహ్యాచరణము ఆత్మోపలబ్ధికి, లోనగుపబడినవి. మతము కేవల భావనాజనితము లయిన యూహాల వ్యామోహము గాని బాహ్యకర్మానుష్ఠానము గాని కాక యొక విధమయిన జీవితము, అనుభవము. అది సత్యము యొక్క ప్రత్యక్షదర్శనము, సంవిత్తోపలబ్ధి. ఈ యనుభవము భావోన్మేషము గాని యాంతరికభ్రాంతి గాని కాదు; సర్వాశ్రయుడగు సత్యస్వరూపునకు మన సంపూర్ణవ్యక్తి అనగా జీవాత్మ యొసంగు ప్రత్యుత్తరము. మతము సాధారణముగ మానసికదృఢనిశ్చయములతోను హృత్కల్పనారూపములతోను నైతికతారతమ్యములతోను మిశ్రితము చేయబడుచున్నను, అది మాత్రము జీవాత్మయొక్క ప్రత్యేకవైఖరియె గాని మరొకటి కాదు.

ఈశ్వరానుభవము తననుగూర్చి తానె ఋజువుపరచుకొనగలదు. అది స్వతస్సిద్ధము. దాని యోగ్యతాపత్రములు దానితోడనె యుండును. కాని సమకాలికజ్ఞానమును తృప్తిపరచి తన యంతరతమభావములను ధర్మద్రష్ట సహేతుకముగ స్థిరీకరించుకొనవలెను. ఇట్టి సహేతుకప్రతిపాదనము లేనియెడల, ద్రష్టయొక్క భావములు కేవల విశ్వాసానుగతములె యగును. ఇట్టి యర్థ

ములో మతము విశ్వాసముపై నాధారపడి యుండును. బాహ్యప్రమాణము నాధారము చేసికొని, ధార్మికజీవనము గడపవలసిన శ్రమ యక్కఱ లేకయె, యాధ్యాత్మికశాంతిసౌఖ్యముల పొందగోరు నంధవిశ్వాసము నుండి, జీవితానుభవములో బాగుగ వేరూనిన యాధ్యాత్మికవిశ్వాసము పూర్తిగ భిన్నము. "విశ్వాస మననేమి ?" యని ప్రశ్నించి యందునకు ప్రత్యుత్తరముగ, "ఎంత యథార్థమైనను, ఏ యొక యభిప్రాయము గాని యనేకాభిప్రాయముల కూడిక గాని యది కానేరదు. భౌతికవస్తుజ్ఞానార్జనమునకు దేహేంద్రియములవలె, అది యాధ్యాత్మికసత్యజ్ఞానసంపాదనమునకు సాధనభూతమగు నొక శక్తియె, జీవాత్మయొక్క దర్శనసామర్థ్యమె." యని వెస్లి మహానీయుడు (Wesley) బదులుచెప్పెను. నిబంధనమందలి గ్రుడ్డినమ్మకము రక్షణోపాయమగు విశ్వాస మెంత మాత్రము గాదు. విశ్వాస మన మూఢబాహ్యప్రమాణావలంబన మని పరిపాటియగుటకు శోచనీయమగు కారణము ఐరోపాలో క్రైస్తవమతము తదనుగుణమగు పద్ధతి ననుసరించుటయె. విశ్వాస మన స్వభావసిద్ధమగు ననువర్తనమని గాని యాత్మీయమగు దృఢనిశ్చయమని గాని మనము సరిగ నర్థము చేసికొనిన

పక్షమున, మతమునకు విశ్వాసము లేక సహజజ్ఞాన మనునది నామాంతరమె. ఇతర గ్రహణశక్తులవలె నాధ్యాత్మికగ్రహణశక్తియు భ్రమప్రమాదాదులకు లోనయి తార్కికవిచారణపరీక్షలకు గురి కావలసి వచ్చును. కావుననె మనము దానిని విశ్వాసమందుము. కాని సకల గ్రహణశక్తులవలె ధర్మము నుద్బోధించు సహజజ్ఞానము యోచనకు జన్మస్థానమును గమ్యస్థానము నయియున్నది. ఈశ్వరానుభవము యాథార్థ్యమును ప్రకటించునని నిరూపించుటకును, మతవిషయక సృష్టాభిప్రాయము సహేతుకసత్యముగ కనపరచుటకును, తద్విషయమున యుక్తాయుక్తముగు ప్రతిపాదనము మనము చేయుట యావశ్యకము. హైందవదార్శనికులకు హేతుజ్ఞానమనిన నెట్టి భయమును లేదు. జీవాత్మయొక్క ద్వివిధ శక్తులయిన హేతుజ్ఞానమును, సహజజ్ఞానమును తుదివరకు వేర్వేరుగ నుండనేరవు. జీవాత్మయొక్క ధార్మికజీవనమును పోషించి పెంపొందించు విశ్వాసములు భౌతికజగత్తుయొక్క స్వభావమునకును శాసనములకును అనుగుణముగ నుండవలెను. ఆ విశ్వాసముల యుద్దేశ్యము మనల వానితో సమరసపరచుటయె. సహజజ్ఞానప్రజ్వలితులగు సిద్ధపురుషుల ప్రబోధనములు

మహోత్కృష్టహిందూగ్రంథములగు వేదములందు సమ
కూర్చబడినవి*. వేదములు జీవితానుభవపునస్సంప్రతీకరణములె గాని మూఢవిశ్వాససంకలితగ్రంథములు గావు. తీక్ష్ణదివ్యదృష్టిసంపన్నులగు మహాత్ముల యాధ్యాత్మికానుభవములు వానియందు పొందుపరుపబడెను. ఉత్తమధర్మవేత్తల యనుభవములనే ప్రకటించును గావున, అవి ప్రామాణ్యములుగ పరిగణింపబడును. వేదవాక్యములు అంతరాత్మప్రబోధములు గానియెడల, అవి విశ్వాసపాత్రములు గానేరవు. ఆయా నిర్దిష్టపరిస్థితులు సమకూడినప్పుడెల్ల వేదప్రోక్తములయిన సత్యములు తిరిగి యనుభవ వేద్యములు కాగలవు. ఈశ్వరానుభవమునందలి సత్యాసత్యములను వట్టితర్కముచేతనే గాక జీవితమువలన గూడ విచక్షణచేయగలము. వివిధధార్మికభావములను తీసికొని యనుభవముద్వారమున పరిశీలించి మన యితర జీవితాంశములతో సమన్వయించుటవలన వానిలో నేవి నిర్దుష్టములయినవో యేవి కానివో గుర్తింపగలము.

వేదకాలమున ధర్మనిరతులు సత్యము నేయే సాధనలద్వారమున స్వానుభవసిద్ధము జేసికొనిరో, వానికెల్ల వేదములు నిలయము లయి ధార్మికజ్ఞానవికా

* తైత్తిరీయ ఆరణ్యకము. 1. 2.

సముల సాధారణసూత్రములను స్పష్టీకరించును. అనుభవములు భిన్నలక్షణోపేతము లగుటవలన, వానిని వ్యక్తీకరించు గ్రంథములును విశ్వతోముఖములు. ధర్మగ్రంథములు అనేకార్థద్యోతకము లని జయతీర్థుడు తన న్యాయసుధాగ్రంథమందు వ్యాఖ్యజేసెను.

ప్రతిమతమునకు, దాని పూర్వుల సముపార్జితము పూజ్యతను వడయుట, చాలావశ్యకము. పరంపరాగతజ్ఞానమును పవిత్రతాపాలనసేతముగ జేయు సంఘము అద్భుతముగ శక్తిస్థైర్యముల పొందగలుగును. వైదికసంప్రదాయము భక్తిభాజనమయి జ్ఞానమును తరతరములకు బరపి నాగరికతను నిరంతరాయముగ నిలిపెను. అంతే దృష్టిశూన్యులకు నయితము ఆధ్యాత్మికజీవనము యథార్థమని ధర్మగ్రంథములు తెలుపును. మానవు లనేకసమస్యలతోను సంక్షోభములతోను జీవితమునందు కలవరపడుచు, ప్రశాంతహేతువాదమునకు గాని నిశ్చలచింతనమునకు గాని విరామము లేక, తమ జీవితముల నడపుకొనుటకయి నిర్దుష్టసాధనముగ గ్రహింపదగిన నియమమును గాని ప్రణాళికను గాని పొందుటకు వాంఛింతురు. తన్మూలమున వారొక నవజీవనపథమున ప్రవేశపెట్టబడుదురు. సజీవసంప్రదాయము అంతశ్శక్తుల పురిగొల్పి

మన స్వభావమునకు నెక్కుడు మానవత్వము చేకూర్చి మనల నున్నతస్థితికి దెచ్చును. దానివలననె ప్రతియుగములోని జనులు ఒక ప్రత్యేకస్వరూపము దాల్తురు. ఆ ప్రత్యేకత ప్రతినాగరికజాతికిని వ్యక్తిత్వమును స్వాభిమానమును కలుగజేయును. స్వయముగ సత్యమును దెలిసికొన నభిలషించు వారికి కూడ ప్రాథమికస్థితులందు మార్గదర్శి యావశ్యకము.

వేదములయెడ హిందువుల కున్నదృష్టి విమర్శనా పరిశోధితమగు విశ్వాసముతో కూడినది. మన పూర్వుల కుపకరించిన నమ్మకములును ఆచారములును మనకు కూడ నుపయోగపడవచ్చును గాన వేదములయందు విశ్వాస ముంచుటయు, పూర్వయుగముల సాక్ష్య మెంత విలువ గలదియైనను ప్రస్తుతయుగము పరీక్షించి శోధించుటకు కలిగియున్న హక్కును తొలగింపజాలదు గాన వేదములను విమర్శించుటయు—రెండును ఆవశ్యకములు. పూర్వుల హృదయములందు వినవచ్చిన యీశ్వరవాణి యొక్క ప్రతిధ్వనులు అమూల్యములై యయినను, ఈశ్వరుడు తన జ్ఞానప్రేమలను ప్రకటించుట యెన్నడును సమాప్తి నొందింపలేదను సత్యమును మన మంగీకరింతుము గాన, ఆ ప్రతిధ్వనులయెడ మనకు గల గౌరవము

మితముగ నందున్నట్లు చూచుకొనవలెను. మరియు ధార్మికానుభవమును గూర్చి మనము చేయు వ్యాఖ్యానము విజ్ఞానపరిశోధనముల కనుగుణముగ నుండవలెను. భౌతికజ్ఞానము పెంపొందినకొలది బ్రహ్మజ్ఞానము అభివృద్ధి గాంచును. ప్రమాణగ్రంథములందలి సహేతుకము లగు భాగములను మాత్రమే యింద్రియసాక్ష్యమున కతీతించినవిగ నంగీకరింప దగును గాని యవి సంపూర్ణముగ నట్టివే యని యంగీకరింప దగదు. *

హిందూమతపు దార్శనికశాస్త్రము ఆశ్రయభూతమగు అనుభవమునుండి వెలువడి మరల దానినె శరణు జొచ్చుచున్నది. ఈ యాశ్రయము మాత్రము మానవస్వభావ మెంత విస్తీర్ణమో యంతవిస్తీర్ణ మయినది. ఇతరమతప్రణాళికలు ఏదోయొక ప్రత్యేకానుభవసిద్ధమగు నంశముపై నాధారపడును. ఉదాహరణమునకు క్రైస్తవమతమును దీసికొందము. జీసను మనస్సాక్షిని మించిన యమోఘమగు ప్రమాణపురుషు డను విషయము స్వతస్సిద్ధసత్య మనియు, జీవాత్మను రక్షించుటకయి ఆయనకు గల యాతురతను సామర్థ్యమును

* తాత్పర్యవతీ శ్రుతిః ప్రత్యక్షాద్ బలవతీ, న శ్రుతిమాత్రమ్.—భామతీ.

గూర్చి నమ్మకుండుట యసాధ్య మనియు భావించు వ్యాగ్రతవిశ్వాసముపై అది యాధారపడి యున్నది. ఈ ప్రత్యేకమగు నాధ్యాత్మికానుభవమును గలిగినవారు గాని యంగీకరించువారు గాని మాత్రమె క్రైస్తవమతావలంబకు లనదగుదురు. ఇతరానుభవములు భ్రమాజనితము లనియు, ఇతరమతగ్రంథములు దోషయుతము లనియు, వారు త్రోసిపుచ్చెదరు. హిందూధర్మము యాథార్థ్యము ననుసరించి యుండును; కాన నిట్టిప్రలోభనమున తగుల్కొన జాలదు. హిందూతత్త్వజ్ఞులు తమ యభిప్రాయములె గాక యితరులవి కూడ వెంటనే యంగీకరించి సమానగౌరవపాత్రములుగ తలంతురు. ప్రతిదేశములోను, ప్రతిజాతిలోను, ప్రతినాగరికతలోను గల యావన్మానవకోటియు ఈశ్వరసంతానమె యయిన యెడల, బ్రహ్మజ్ఞానము తమ శక్త్యనుసారము బడయుటకు నెల్లరు ఈశ్వరుని యపారకరుణవలన జ్ఞానశిక్షను పొందుచు ప్రేమతో పోషింపబడుచున్నారని మన మంగీకరింపక తప్పదు. భిన్నమానవులు భిన్నరీతుల ఈశ్వర సాక్షాత్కారమును ప్రయత్నపూర్వకముగ పొంది రని హిందువులు కనుగొనినప్పుడు, వారు ఔదార్యముతో ఆ విధానములనెల్ల గౌరవించి

చరిత్రయందు వానికి గల యథార్థస్థానము కాపాడిరి. వివిధసంఘములకు ప్రత్యేకముగ నున్న ధర్మగ్రంథములు ఆయా సంఘస్థుల యభిరుచులను శక్తులను పెంపొందించుటకును, వారి మనస్సును జీవితమును వికసింపజేయుటకును, వారి భావములను విజృంభింప జేయుటకును, వారి ప్రయత్నములను ప్రోత్సహించుటకును ఇంచుమించుగ నేకాధారము లైయుండుటవలన, వారి యభ్యున్నతి కొరకు హిందువులు తద్గ్రంథముల నుపయోగించిరి. హిందూధర్మము వేదప్రోక్తమె గాక పురాణేతిహాస ప్రోక్తమును గూడ నైయున్నది*. హిందూదేశస్థుల వివిధధర్మగ్రంథములలోను, సత్యమునుగురించి యంతర్వాణి నుడువు భిన్నప్రవచనములలోను గల యంతర్భావములను స్వీకరించుటచే, హిందూధర్మము మిక్కిలి విచిత్రములయిన యల్లికలతోను అంతులేని వేర్వేరు రంగులతోను కూడినట్టి జాలరువలె పరిణమించినది. పురాణములు క్రమవిరుద్ధముగ చేర్పబడిన చరిత్రాంశములను అద్భుతగాథలను గలిగి విశేషముగ నూహాకల్పితములగు గ్రంథము లయియున్నవి. కాని వానియందు కొందరుజనులు అభిమానము కలిగియున్నందున,

* శ్రుతి స్మృతి పురాణోక్త ధర్మాః.

అవి పవిత్రశాస్త్రములలో జేర్పబడినవి. యోగసాధనలను ముఖ్యముగ వివరించుచు, ఋగ్వేదకాలమునుండి కొన్ని సంఘములందలి జనుల జీవితములను నడపుచుండినట్టి తంత్రములు కూడ పవిత్రశాస్త్రములందు కూర్పబడినవి. అనేక హిందూకర్మములు తాంత్రికోపాసనా చిహ్నములను కనపరచుచున్నవి. మనుష్యుడు తన యాత్మను ఈశ్వరునివైపునకు మరల్చుటకు తోడ్పడు ప్రతిధర్మశాస్త్రము అనుసరణయోగ్యముగ నిర్ణయింపబడెను. "వేదములు, సాంఖ్యము, యోగము, పాశుపతము, వైష్ణవమతములు—వీనిలో నొకొక్కటియు నేదోయొక స్థలమున ప్రశంసింపబడెను. అభిరుచిభేదములనుబట్టి కొందరిది శ్రేష్ఠమని గాని యది శ్రేష్ఠమని గాని తలంతురు. కాని యెట్లు వక్రగతుల గలిగియున్నను నదులన్నియు సముద్రమును చేరులాగున నెల్లరు పరమపురుషుడవైన నిన్ను చేరుదురు."* కనుక

* త్రయీ సాంఖ్యమ్ యోగః పశుపతి మతమ్ వైష్ణవమితి
ప్రభిన్నే ప్రస్థానే పరమిద మతః పథ్య మితి చ
రుచీనామ్ వైచిత్ర్యాత్ ఋజు కుటిల నానాపథ జుషామ్
నృణామ్ ఏకో గమ్య స్త్వమసి పయసా మర్ణవ ఇవ
మహిమ్న స్తవమ్.

హిందూధర్మము ఏవోకొన్ని స్పష్టీకరింపబడిన మూఢ విశ్వాసవాలతో కూడిన మతముగాక యమితమును క్లిష్టము నైనను సూక్ష్మముగ నైక్యత నొందింపబడిన యాధ్యాత్మికజ్ఞానానుభవ సముదాయమె. ఈశ్వరోపలబ్ధి నిమిత్తమయిన కృషికి సంబంధించిన హిందూసంప్రదాయము ఏకధారగ యుగయుగములందు వర్ధిల్లుచు వచ్చెను.

సంప్రదాయము, తర్కము, జీవితము—వీని* ద్వారమున ధర్మమును వర్ధిల్లజేయు వాదములుహిందూ ధర్మము మార్పుజెందుట కవకాశము కలిగించి దానిని రక్షించుటకు దోడ్పడెను. ధర్మమును తత్త్వశాస్త్రమును జీవితమును, జ్ఞానమును, ఆచరణమును ఆదర్శమును, క్రోసిమహాశయుడు (Croce) నుడివినట్లు, సదా ఆత్మనుండి వెలువడు స్వరవిన్యాసమె. సత్యముయొక్క యంతులేని యుచ్చతరపదవుల బడయుట యను సభ్యోన్నతిభాగ్యము, జీవితమునుండి భావమునకును, భావమునుండి జీవితమునకును, లేచుచు మరలు చుండుటవలన, మనము పొందుదుము. అనుచరుల స్వాతంత్ర్యప్రయత్నములచే నెప్పటికప్పుడు నిర్మింపబడి పునస్సృష్టి గాంచు

* శ్రవణ. మనన. నిధిధ్యాసన.

నదియె సంప్రదాయము. చిరకాలము నిలచి యుండు నట్లు నిర్మింపబడునది చిరకాలము నిర్మింపబడుచునే యుండును. ఒక సంప్రదాయము వృద్ధి నొందుచుండని యెడల, దాని యనుచరులు ఆధ్యాత్మికముగ మృతి నొందిరని తలంపవలెను. హిందూమతచరిత్ర మంత లోను, జ్ఞానయోగులును కర్మయోగులును నూతనపరిస్థితులకు దగినట్లు నవీనాదర్శముల నుత్పన్నము చేయుచు క్రొత్తపద్ధతులను స్వానుభవమూలమున పరిశీలించుచు నెడతెగక పాటుపడిరి. వైదికార్యులకు ఆదిమనివాసులతో సంపర్కము కలిగినప్పుడు, అభివృద్ధివిషయమున మొదటిహెచ్చరిక లభించెను. గంగానదీప్రాంతమునకు వారు వెడలినప్పుడు, జైన బౌద్ధమత రూపములతో సంస్కరణోద్యమములు అట్టి ప్రేరణవలననె బయలుదేరెను. ఉన్నతనాగరికులయిన ద్రావిడుల సాంగత్యము వలన వేదమతము ఆస్తికమతముగ మారెను. రామానందుడు, చైతన్యుడు, కబీరు, నానకు—వీరి సంస్కరణోద్యమములు మహమ్మదీయమతప్రబోధమును వ్యక్తి పరచును. పాశ్చాత్యసంస్థలసంబంధము బ్రాహ్మసమాజమును ఆర్యసమాజమును ఉద్భవిల్లుటకు కారణమయ్యెను. కాని హిందూధర్మము వివిధాభిప్రాయములయొక్క

వట్టికలయిక యని గాని మహాకల్లోలమని గాని త్యజింప జనదు. ఏలయన అది యంతర్వ్యాప్తి పొందుచున్న క్రమవికాసమును ప్రదర్శించును. హిందూధర్మము యొక్క ప్రతివిధానమును, దాని యభ్యాసనియమావళి ప్రతి శ్రేణియు సమానమూలకంబగు వేదాంతముతో సంబంధము కలుపబడినవి. హిందూధార్మికజ్ఞానము అనేకవిజ్ఞానములను దాని గొప్పవిజయములను గాంచి యున్నను దాని ప్రధానభావములు మాత్రము నాల్గైదు సహస్రాబ్దములనుండియు నొక్కతీరున నిలచినవి. ఆ వివిధోద్యమముల యుద్దేశములు వేదాంతశాస్త్రమున బీజప్రాయముగ నుండియె యున్నవి.

ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, భగవద్గీత— అను వేదాంతప్రస్థానత్రయము విశ్వాసము, జ్ఞానము, సాధన—అను మూడంతస్తులకు క్రమారమిగ జెంది యున్నవి. ఉపనిషత్తులు ఋషుల యనుభవములయొక్క సంపుటీకరణములు. వాని ముఖ్యలక్షణములు గాకున్నను, తర్కమును సాధనయు వానియందు గానబడును. బ్రహ్మసూత్రములు ఉపనిషత్తులలోని ప్రధానసారాంశములను తార్కికపరిభాషయందు వ్యాఖ్యానము చేయుటకు యత్నించును. భగవద్గీత యథార్థధర్మజీవనము

మనము పొందగలుగుటకు తోడ్పడు ముఖ్యసాధనలను బోధించు యోగశాస్త్రముగ ప్రాధాన్యత వహించెను. అవి యన్నియు కలసి హిందూధర్మమున కమోఘ ప్రమాణగ్రంథము లయ్యెను. అరణ్యమున సింహము గాన్పించినతోడనే జంబుకములు తమ రోదనముల విరమించునట్లి, వేదాంతదర్శనము కాగానే యితరధర్మ శాస్త్రములు నిశ్శబ్దము లగునని ప్రతీతి గలదు.* వివిధహిందూమతశాఖల వారెల్లరు తమ యభిప్రాయములకనుగుణముగ వేదాంతగ్రంథములకు వ్యాఖ్యజేయుదురు. వేదాంతము ఏదో యొక మతము గాక యత్యంత విశ్వజనీనమును గభీరమును నయిన యర్థమందె మతమని చెప్పనగును. అందువలన వివిధహిందూమతశాఖలు ఆ సమానప్రమాణముతో సమన్వయము చేయబడి, ఒకే యథార్థధర్మముయొక్క వికృతరూపములుగ గూడ కొన్నిసమయములందు నిర్ణయింపబడుచున్నవి. మహాభారతము వచించునట్లు బుద్ధిభ్రమవలన భిన్నవేదములు జనించినను వేద మొక్కటియె; దాని భావమును ఒక్క

* యావద్ గర్జంతి శాస్త్రాణి జంబుకా విపినే యథా
నగర్జతి మహాశక్తిః యావద్ వేదాంతకేసరీ

టిరెు.* ఈ యేకప్రమాణమును అంగీకరించుటవలన భిన్నశాఖలు పరిస్ఫుటములగుచున్నవి. ఒక నవీనమతము నందు వేదప్రమాణమున కనుగుణముగ లేని భాగములు అంత విలువగలవిగ నెన్నబడక క్రమక్రమముగ త్యజింపబడును. వేర్వేరు మతములును, వేర్వేరు సమ్మేళనములును ప్రాగిలినవి గాని ప్రకృతికాలమునకు సరిపడనివి గాని యవి వంతముగ తొలగింపబడకుండుటయే గాక, వానిలో నొక్కొక్కటియు నంతమాత్రము సంస్కృతము గాను వేదాంతములోని యాధ్యాత్మప్రభావముచే ప్రవృత్తిజెందగ.

ఇట్లుండగ ఆ భ్రాంతియు యానునదియేల, అనుభవింపదగినది యొక్క యీ ప్రశ్నము బయలుదేరెను. ఈ ప్రశ్నమునకే రెండు మతములును సమానప్రత్యుత్తర మిచ్చుచున్నట్లు కనబడదు. సిద్ధపురుషులు (Mystics) కల్పించు భిన్నభగవత్స్వరూపములను హిందూతత్త్వవేత్తలు తన కృషియందు ప్రప్రథమముననే గ్రహించెను. వివిధమతముల నొకదానితో నొకటి సరిపోల్చి చూచుటవలన సిద్ధపురుషుల దర్శనము భిన్నప్రకారములనున్నదని మన మిప్పుడు తెలిసికొనుచున్నాము.

* ఏక ఏవ ద్విజా వేదో వేదార్థశ్చైక ఏవ హి
ఏక వేదస్య చాజ్ఞానాత్ వేదాస్తే బహవః కృతాః

తమయున్నతసమాధియందు, పిత, పుత్రుడు, పరిశుద్ధాత్మ-అను త్రిమూర్తులను దర్శింతుమని కొందరు క్రైస్తవసిద్ధపురుషులు తెలుపుదురు. పూర్వాచారపరులైన మహమ్మదీయ సిద్ధపురుషులు ఈ మూర్తిత్రయీభావము నంగీకరింపరు. అట్టి భిన్నాభిప్రాయములనుబట్టి ఈశ్వరానుభూతియందు కేవలాత్మస్ఫురణములకు మనము బాహ్యవిషయాస్తిత్వము నారోపించుచున్నామని హిందూతత్త్వవేత్తలు తొందరపడి నిర్ధారణచేయరు. "సర్వసృష్టికర్తయు, సర్వదా జీవులహృదయములందు వసించు పరమాత్మయు నయిన భగవానుని భావన, జ్ఞానము, క్రియాశక్తి రూపకల్పన చేయును. అది యెరిగినవారు అమృతు లగుదురు.*" అని యుపనిషత్తు ఘోషించుచున్నది. మెరుగుపెట్టని స్వచ్ఛమగు సత్యముయొక్క నిజస్వరూపమును ఈశ్వరానుభూతి వ్యక్తపరుపదు; కాని దర్శించు బుద్ధియొక్క భావములచేతను పక్షపాతములచేతను మార్పు

* ఏష దేవో విశ్వకర్మా మహాత్మా సదా జనానామ్
హృదయే సన్నివిష్టః
హృదా మనీషా మనసాభిక్లృప్తో య ఏతద్విదు
రమృతాస్తే భవంతి.
శ్వేతాశ్వతరోపనిషత్. iv. 17.

జెందిన సత్యమునె ప్రకటించును. మానవుని బుద్ధి యంశాంశములుగ కార్యములందు నియుక్తము గాదు. జ్ఞానము, భావన, క్రియాశక్తి అని పూర్తిగ వేరుపరుపబడిన యేకొలది భాగములక్రింకనో యది విభక్తము గానేరదు. మానవబుద్ధి సర్వజనులలో నొక్కవిధముగ నున్నదని సమర్థించుటకు దగినంత నగ్నముగను కల్మషరహితము గను లేదు. భిన్నతత్త్వశాస్త్రములు భిన్నరుచులను ప్రకటించుచున్నవని ఫలప్రాధాన్యవాదులు (Pragmatists) చెప్పి ధార్మికతత్త్వజ్ఞానమునకు నెన్నదగిన మహోపకార మొనరించిరి. తమయందు లీనమయిన సంకుచితభావములతో నేర్పడిన ఫలకమునందె మానవులకు ఈశ్వరుడు ప్రత్యక్షమగును. ప్రతిమహాత్ముడు తనకు స్వయంకృషి మూలమునను జాతీయచారిత్రిక సంప్రదాయములవలనను లభించిన జ్ఞానము ననుసరించి యీశ్వరుని యద్భుత ప్రభావమును ప్రకటించును. ధార్మికానుభూతి భిన్న తత్త్వములుగల మానవబుద్ధులద్వారమున ప్రకాశించునని మనము గ్రహించినప్పుడు, ఈశ్వరునికి భిన్నస్వరూపము లెట్లుకలుగుచున్నవో సులభముగ తెలిసికొనగలము.

ఈశ్వరునిగూర్చి చేయబడు వర్ణనలు పరస్పర విరుద్ధములుగ నున్నవను వాదన యప్పుడప్పుడు

తేబడును. అది మన యభిప్రాయములు నిజములు గావని మాత్రమె తెలుపును. మన భావములు సరిగా లేవని చెప్పుట యన నవి యెవరి నుద్దేశించుచున్నవో యా పరమేశ్వరుని యస్తిత్వము నంగీకరింపకపోవుట గాదు. న్యాయపురుషు డని, పరిశుద్ధ ప్రేమ స్వరూపు డని, ఈశ్వరునిగురించి చేయబడు నుత్తమనిర్వచనములు, ఆది కాలమునాటి నిరంకుశప్రభువువంటివా డనియొ,సమీపింప నలవి కాని యాకాశమందున్న సుల్తా ననియొ పరిగణించు నికృష్టనిర్వచనములకు వ్యతిరేకముగ నుండవచ్చును. కానియవి యన్నియు నొకే యాథార్థ్యమునుగురించి తెలుపుట కుద్దేశింపబడినవి. ఇంద్రియజన్యమగు నవగాహ మందును వైజ్ఞానికపరిశోధనమందును భ్రమాశీలుడగు వ్యక్తిమూలమున విషయాస్తిత్వమునకు భంగము కలు గనియెడల, ధార్మికవిచారణయందు నట్టిప్రమాదము సంఘటిల్లునని యూహించుటకు కారణము కాన్పించదు.

సర్వాంతర్యామి యగు పరమపురుషుని దెల్పు నిర్వచనము లాతని నిజస్వరూపమున కెంతదూరముగ నున్నను, హిందూభక్తు డాతని యస్తిత్వము నెన్నడు శంకింప లేదు. సిద్ధాంతు లేమి చెప్పినను, ఈశ్వరభక్తులు తమ సృష్టినుండి మరుగై యున్నది యెంతయో కలదని

నుడువులకై యాతురపడెదరు. ఈశ్వరుడు దాగి యున్నాడు. పరమాత్ముని స్వభావమునుగురించి చెప్ప వలసివచ్చిన, మూకీభావము వహింపుడని మనల నాదేశించు ధార్మికాజ్ఞేయవాదము ప్రశంసనీయ మయినదే. ఈశ్వరుని గభీరతవిషయమై భాషకంటె మౌనమె యెక్కుడు భావద్యోతకముగ నుండును. గ్రీకురోమనులు అగోచరదేవతలకు నిర్మించిన వేదికలు ఈశ్వరస్వభావము మానవుని కేమియు తెలియదని ప్రకటించుచున్నవి. దర్శనాతీతుని యన్వేషణమున మానవాపజయసూచకమగు రూపకల్పనను వారు గావించిరి. ఈశ్వరస్వభావ మెట్టిదో నిర్వచింపుడని కోరగా, ఉపనిషత్కారుడు నిశ్శబ్దత నెందెను; ప్రత్యుత్తరమునకై నిర్బంధింపగా, "సర్వాతీతుడగు ఈశ్వరుడు శాంతమూర్తి" అని మాత్ర ముద్ఘోషించెను. శాంతోయమ్ ఆత్మా. ఈశ్వరుని సత్యస్వరూపవైచిత్ర్యము భాషావిగ్రహాది ప్రకటన సాధనముల నతిక్రమించును. భక్తులు తమ కీశ్వరునితో గలిగిన ప్రత్యక్షసంయోగమునుగూర్చి తమ యనుభవముల వివరించుచు "దివ్యతమస్సు", "అవర్ణనీయము" మొదలగు వచనములు ప్రయోగించిరి.

"అచ్చోటికి చక్షువు పోజాలదు, భాష పోజాలదు,

మనస్సు కూడ పోజాలదు. దానివిషయమై మాకు తెలియదు. అది యెట్లు బోధింపవలెనో యదియు తెలియదు." * అని యభావాత్మకములగు వాక్యములతో ఈశ్వరప్రత్యక్షాస్తిత్వమును గూర్చి హిందూశాస్త్రజ్ఞులు వ్యక్తీకరించిరి. "నేతి" యను యాజ్ఞవల్క్యుని నిర్వచనము, బర్నార్డు (Bernard) చెప్పిన "అజ్ఞేయము"ను, రాయస్‌బ్రూక్ (Ruysbroeck) తెలిపిన "ప్రియుల తన్మయత్వహేతువగు గాఢనిశ్శబ్దత"ను, డయొనీషియస్, (Dionysius the Areopagite) ఎకార్టు, (Eckhart) బోహిమ్ (Boehme) అనువారు గావించిన వర్ణనలను, మనకు జ్ఞప్తికి దెచ్చును.

కాని యీ సర్వాతీతమగు నిశ్శబ్దతతోడనో లేక యభావాత్మకములగు నిర్వచనములతోడనో మానవాత్మ తృప్తిజెందుట యతికష్టము. మనుష్యుడు మాటలాడు జంతువు. స్వానుభవపురస్సరములగు వచనములతో ధార్మికమర్మమును గూర్చి వ్యాఖ్యచేయుటకు బూనును. కేవలము పరము, పూర్తిగ ననంతము నట్టియస్పష్టముతో సమముగ గాన్పించును. మానవాత్మ యేదో స్పష్టమును పరిమితము నయిన దానికొరకు పరితపించును.

* కేనోపనిషత్. 3.

కావున పరమపురుషుని పరిచితలోకమునకు దెచ్చుటకు తన శక్తిసామర్థ్యముల నుపయోగించును. మన యూహా నుపయోగింపక, ఈశ్వరచింతన సలుపుట యసాధ్యము. ధర్మద్రష్టకు తన దర్శనవిషయము వ్యక్తీకరించుటకయి యూహాయొక్క సాహాయ్య మవసరము. "కథలు చెప్పకుండ ఆయన (జీససు) వారితో మాటాడ లేదు." ఆత్మజ్ఞానాన్విత పురుషు డనునది మన మీశ్వరపరముగ నుపయోగింపదగిన యుత్తమపదము. మనము పురుషులము. ఈశ్వరుడు ఉత్తమపురుషుడు. పురుషత్వమును మనము విభజించినయెడల, అందు జ్ఞానము, భావన, ఇచ్ఛ యనునవి గలవనియు, ఈశ్వరుడు పరమజ్ఞానస్వరూపుడు గను అపార ప్రేమసాగరుడుగను పరిపూర్ణ క్రియాశీలుడుగను అనగా బ్రహ్మవిష్ణుశివస్వరూపములుగ దర్శన మవునని యు మనకు గోచరించును. సాధారణజనులు తెలుపునట్లు, ఆ స్వరూపములు ఆత్మజ్ఞానాన్వితములగు మూడు ప్రత్యేకమూర్తులు గాక, ఒకే యద్భుతపురుషుని మూడు ఆకారములు. ఈత్రిమూర్తులలో నేదోయొక దానితో సంబంధముగ, మనదేశములోని వివిధదేవతా విగ్రహములు నెలకొల్పబడినవి.

స్వభావమునుబట్టి మానవాత్మ భిన్నలక్షణసమ

న్వితము; అది చరించెడు నావరణము కూడ నట్టిదె. అనంతజీవాత్మయందు అనంతావరణములవలన చేకూరు ఫలితము లెట్టివో యిదమిద్ధమని నిర్ణయించుట యసాధ్యము. సాంతముయొక్క యొత్తిడివలన బాధపడు నప్పుడు, మనము అనంతము నాశ్రయింతుము. మన కనేకములగు వేర్వేరు తావులయందు సాంతమువలన సంఘర్షణము కలుగును. ఈశ్వరునివిషయమై పలువిధములగు నృత్తాంతములను మన మొసంగుటకు ఈ భిన్నముఖ సంఘర్షణమె కారణము. “ఎవరి స్వభావ మనుసరించి వారి కీశ్వరతత్త్వము కాన్పించును.” అని కేంబ్రిడ్జియందలి ప్లెటో (Plato) యనుచరుడు జాన్స్మిత్తు (John Smith) నుడివెను. ప్రపంచముయొక్క యస్థిరతయు, నిత్యపరివర్తనాశీలతయు ఉపనిషద్ద్రష్టల మనములందు నాటుకొనెను. క్షణములో మాయానీహారమువలె నదృశ్యము కానిదై సత్యమని వ్యవహరింపబడు అనంతయాథార్థ్యముకొరకు వా రన్వేషించిరి. ప్రపంచములోని దుఃఖము, బాధ బుద్ధుని హృదయము భేదించెను; సాంత సృష్టిజాలమెల్ల నస్థిర మనెడు ఆయన విశ్వాసమును పదను పరచెను. కావున ఆయన సనాతనధర్మము నాశ్రయించి తన్మూలమున విముక్తి గాంచెను. మనస్సాత్త్వికి గల పరి

పాలనాధికార గాంభీర్యమును అమోఘవశీకరణశక్తియు హెబ్రూప్రవక్తలను మహమ్మదును విస్మయులజేసెను. సర్వాధికారములు రాజునుండి వెలువడునని వారికి తెలియును గనుక, పరమపురుషుని రాజాధిరాజుగను మహాచక్రవర్తిగను కల్పనచేసిరి. పరమపురుషుని ముఖ్యలక్షణములగు క్షమాశీలతను ఔదార్యమును గౌరవించినంతగా క్రైస్తవమతసంస్థలు ఈ నైతికపరిపాలనాధికారనిరంకుశత్వమును మన్నింపవు. ఈశ్వరుడు మన స్వర్గలోకపిత. మన మాయనను త్యజించి సంచరించు నవిధేయసంతానము. కాని తండ్రిని చేరుటకు నిచ్ఛ కనపరచిన తోడనె, సంతోషముతో మనల నాహ్వానించుట కాయన మాత్రము సదా సంసిద్ధుడు. తండ్రులు న్యాయశీలురు ; తల్లులు క్షమాశీలురు. కాన కాథలిక్కు క్రైస్తవులు, శాక్తేయులు ఈశ్వరుని మాతగా దర్శింతురు. తన వత్సమును నిర్మాలిన్యము చేయు గోవునందు గన్పట్టు వాత్సల్యముతో నామె దయార్ద్రహృదయము శిశువునెడల పొంగిపొరలును. ప్రకృత్యోపాసనమొదలు రామకృష్ణపరమహంసయు ఫ్రాన్సిస్ భక్తుడును (St. Francis) ఈశ్వరుని మాతాపితలుగ ప్రేమించి సలిపెడు నారాధనవరకును, ఆయనను గూర్చి ప్రబలిన ప్రత్యభి

ప్రాయము, జీవాత్మపరమాత్మల వివిధ పరస్పర సంబంధములలో నేదోయొకటి సూచించును. ప్రత్యుపాసనావిధానము, ప్రతిప్రార్థనాప్రణాళిక ఉపాసకుని మానసిక స్థితి కనుగుణముగ నుండును. కాని యొక్కొక్కటియు పాక్షికముగ సత్యమె యయినను, ఏదియు సంపూర్ణ సత్యము గాదు. మనల పాలించు న్యాయము కన్నను, శిక్షించు న్యాయమూర్తికన్నను, ఐక్యముచేయు ప్రేమకన్నను, జన్మకారణుడగు జనకునికన్నను, మన యాశావాంఛలకు లక్ష్యమగు జననికన్నను ఈశ్వరు డధికుడు. "ఏకసత్యస్వరూపు డగు నాతనిని ఋషులు బహువిధముల సంబోధింతురు."* "మహాత్ములు ప్రకటించిన విధమున నా (ఈశ్వర) నామము లనేకములు."• దేవుని వివిధవర్ణనల నంగీకరించుట యన బహుదేవతల మన్నించుట యెంతమాత్రము గాదు. ఎందరు దేవతలు గలరో తెల్పుడని యాజ్ఞవల్క్యుని కోరినప్పుడు, ఆయన సాధారణసంఖ్య 3306 ను మొదట పేర్కొని తుదకు వానినన్నిటిని ఒకే పరబ్రహ్మముగ సూక్ష్మీకరించి విర

* ఋగ్వేదము, 1. 164. 46.

• బహూని మమ నామాని కీర్తితాని మహర్షిభిః
మహాభారతము, శాంతిపర్వము.

మించెను. "అవినాశమును శాశ్వతము నైన యీ సత్య స్వరూపము ఏకమాత్రమని గ్రహింపవలెను."*

ఈ భిన్నస్వరూపములు, ఈశ్వరుడు తనలో తా నెట్టివాడై యున్నది తెలుపక మన కెట్లు గాన్పించునో దానినె తెలుపును. మానవప్రకృతి నిర్ణయించు ఈశ్వర భావము మన యక్కరల ననుసరించియుండును. పుష్ప ములయందు, నక్షత్రములయందు, చిన్నపక్షులయందు, పసిపాపలయందు, భగ్నహృదయములందు, వానిని చక్కపరచు కార్యములందు మనకువలె ఆయనకు కూడ శ్రద్ధయుండునని యారోపింతుము. కాని మనకొరకు మాత్రమే గాక ఆయన తనకొరకు సయితము వెలయు చున్నాడు. మానవసౌకర్యసంధాయకమగు నుపకరణ ముగ మన మాయనను భావించుటచే, మనప్రాముఖ్యత నధికము చేసికొనుటయె యగును. మన విలువ ఈశ్వ రుడు నిర్ణయించుటకంటె ఈశ్వరుని విలువ మన మెక్కు డుగ నిశ్చయించు చున్నట్లు కాన్పింతుము. "మేము పాపములో పడుట నీ యదృష్టము. మేము నీకు నామ రూపముల కల్పించితిమి. నిరాకారుడును ఏకాకియు నగు

* ఏక ధైవాను ద్రష్టవ్యమ్ ఏత దప్రమేయమ్ ధ్రువమ్.

బృహదారణ్యకోపనిషత్. iv. 4. 20.

నీ కొరకు మేము గాక యింకెవరు వెదకుచు వచ్చెదరు? చీకటిమూలమున వెలుగు ప్రకాశించును; తాపబడిన యెడల వజ్రమునకు కాంతి కలుగును. అనారోగ్యమె ధన్వంతరి యవసరమగుటకు కారణము. ఆరోగ్యవంతు డాయనను తెలిసికొనవలె నని యేల వాంఛించును? విష మునుబట్టి యమృతమునకు విలువ యేర్పడును. ఒకదా నితో నొకటి సరిపోల్చి నప్పుడె, ఇత్తడిబంగారములలో నొకటి హీనమును మరొకటి ఘనము నగుట సంభవిం చును. ఓ ఈశ్వరా, మే మున్నాము గనుక, నీకు ఈ శ్వరత్వము లభించెను. ఈ సంగతి తెలిసికొను డని తుకా చెప్పుచున్నాడు."* తా నితరుల కెట్లు కనబడు నదియు, తనకు తా నేమై యుండునదియు—రెండును ఒకటి కాదు.

సృష్టికి మూలకారణ మేమేమి యను సమస్యను ధార్మికదృష్టితో పరిష్కరింపబూను ప్రతి యత్నమునకు నిర్గుణస్వరూపుని గాని సగుణస్వరూపుని గాని యంగీక రింపక తప్పినది కాదు. హేతుజ్ఞానపూర్వకమగు తర్క మును, ధ్యానపూర్వకమగు చింతనమును ఈశ్వర నిర్గుణ త్వము నభిమానించుచుండ, నైతికమగు ఆస్తికమతము

* తుకారామ్, iii, 8ı.

ఈశ్వరసగుణత్వమును మన్నించును. ఉపనిషత్కాలము నుండి నేటివరకు, హిందువుల భావ మట్లు ద్వివిధముగ నున్నది. క్రైస్తవమతమునందు ఈ సందిగ్ధతనె కనుగొందుము. క్రైస్తవ సిద్ధపురుషుల యున్నతాశయములు ఈశ్వర సగుణత్వాదర్శము నతిక్రమించును. సాధనఫలము లయి మహోన్నతములును అత్యంత భావగర్భితములు నగు కొన్ని యనుభవములు సగుణస్వరూపునిపై నాధారపడి యున్నవని హిందూధర్మము వక్కాణించును. ఈశ్వరుడు సగుణు డని నిర్వచించుట బుద్ధికనివార్యమయ్యెను. హిందూతత్త్వజ్ఞులు ఈశ్వర సగుణత్వమునకు భంగము కలిగింపకపోవుటయె గాక ఆ యాదికారణుని నిర్గుణత్వమును మన దృష్టి పథమునుండి తొలగకుండ జేసిరి. ఈశ్వరసగుణత్వ మొప్పుకొనువారు సయితము మన బుద్ధి కందరాని నిమ్నోన్నతములు ఈశ్వరతత్త్వమందు గలవని చూపుదురు. మనము గ్రహించిన యాత్మజ్ఞానాన్విత సగుణస్వరూపునికంటె సృష్టిస్థితిలయకారణుడగు పరమేశ్వరుడు ఎంతమాత్రము తీసిపోడనుట నిశ్చయము. ఆతడు కార్యములలో నొక కార్యము గాని కారణములలో నొక కారణము గాని కాడు; కాని సమస్త కార్యకారణములలో నంతర్యామియై

యున్న యాంధారభూతుడు, సూత్రధారుడు. స్వానుభవ పూర్వకవర్ణనలు సగుణాత్మకములు. నిర్గుణాత్మకవర్ణనలు సర్వాతీతునకు జెందును. ఈ ద్వివిధవర్ణనలు ఒకే సత్యమును దెలుపును. స్వతస్సిద్ధముగ దాని స్వభావ మెట్టిదో మనము స్పష్టీకరించునప్పుడు నిర్గుణపరబ్రహ్మముగను, దానికి మనతోగల సంబంధమును నిరూపించునప్పుడు సగుణభగవానుడుగను, మనము దానిని గ్రహింతుము.*

హిందూతత్త్వజ్ఞులు ఈశ్వరుని గురించిన మన జ్ఞానము పరిణామము జెందునని విశ్వసింతురు. మన భావములు ప్రకటింప యత్నించుచున్న సత్యముయొక్క యంతరాళములోనికి మన సమస్తాభిప్రాయముల నతీతించి ప్రవేశించువరకు మనము వాని నెడతెగక మార్చుకొనవలెను. విశ్వమానవకోటికి ఒకే ప్రత్యేకాదర్శమును పరిమాణముగ బెట్టి యీశ్వర భావములలో గొన్ని దోషరహితములనియు గొన్ని దోషయుతములనియు హిందూధర్మము విచక్షణ చేయదు. అది మానవులు తమ యభివృద్ధికి దగినటుల భిన్నమార్గములందు గమ్యస్థానమగు పరబ్రహ్మమును చేరుటకు యత్నింతు రను

* వదంతి తత్ తత్త్వవిద స్తత్త్వమ్ యజ్జ్ఞాన మద్వయమ్
బ్రహ్మేతి పరమాత్మేతి భగవానితి శబ్ద్యతే.

విస్పష్టాంశమును అంగీకరించును. ఈ యన్వేషణమందలి ప్రత్యభివృద్ధితోడను సానుభూతి జూపును. పచ్చని యాకులను చిగిరించు శక్తులె యెఱ్ఱని పువ్వులను బూయించుట కెట్లు కారణము లగునో యట్లే జీవాత్మ కొంత యభివృద్ధి జెందినప్పుడు శక్తిస్వరూపుడుగను, మరికొంత యభివృద్ధి నొందినప్పుడు సగుణస్వరూపుడుగను, ఇంకను అభివృద్ధి గాంచినప్పుడు సర్వాధారుడగు నాత్మ స్వరూపుడుగను, దాని కీశ్వరుడు దర్శన మిచ్చును. ఎఱ్ఱనిపూలు పూర్ణసత్యమును వెల్లడించు ననియు, పచ్చని యాకులు పూర్తిగ సత్యశూన్యము లనియు, మనము నుడువజాలము. హిందూధర్మము, సర్వమతాభిప్రాయములు వాస్తవము లని యెంచి, హెచ్చుతగ్గులతో వానికి స్వకీయముగ నుండు విలువనుబట్టి వాని నొక దాని తరువాత నొకటిగ క్రమమయిన వరుసలో నుంచును. పామరుల యద్భుత బహుదేవతారాధనలును పండితుల విశుద్ధైక బ్రహ్మోపాసనయు భిన్నాభివృద్ధులు జెందియున్న యొకే యాత్మయొక్క భావప్రకటనము లని హిందువులు దలంతురు. ఈశ్వరజ్ఞానమును నిరంతరకృషిచే ప్రవర్ధమానము జేయవలయు నని హిందూధర్మము విధించును. "నిర్గుణోపాసకులు అగ్రస్థానము వహింతురు ; దాని తరువాతి

స్థానము సగుణోపాసకులు ఆక్రమింతురు ; వారిక్రిందను రాముడు, కృష్ణుడు, బుద్ధుడు మొదలయిన యవతారము లను బూజించువా రుందురు ; వారి యడుగున పితరులను దేవతలను మహాత్ములను ఆరాధించువారు వచ్చెదరు ; అందరికంటె నధములు భూతపిశాచములను గొలుచు వారు "* "కొందరి దేవతలు జలమునందు (స్నాన ప్రదేశములందు) గలరు; వారికంటె నెక్కుడు జ్ఞానము గలవారి దేవతలు దివియందు గలరు; (ధర్మమునందు) శిశుప్రాయులైన జనుల దేవతలు శిలాదారు విగ్రహము లందు గలరు. కాని ఋషి తన దేవుని తన యంతరాత్మ యందు కనుగొనును "♦ "క్రియాశీలుడు అగ్నియందు, భావనాశీలుడు హృదయమునందు, అల్పబుద్ధుడు విగ్రహ మునందు, దేవుని కనుగొందురు. కాని సుజ్ఞాని దేవుని

* ఉపాసనా బ్రహ్మణః ప్రోక్, ద్వితీయా సగుణస్య తృతీయా స్మర్యతే లీలా విగ్రహో పాసనా బుధైః ఉపాస్త్య పితృదేవర్షి గణానామ్ అస్త్యుపాసనా అంతిమాం క్షుద్ర దేవానామ్ ప్రేతాదీనామ్ విధీయతే.

♦ అప్సు దేవా మనుష్యాణామ్ దివిదేవా మనీషిణామ్ బాలానామ్ కాష్టలోష్టేషు బుధస్యాత్మని దేవతా.

సర్వత్ర దర్శించును.''* ఋషులు విగ్రహములందు గాక తమ యాత్మలందు పరమేశ్వరుని వీక్షింతురు. శివస్ ఆత్మని పశ్యంతి ప్రతిమేషు నయోగినః.

అయినను ఈ క్రమోన్నతి విధానమును హిందువులలో పలువురు పాటింపక యన్నిస్తరములని నిర్వివాదముగ తెలిసి యీశ్వర భావములందు పాల్గొనుట దురదృష్టము. దుర్జ్ఞేయుడగు పరమేశ్వరుని అసంపూర్తముగ వ్యక్తపరచు చిహ్నములని ఛాయలని తలంచుచు పామర జనాభిప్రాయములను జ్ఞానులు సహనముతో జూతురు; కాని సన్యాసులమున సాధారణ జనులు, అవి యుక్తాయుక్తములనియు, అవలంబనార్హములనియు నిరూపితములైనట్లు, నమ్ముదురు. దేవతల కోలాహలమునుండి తప్పించుకొని పరమ పురుషుని శాంతి నిలయము జేరుటకు హిందూజ్ఞానులు అభిలషింతురు: కాని జన బాహుళ్యము ఆకాశమువంక జూచుచు నిట్టి సంచలనము లేక యుందురు. సహనమువేరిట మూఢ కర్మములను ఆచారములను హిందువులు జాగ్రత్తగా కాపాడుచున్నారు. భిన్న ధార్మికాభిప్రాయములు పిలువను

* అగ్నౌ క్రియావతో దేవో హృది దేవో మనీషిణామ్
ప్రతిమా స్వల్పబుద్ధీనామ్ జ్ఞానినామ్ సర్వతః శివః

స్పష్టముగ గ్రహించినవారు సయితము, తమతో సమముగ వృద్ధినొందని వారియెడ నుపేక్షాజనకముగ తమ యాధిక్యత యుండదగదను సుఖకరమయిన నమ్మకమును గలవారై, తమ యాదర్శ విరుద్ధములగు నాచరణముల యందు మెలగుదురు. సామాన్య జనుల జ్ఞానమును వృద్ధి జేసి హిందూ సంఘము నంతను శ్రేష్ఠతరమగు నాధ్యాత్మికోన్నతి నొందించుటకు క్రమమయిన తీవ్రోద్యమ మెద్దియు ఈ మధ్యకాలమున గానరాదు. సర్వోత్కృష్టమగు ఈశ్వర భావమును ప్రబోధించుచు, ఉపాసకుల యాశయము లభ్యున్నతి జెందుటకై హిందూ నాయకులు వారి మనస్సులను సదా పురిగొల్పు చుండవలెను. దేశమంతటను స్థాపితములై యున్న గుళ్ళు, గోపురములు, మఠములు, ప్రార్థన మందిరములుగను పూజా మండపములుగను మాత్రమె గాక హిందువులకు ధర్మ శిక్ష నొసంగు వివిధ దర్శనాధ్యయన శాలలుగను బ్రహ్మ విద్యాలయములుగను ఉపయోగింపవచ్చును.

---

## ద్వితీయోపన్యాసము.

### మతముల సంఘర్షణము : హిందువుల శైఖరి.

సమాధియందలి తమ యనుభవమును సిద్ధులు వ్యక్తీకరించుటలో గన్పట్టు విభేదములు అముఖ్యము లెంతమాత్రము గాకున్నను సమాధిస్థితి విశ్వజనీన మని సాధనార్థుల హృదయములకు తెప్పక గోచరించును. హిందువులైనను, క్రైస్తవు లైనను, మహమ్మదీయు లైనను, ప్రపంచములోని సిద్ధపురుషులెల్లరు ఒకే భ్రాతృ మండలికి జెందినవారు; ఏక వంశస్థుల పోలికలు వారి యందు గానబడును. "ప్రాక్పశ్చిమదేశములలో సమాధిస్థితిని గురించి ప్రబలిన తత్త్వ సిద్ధాంతములు చాల భేదించియున్నను, అవి మానవునకు కనపరచు జీవితాదర్శము కూడ భిన్నముగ నున్నను, తత్సిద్ధాంత సంఘర్షణమున కతీతముగ సిద్ధపురుషుల యనుభవము మాత్రమున్నట్లు చూడనగును. ఈశ్వర ప్రేమోపలబ్ధియైనప్పుడు, వైరుధ్యములు అసంభవములు; ఏలయన, జీవాత్మ బహుత్వమును దాటి యేక మాత్రమగు సత్యమునందు నిమగ్నమగును."* అని భక్తురాలు, ఎవిలిన్

* **Introduction to the Autobiography of Devendranath Tagore, P. XI.**

అండర్ హిల్ (Miss Evelyn Underhill) వ్రాయుచున్నది. ఈశ్వరానుభవ ప్రత్యేక లక్షణములను బట్టి పరీక్షించిన, శంకర ప్లోటినసు (Plotinus) ల కంటె సైంటుజాను (St. john) నకు సైంటుపాలు (St. Paul) నకు నెట్టి చెప్పదగిన యాధిక్యతయు లేదని గాన్పించును. "బ్రాహ్మణ, సూఫి, క్రైస్తవ సిద్ధపురుషులు ఉచ్చ్రిత మానవస్థ జెందినపుడు, వారిలో నేదైన విశేష భేదము కలదని యెవరును నిష్కపట హృదయముతో నుడువ జాలరు."* అని అండర్ హిల్ తెలుపుచున్నది. ఈశ్వర సాక్షాత్కారానుభవములను ఖండించు జర్మనీ దేశ తత్త్వజ్ఞాని, హెర్మన్ (Hermann), తన ప్రత్యేక దృక్పథము ననుసరించి యీ యభిప్రాయమునే సమర్థించు చున్నాడు. క్రైస్తవ సిద్ధ పురుషులను గురించి ఆయన యిట్లు వ్రాయుచున్నాడు: "వారిలో దైవభక్తి మహోన్నతముగ విజృంభించినప్పుడు, వారు క్రీస్తునకు దూరీకృతులయి అన్ని యుగములలోని క్రైస్తవేతర సిద్ధులతో సరిగా నొకే ప్రదేశమున విహరింతురు."♦ "ఆగస్టిన్

* **Essentials of Mysticism.**

♦ **The communion of the Christian with God.**

**(Augustine)** త్రిత్వమును గురించి పదునైదు పుస్తకములు గల పెద్ద సంపుటమును రచించెను; కాని ఆస్టియాలో గృహ గవాక్షమువద్ద తన తల్లిచెంత నిలచి యీశ్వరాలింగమున తాను పొందిన గభీరానుభవము వ్యక్తపరుప యత్నించినప్పుడు, ఆయన త్రిత్వమును గురించి గాక యెవ్వని సమక్షమున తన యాత్మ యన్ని మాటలను, అన్ని సంజ్ఞలను, తనను కూడ నతీతించినట్లు అనుభూత మయ్యెనో, ఆ యేకేశ్వరుని గురించియె ముచ్చటించెను.* *

అంతర్దృష్టి యుతుడగు భక్తుడు సత్యపథమును దేవాలయమున గాని చర్చియందు గాని మసీదునందు గాని దేని యాచ్ఛాదనమున నవలోకించినను, ఒక్కటియె. తేజోవంతమగు ఈశ్వర దర్శనము పొందినవారు బాహ్యోప కరణముల విపరీత ప్రాముఖ్యతను తొలగింప సమర్థులుదురు. గురునామ ధారులు బోధించు మూఢ మతములు ఉపాసకులలో నెంత యంతర్భేదములు కలిగించునో, అందరిని సంత మైక్యముజేయు భాషలో వారు సంభాషింతురు. మూల్యవంతమయి పరివర్తనాశీలమయిన మానవ ప్రకృతిని పాలించు ఆ

* I bid; P. 29.

కాంక్షలను, ఉత్సాహములను సులభముగ గ్రహింపగల బుద్ధి సూక్ష్మతయు దృష్టి విశాలతయు యథార్థద్రష్ట కనుగ్రహింపబడును. ఈశ్వరలగ్న హృదయుడు జీవన వికాసములలో దేనిని పూర్తిగ దోషయుతమని నిరాకరించడు. ఈశ్వర స్వభావము అనంతమనియు, తదావిర్భూతవికాసములు అసంఖ్యాకములనియు, ఆతని దృఢ విశ్వాసము.

ధర్మముయొక్క నిగూఢతత్త్వమునుగురించిమానవజ్ఞానకల్పితములగు రచనలు సంబంధద్యోతకములు; భావసూచకములు. ప్లేటో (Plato) వచించినట్లు ఈశ్వరుని గురించిన మన రచనలు కథలే గావచ్చును గాని యత్యుద్భుతములు. వానిలో నొకటియు పరిపూర్ణతను సమాప్తిని సూచింపదు. సముద్రోదకముతో ఆలుచిప్పలు నింప యత్నించు పసిబిడ్డలను మనము పోలియున్నాము. వానితో సాగరజల మంతయు సంగ్రహింపజాలము కాని, వానిలో నుంచబడు ప్రతిబిందువు వాస్తవముగ నా జలాశయములోని యంశమె. మన బుద్ధినుండి యుద్భవిల్లు రచనలు ఒకే కేంద్రప్రాయమగు సత్యమునందలి భిన్నాంశముల ప్రకటించును గావుననె, అవి భేదించును. ఋషులు మొదలు గాంధి టాగూరులవరకు హిందూమ

హానీయు లెల్లరు, సత్యము బహువర్ణశోభితవసనముల ధరించి విచిత్రభాషలలో సంభాషించు నని, అంగీకరించిరి. ఇతర మతములకు జెందిన సిద్ధపురుషులుకూడ ఈ విషయమును దృఢపరచిరి. "వనవిహంగముల పరిశీలింపుడు. అవి తమ వివిధస్వరములతోను రాగములతోను ఈశ్వరుని స్తుతించును. ఆయన యీ నానావిధ కోలాహలముతో విసుగుజెంది యపస్వరములుగా నుండు ధ్వనుల నణచివేయు నని నీవు తలంతువా ? సృష్టిలోని సమస్తరూపములు ఆ యనంతబ్రహ్మమునకు ప్రీతిపాత్రములె." అని బోహిమ్ (Boehme) నుడువుచున్నాడు. కేంబ్రిడ్జిపండితుడు, బ్రౌని (Browne), అనువదించిన యీ క్రింది సూఫీప్రవచనము నాలకింపుడు.

Beaker or flagon, or bowl or jar,
Clumsy or slender, coarse or fine ;
However the potter may make or mar,
All were made to contain the wine ;
Should we this one seek or that one shun
When the wine which gives them their worth is one ?

(గిన్నె, చెంబు, పళ్లెము, కూజా మున్నగు పాత్రలు, వికృతముగ గాని సుందరముగ గాని, మోటుగ

గాని నాజూకుగ గాని, కుమ్మరి బాగుగ జేసిన నేమి లేక యోగుగ జేసిన నేమి, అన్నియు ద్రాక్షారసము నుంచుటకు నిర్మింపబడినవె. వానికి విలువ నిచ్చు ద్రాక్షారస మొక్కటి యైనప్పుడు, మన మొకటి స్వీకరించి మరొకటి త్యజింపవలయునా ? )

ఈ మహాసత్యమును గమనించి హిందూధర్మము మార్పునకు జోటీయని మూఢవిశ్వాసమందు పిచ్చిపట్టు దల పెట్టుకొనక యుదారసానుభూతి జూపగల వైఖరిని పెంపొందించుకొనెను. ఆదిమనివాసుల దేవతలను, చాల వరకు ఆర్యసంప్రదాయమునకు బాహ్యములయిన యితర దేవతలను అది యామోదించెను; వాని నన్నిటిని సమర్ధించెను; ఈశ్వరవిశ్వాసుల నెల్లర నేకసంఘములో మేళవింపజేసెను. బహువిశ్వాసముల ననుసరించు ననేకోపసంఘములు హిందూమహాసంఘమందు గలవు. పలు మతములకు వినోదక్రీడయయిన పరమతసంహరణము హిందూధర్మమున చోద్యముగ గానరాకున్నది.

మోక్షముకొరకు ఒక ప్రత్యేకమతసిద్ధాంతము స్వీకరించుట యావశ్యక మనియు, దానిని నిరాకరించుట శాశ్వతనరకశిక్ష నాపాదించు ఘోరపాప మనియు, క్రైస్తవమహమ్మదీయాది మతములకు గల గొప్ప

భ్రాంతి హిందూధర్మమున కెంతమాత్రము లేదు. మూఢమతోన్మాదము అచ్చటచ్చట చెలరేగె నని హిందూవాఙ్మయమున నుల్లేఖింపబడియుండుట గాంచ నగును. భిన్నసంఘములు ఒక మహాసంఘములో మేళవింపబడి నప్పుడు, ప్రథమమున సంభవించిన సంఘర్షణ ఫలితములనె యది సూచించును; కాని హిందూధర్మ ప్రధానాశయము అన్యమతముల సన్మానించి వాని శ్రేయము గోరుటయె. ఒకానొక విష్ణుభక్తుడు శైవ భక్తులయెడ ద్వేషపూరితహృదయుడై యుండెను. ఒకప్పు డాతడు తన విష్ణువిగ్రహమునకు ప్రణమిల్ల, విగ్రహాముఖము రెండు సమభాగము లయి యొక పార్శ్వమున శివుడును ఇంకొక పార్శ్వమున విష్ణువును ప్రత్యక్షమయి రెండు నేకముగ నా సంకుచితభక్తుని జూచి నవ్వి శివకేశవు లొక్కటియె యని వానికి బోధించెను. ఈ కథ ఆ యాశయమునె వెల్లడించుచున్నది.

ఒక యర్థములో హిందూధర్మమును ప్రచారక మతములలో నగ్రగణ్యముగ పేర్కొనవచ్చును. కాని ప్రచారోత్సాహములో వానికిని దానికిని భేదము కలదు. సర్వమానవుల నేకాభిప్రాయుల జేయుట హిందూ ధర్మము తన పనిగ పెట్టుకొనలేదు. ఏలయన, పరిగణింప

వలసినది శీలము గాని మతాభిప్రాయము గాదు. వివిధ దేవతారాధకులును, వివిధ కర్మానుష్ఠానపరులును హిందూమహాసంఘములోనికి గైకొనబడిరి. పీడితజాతులను, స్త్రీలను, శూద్రులను మాత్రమె గాక కిరాతులు, హూణులు మొదలగు పాపయోనీసంభవులను సయితము కృష్ణుడు తనవారినిగ స్వీకరించు నని భగవద్గీత చెప్పుచున్నది.* తాండియబ్రాహ్మణమున పూర్తిగ వివరింపబడిన ప్రత్యస్తోమ మను ప్రాచీనాచారప్రకారము వ్యక్తులు మాత్రమె గాక యావత్సంఘములు హిందూ ధర్మమున లీనముచేయబడెనని తెలియుచున్నది.♦

* కిరాత హూణాన్ధ్ర పులింద పుక్కసాః ఆభీరకంకా యవనాః ఖసాదయః
యేన్యేచ పాపా య మపాశ్రయాశ్రయా శ్యుద్ధ్యంతి
తస్మై ప్రభవిష్ణవే నమః.

♦ ఈ క్రిందివి చూడుడు :

పంచవింశబ్రాహ్మణ, XVII, 1–4 ; బౌధాయన, XVII, 24–6; కాత్యాయన, XXII-4 ; లాత్యాయన, VIII-6.

చైతన్యభక్తులు మొదలుకొని యనేక నవీన సంఘములవారు—రాధాస్వాములు, కబీరుపంథులు, సీక్కులు, బ్రాహ్మసమాజికులు, ఆర్యసమాజికులు—పరులను స్వీకరింతురు. బలవంతముగ నన్యమతములలో కలుపుకొనబడిన స్వజనులను, మానభంగము జెంది సంవత్సర

ఆర్యులు విజయము గాంచి తమకు వశులయినను అపాయకరముగ నున్న శత్రుసమూహముతో సమాధానపడి నప్పుడు, వారి యనాగరికాచారములను పరిహసింప లేదు. ఉత్తరహిందూస్థానమందలి యాదిమనివాసులు నగ్నప్రకృతిశక్తులకు కల్పనాకథ లనెడు విచిత్రవస్త్రములను గట్టి పరివర్తనాశీలములగు సృష్టిదృశ్యముల ననుసరించి దేవుళ్లు, దేవతలు, భూతములు, పిశాచములు మున్నగు నానావిధోపాస్యగణమును సృజించిరి. వైదికార్యులు వాని నన్నిటిని గైకొని భక్తివిస్మయములతో తామర్చించు నాకాశదేవతాగణముప్రక్క నెలకొల్పిరి. ఆ క్షుద్రదేవతల నయినను జీవితపరమసుఖములకు నాకరములుగను, మానవుడు పొందగల శక్తిసామర్థ్యములకు ననికిపట్టులుగను తదారాధకులు పరిగణించుకొనినయెడ, ఆర్యులకు చాలును. ఋగ్వేదదేవతలును అథర్వవేద భూతములును ప్రబలతత్త్వజ్ఞానశక్తిచే మిళితములయి యేకపరమేశ్వరస్వరూపముగ నైక్యత గాంచెను. ఆ

ముల పర్యంతము చెరపట్టబడిన స్త్రీలను, తుదకు ప్రాపంచికలాభ మాసించి పరమతావలంబకు లయిన స్వజాతీయులను తిరిగి సంఘమున చేర్చుకొనునిమిత్తము స్వల్పమయిన ప్రాయశ్చిత్తవిధులు దేవల స్మృతియందు గలవు.

స్వరూపము మన భావన నారోపించు గుణములనుబట్టి, భిన్ననామముల పిలువబడుచున్నది.

నూతన జాతులను వారి దేవతలను ప్రాచీన బంధువర్గమందు నెట్లు జేర్చబడెనో యితిహాసములు వివరించును. ఆచారముల ప్రతిఘటనము, నాగరికతల సంఘర్షణము, వానిలో నొకటి మరొకదానిపై నిరంకుశాధికారము వహించుటకు, సాధారణముగ కారణమగుట లేదు. సకల యథార్థ సంబంధములందు సాధన వినిమయము సంఘటిల్లును; కాని యన్య సాధనములను స్వీకరించువారు వానికి నూతనార్థములను కల్పింతురు. పూర్వ సంప్రదాయమున నిముడ్చబడిన క్రొత్త పద్ధతులకు గూడ ప్రాచీనపద్ధతులకు గల భావములె సంక్రమింప జేయబడును. అనేకసంఘములలోను జాతులలోను, దేవతా మహిమగలవి యని పరగణింపబడు జంతువులు గలవు. ఆ కూటములు హిందూ మహాసంఘమున ప్రవేశించినప్పుడు, వారి జంతువులు దేవతలకు వాహనములగను సహచరములుగను నేర్పరుపబడెను. ఒక దేవత నెమిలిమీదను, ఒకటి హంసమీదను, ఒకటి యెద్దుమీదను, ఒకటి మేకమీదను ఆరోహింపబడెను. రాముని కొలువునందు హనుమంతుడు జేర్చుకొనబడుట

ఆదిమ ప్రకృత్యోపాసన యొక్కయు తరువాతి యాస్తిక మతముయొక్కయు సమ్మేళనము సూచించును. కాళీయ మస్తకముమీది కృష్ణనాట్యము సర్పపూజను తొలగించుటను గాకపోయినను ఉత్తమపద్ధతికి లోబరచుటను తెలుపును. రాముడు శివధనుస్సును విరుచుట వైదికశైవ మతముల సంఘర్షణమును వ్యక్తపరచును. తదనంతరము శివుడు శీఘ్రముగ దక్షిణ ప్రాంతమునకు దైవము (దక్షిణామూర్తి) అయ్యెను. వైదిక వైదికేతర మతముల సఖ్యపరచుటను వెల్లడించు నితరకథలును ఐతిహాసిక వాఙ్మయమున గలవు. పితృవీరులు, స్థానికభక్తులు, గ్రహశక్తులు, కులదేవతలు ఏక పరమ సత్యస్వరూపిని భిన్నాంశములుగ పరిగణింపబడి యాయన యధీనము లోనికి తేబడినను, అవి యన్నియు పూజనీయమగు హిందూదేవతా గణమందు జేర్పబడెను. బహు దేవతారాధన యేకేశ్వర మతమున బొందుపరుపబడెను. కాని యీ యేకేశ్వరమతము తన యనుచరులు అన్య మతావలంబకులయెడ సమితముగ సహనము జూప వలయునని మూర్ఖత్వము వహింపదు.

ఆర్యులు సదా విజేతలుగనె యుండిరని తలంప నక్కరలేదు. ఆర్యులు ఆర్యేతరులకు న్యాయముగనె

లోబడుచువచ్చిన సమయములును గలవు. వివిధార్యేతర దేవతలు ఆర్యదేవతలపై నధికారము స్థాపించుకొనిన విధానము నితిహాసములు వివరించును. వైదిక దేవతాధిపతి యగు ఇంద్రునితో కృష్ణుడు గావించిన యుద్ధము ఇందుల కొక తార్కాణము. శైవమత విజృంభణము మరియొక నిదర్శనము. యజ్ఞయాగాది కర్మ ప్రవర్తకుడగు దక్షుడు శివునితో తీవ్ర సంగ్రామము తలపెట్టినప్పుడు, స్త్రీ స్వాభావికములయిన సేవాభక్తులు మూర్తీభవించి నట్లున్న యాతని పుత్రిక, సతి, మహాశివభక్తురాలగుటచే, ఆతని గృహమందె యశాంతి ప్రబలెను.

క్రైస్తవశకారంభమునాటి హోమరిక్ గ్రీకుల యొక్క గాని కెల్టిక్ ఐరిషులయొక్క గాని నాగరికతనో, లేక క్రీస్తునకు పూర్వమందుండిన ట్యూటను స్లావుల యొక్క నాగరికతనో సరిపోలునట్టి వైదికనాగరికత ద్రావిడసంపర్కముచే నితిహాసప్రోక్తమగు హిందూనాగరికతారూపము దాల్చెను. పితృదైవమగు నాకాశమును గాని యే యితర తేజోమయ దేవతను గాని యజ్ఞకర్తపై కరుణావీక్షణములు దమ యున్నతస్థానమునుండి బరపి మాంసము, దోసెలు, సారాయము మున్నగు కానుకలను స్వీకరించుటకై యాహ్వానించుటయె ప్రాథ

మికయుగములోని యార్యుల యుపాసనోద్దేశ్యము. కాని త్వరలో పూజావిధానము హోమమునకు బదులుగ వాడుకలోనికి వచ్చెను. ద్రావిడమతప్రధానాంగమగు విగ్రహారాధన మార్యుల కంగీకృతమయ్యెను. అహింసా శాకాహార నియమములు కూడ వ్యాపించెను. వైదిక సంప్రదాయము ఆగమికసంప్రదాయమునకు వశీభూతమయి నేడు హిందూనాగరికతయందు వేదములతో సమముగ నాగమములును ప్రాముఖ్యత జెందెను. హిందూధర్మమునందు ఆర్యద్రావిడసంప్రదాయములు ఒకదానిప్రక్కను మరియొకటి వేరుగ నుండక ఒకే ప్రత్యేకనాగరికతారూప మొందునట్లు సమన్వయపరుపబడెను. ఆ రూపము క్రమపరిణామఫలితమె గాని యెటులనో పర్యవసానముగ నేర్పడినది గాదు. వేదముతో ఆగమములు చాలవరకు సమరసపరుపబడినను, వాని ప్రచారకులనడుమ నప్పుడప్పుడు సంఘర్షణము కలుగుచుండినట్లు హిందూధర్మపరిణామచరిత్రవలన తెలియగలదు. చారిత్రికదృష్టితో పరికించి నప్పుడు, హిందూధర్మము సకలశిష్టసదాచారములను మాత్రమె గాక యనేకదుష్టదురాచారములను గూడ నంతర్భూతముజేసి కొనుచు యుగయుగములనుండి మెల్లగ నభివృద్ధి గాంచె

నని స్పష్టపడును ; కాని యెల్లప్పుడు విజయము పొంద కున్నను, అతృప్తికరములగు పద్ధతులను త్రోసిపుచ్చు టకు ఒక నిరంతరకృషి సాగుచునె యుండెను. ఒక స్థిర ప్రాచ్యాదర్శప్రేరితమగు సజీవసంస్థ కనపరచు మహా సమీకరణశక్తికి కారణభూతమగు నైక్యత హిందూ ధర్మమునకు గలదు. ఏకమాత్రుడును, ఏవర్ణముచేతను గుర్తింప నలవిగాని వాడును, ప్రతిజాతియొక్కయు విశ్వ మానవకోటియొక్కయు అక్కరలను తన వివిధశక్తుల ద్వారమున తీర్చువాడును అయిన సత్యస్వరూపుని జ్ఞప్తికి దెచ్చుకొను డని యుపనిషత్తు మనల నాదేశించు చున్నది.

హిందూధర్మములోనికి ఒక పర్యాయము గైకొ నబడినప్పుడు, వాని కిక పరివర్తనము శ్రేష్ఠతరభావసం పర్కముచే ప్రారంభమగును. హిందువుల మతసంస్క రణవిధానము ముఖ్యముగ సర్వమానవసమత్వపద్ధతి ననుసరించును. ప్రతిసంఘము స్వసంప్రదాయము ననుస రించి మానసికనైతికనియమముల ద్వారమున సత్య మును గ్రహించుట కది యంగీకరించును. ప్రతిసంఘము నకు స్వకీయచారిత్రికసంప్రదాయము కలదు ; దానిని అంతర్భుక్తము చేసికొనుటమూలముననె తత్సంఘము

ఆధ్యాత్మికోన్నతి జెందును. అనాగరికుడు సయితము తన మూఢాచారములను గట్టి నమ్మకముతోడను పూని కతోడను పట్టుకొని యనుసరించును. వాని యభిప్రాయ ములు పసిబిడ్డల యూహలకంటె నున్నతములు గానట్లు మనకు దోచినను, అవి వానికి ప్రాణాధారములె. అనా గరికుని మూఢాచారములను విచ్ఛిన్నముచేయుట యన, వాని నీతిని సాంఘికనియమమును మానసికశాంతిని ధ్వంసము చేయుటయె. వందలకొలది సంవత్సరములు ప్రాచీనములయిన యనుభవములనుండి మతకర్మకలాప ములును సాంఘికసంస్థలును, అవి యెట్టివైన నేమి, ఉద్భ విల్లును. హిందూపరిశీలకుడు ప్రపంచప్రచలితమతము లలో గల విశేషవిభిన్నతపై తన దృష్టి బరపినప్పుడు, ఆ మతానుచరు లెల్లరు ఏ యేసంఘములందు జీవించిరో వానికి వశీభూతులై యుండిరని కనుగొనెను. వారు ఇప్పటి రూపములను దాల్చునట్లు చరిత్ర వారిని నిర్మా ణము చేసినది; ఆకస్మికముగ వారిని మరొక విధముగ మార్చుట యసంభవము. అంతియ గాక, ఈశ్వరుని దయాపూరితసంకల్పమునందు యావన్మానవకోటియు నిమిడియున్నది. ప్రతిసంఘము విడదీయరాని స్వామ్య లను కలిగియుండును; వానిని మన్నించుట పరులకు

విధాయకము. ఎట్టి లక్షణములు గల సంఘమయినను ఈశ్వరబాహ్యమగు జీవనమునందు బడనేరదు. "అయినను పెడత్రోవకు గొనిపోయిన వెలుగు స్వర్గీయజ్యోతియె." అని రాబర్టు బరన్సు (Robert Burns) చెప్పినది నిజము. పరుల దేవతలను నిరసించుట యన వారిని నిరసించుటయె; ఏలయన వారును వారిదేవతలును పరస్పరానుకూల్యముగ సంబంధించియున్నారు. అడవిమనుష్యునకును అనాగరికునకును గల దేవతలను సయితము తీసికొని హిందువులు వానిని తమ వానితో సమముగ నున్నతాసనముల నిలిపిరి.

ఏ సంఘముయొక్క నికృష్టవిశ్వాసముల నైనను విశుద్ధముగ మార్చు క్రమపద్ధతి, తత్సంఘస్థుల మనోధోరణిని మరల్చుటయె. ఏలయన ఒక వ్యక్తి యుత్సాహముతో ఈశ్వరునిగురించి వెల్లడించు నభిప్రాయము, అత డెట్టివాడో దానినిబట్టి, యుండును. ఒక వ్యక్తి కలిగియుండు స్వభావమును శిక్షణమును మాత్రమే గాక అతనిచుట్టియుండు పరిస్థితుల ప్రేరణమును అతని మతాభిప్రాయముల లక్షణమును చాలవరకు నిరూపించును. ఒకనికి గల యెట్టి స్వభావవైకల్యమయినను, అనుభవపాక్షికత్వ మయినను, ధార్మికసత్యమునుగురించి యా

వ్యక్తి యవలంబించు నభిప్రాయమునం దనివార్యముగ ప్రతిఫలించును. ఒకనికి ఈశ్వరుని గ్రహింపగల శక్తి యెంత కలదో దానికి తగినంత యీశ్వరజ్ఞానమె వాని కబ్బును. అభిప్రాయవిమర్శనముగాక, దోషనివారణము సంస్కర్తయొక్క లక్ష్యమై యుండవలెను. ఆధ్యాత్మిక జీవనము పురిగొల్పబడి నప్పుడు, విశ్వాసము దానియంత టదియె మారును. అభిప్రాయమందలి యే మార్పయి నను యథార్థమయి యుండవలె నన్న, అది యంతరము నుండి బాహ్యమునకు వెలువడవలెను. సంప్రదాయ ములు సంస్కరింపబడిన గాని, అభిప్రాయము లున్నత ములు కాజాలవు. ధర్మబోధకుని కర్తవ్యము అంతగా అభిప్రాయమును జొప్పించుటగాక యాకాంక్షను రగుల జేయుటయె. మనము కన్నులు తెరచినయెడల, సత్యము గోచరమగును. హిందూవిధానము భయబలాత్కార ముల నుపయోగింపదు ; కాని సూచనప్రోత్సాహము లనె యవలంబించును. దోషము అసంపూర్ణతాచిహ్నము మాత్రమే ; ఘోరపాపము గాదు. వ్యవధి నిచ్చి యోరిమి చూపినయెడల, అది పరిష్కృత మగును. ఆత్మబలసంపన్నులయెడ, హిందూధర్మ మెంత కాఠిన్యత కనపరచినను, శక్తివిహీనుల తప్పిదముల పక్షమున దాక్షి

ణ్యము వహించును.

హిందువు లనుసరించు మతసంస్కరణవిధానము నామమునందు గాక భావమునందు పరివర్తనము కలుగు టకుతోడ్పడును. పూర్వనామము నిలుపుకొనుటకు హిందువుల కనుమతి కలదు కాని, దాని యర్థమును విపులీకరింప పురిగొల్పబడుదురు. మీకు తెలిసిన దృష్టాంతమును జెప్పెదను. మోజెస్ రచించిన పంచగ్రంథము లందు పేర్కొనబడిన యహోవా (Yahveh) తన కాగ్రహాము వచ్చినప్పు డెల్ల, మరలమరల మత్సరాతిశ యమున మండిపడుచు, పురుషులను స్త్రీలను శిశువులను పశువులను బలిపెట్ట నాజ్ఞాపించు నొక భయానక దేవతయె. జంతువధ గాక జీవకారుణ్యమును ఆమోదించు నట్టి, హోమద్రవ్యముల తిరస్కరించునట్టి, తనను తెలిసి కొన నాతురపడు వారలకు సాక్షాత్కరించునట్టి పరిశుద్ధ స్వరూపునిగురించిన జ్ఞానము ఐజాయాహొజియాల (Isaiah & Hosea) గ్రథములందు ప్రబల మయ్యెను. జీసుప్రబోధమందు ఈశ్వరుడు పరిపూర్ణప్రేమస్వరూపు డను భావము గాన్పించును. ఈ భిన్నాభివృద్ధులకు సంబంధము కలుపు సమానశృంఖలము 'యహోవా' అను పేరే. ఒక నూతనసంప్రదాయము హిందూధర్మము

నందు జేర్పబడినప్పుడు, క్రొత్తయర్థ మీయబడినను, దాని పేరు మాత్రము నిలుపబడుచుండెను. ఆదిమ సంస్కృతవాఙ్మయమునుండి ఒక నిదర్శనము జూపెదను. వివిధరూపములతో వెలసియున్న కాళి ఆర్యేతరుల దేవత యనుటకు సందేహము లేదు.* కాని యది క్రమముగా సర్వోత్తమమగు దైవస్వరూపముగ వ్యక్తపరుపబడెను. ఈ క్రింది కాళీస్తోత్రమును గమనింపుడు.

"ఓ దేవీ, భవదీయాశ్రితజనదుఃఖనివారిణీ, శుభదాయినీ, నీవు అవాఙ్మానసగోచరురాలవు. మాటలతో నిన్ను స్తుతించుటకు నెవరికిని సాధ్యము కాదనుట వాస్తవము.

* మహాభారతము (iv. vii) లో, ఆ దేవి మద్యమాంసములతోను జంతుబలులతోను సంతుష్టి జెందునని తెలుపబడెను. గౌరవాహుడు (A. D. 700) కాళీదేవికి నర్పింపబడిన జంతుబలులను నరబలులను గురించి ప్రస్తావించి యుండెను. క్షుద్రకమలాకరుడు (15 వ శతాబ్దము క్రీ.శ.) మిర్జాపురమునందు వింధ్యాచలము మీద నున్న మర్గవిగ్రహమునుగూర్చి ముచ్చటించుచు కాళీదేవి కిరాతులును లెదితిరాదిమనివాసులును అర్చించు దేవత యనియు, ఆది మ్లేచ్ఛులు, ఠగ్గులు మొదలయినవారిచే పూజింపబడుచుండెననియు తెలియించెను.

"బ్రహ్మమునె స్వకీయస్వరూపముగాగల యో దేవీ, ఓ విశ్వజననీ, దయాప్రపూర్ణహృదయురాలవగు నీకు పునఃపునః ప్రణమిల్లుచున్నాము. సృష్టిస్థితిలయకార్యములు నీ లీలా విలాసమందు కేవలతరంగములై. ఒక క్షణములో సర్వము సృజింపగలవు. ఓ సర్వశక్తిస్వరూపిణీ, నీకు నమస్కారము. గుణరూపరహితవయ్యు, విషయప్రపంచాతీతవయ్యు, ఇంద్రియముల కగోచరురాలవయ్యు, ఏకమును పూర్ణమును అద్వితీయమును సర్వవ్యాప్తమును అయిన దానవయ్యు, భక్తుల శ్రేయముకొరకు సగుణస్వరూపమును దాల్చి నీవు వారలకు నుత్తమశుభముల చేకూర్తువు. ఎవరియందు జగత్తుయొక్క యవస్థాత్రయము వ్యక్తమగుచుండునో యట్టి నీకు, ఓ దేవీ, నమస్కరించు చున్నాము."* కృష్ణుని పూర్వజన్మవృ

* దేవి ప్రపన్నార్తిహరే శివే త్వమ్ వాణీమనోబుద్ధిభిరప్రమేయా
యతో స్వతో నైవ హి కశ్చిదీశ స్తోతుమ్ స్వశబ్దైర్భవతీమ్ కదాచిత్
బ్రహ్మస్వరూపే జగదంబికేలమ్ దయామయీమ్ త్వామ్ సతతమ్ నమామః.
సర్గస్థితిప్రత్యవహారకార్యమ్ త్వద్విలాసస్యతరంగమాత్రమ్

త్తాంత మేర్పడినను, భగవద్గీతయందు ఆతడు ఉత్తమ భగవత్స్వరూపముగ పరిణమిల్లెను.

శిష్యుడు తన మతగురువును సమీపించినప్పుడు, గురువు శిష్యుని యిష్టదేవతనుగురించి ప్రశ్నించును. ఏలయన ప్రతిమనుజునకు తన కత్యంత సంతృప్తి గొల్పు మతవిశ్వాసమును ఆరాధనా విధానము ననుసరించుటకు స్వాతంత్ర్యము గలదు. ఆత డవలంబించినది నిర్గుణబ్రహ్మముయొక్క సాకారస్వరూపమె యని చెప్పి యాస్వరూపము వ్యక్తపరచు సర్వాతీతుని భజించుటకు గురువు శిష్యుని క్రమక్రమముగ నడపును. క్రైస్తవుడు ధర్మము

కర్త్రీమ్ క్షణేనాఖిలమస్యలమ్ త్వామ్ నమో స్త్వతస్తే ఖిల శక్తిరూపే.

త్వామ్ నిర్గుణాకారవివర్జితాపి త్వామ్ భావరజ్యాచ్చబహిర్గతాపి

సర్వేంద్రియా గోచరతామ్ గతాపి త్వేకా హ్యఖండా విభు రద్వయాపి.

స్వభక్తకళ్యాణ వివర్ధనాయ ధృత్వా స్వరూపమ్ సగుణమ్ హితేభ్యః

నిశ్రేయసమ్ యచ్ఛసి భావగమ్యా త్రిభావరూపే భవతీమ్ నమామః.

నందు దారి జూపుడని హిందూగురువును ఆశ్రయించునని తలంపుడు. క్రీస్తునందలి భక్తిని త్యజింపుమని హిందూ గురువు తన క్రైస్తవశిష్యుని గోరడు; కాని క్రీస్తునుగురించి యాతనికి గల యభిప్రాయము సంపూర్ణము గాదని బోధించి, యవతారపురుషుడగు యథార్థ క్రీస్తువిషయమై జ్ఞానము బడయుట కాతనికి దోడ్పడును. హిందూధర్మము, తాను స్వీకరించిన ప్రతిదేవతను, ఉన్నతపరిచి మానవుని యంతరాత్మతో నేకమయి సర్వమునకు కేంద్రప్రాయుడై యున్న సత్యస్వరూపునితో తుదకు నైక్యము నొందించును. హిందూదేవతాగణమునకు నూతనదేవతలను జేర్చుటవలన, హిందూధర్మమునకు నెట్టిహానియు లేదు. హిందూమతము "మనశ్శాస్త్రముచే పరిష్కృతము చేయబడిన గారడి" యని గాని "తత్త్వశాస్త్రముచే రూపాంతరము నొందింపబడిన జడోపాసన" యని గాని యాక్షేపించు విమర్శకుడు సత్యమునే చెప్పుచున్నాడు. మనశ్శాస్త్రముచే పరిష్కృతము చేయబడిన గారడికిని వట్టి గారడికిని వ్యత్యాసము కలదు. హిందూధర్మము తనయందు ప్రవేశించు దేనినైనను, గారడిని గాని జడోపాసనను గాని, అంతర్లీనము జేసికొని యున్నతశ్రేణికి లేవనెత్తును.

ప్రతినామము, దాని యుక్తమార్థమునుబట్టి చూచిన, ఒకే దార్శనిక నైతికాదర్శములను వెల్లడించును గావున, హిందువునకు నామభేదము లముఖ్యములు. భిన్న నామములు వ్యక్తపరచు భావమొక్కటియె యను విషయము, ఆ నామములను పర్యాయపదములుగ వాడుట మూలమున, జనసామాన్యమునకు బోధపరుపబడును. బ్రహ్మ, విష్ణువు, శివుడు, కాళి, కృష్ణుడు, బుద్ధుడు, తదితర చారిత్రిక మహాపురుషుల నామములు నిర్గుణస్వరూపుని దెలుపుటకు నెట్టి తారతమ్యము లేకుండ నుపయోగింపబడును. "శైవులు శివు డని, వేదాంతులు బ్రహ్మన్ అని, బౌద్ధులు బుద్ధు డని, న్యాయాయకులు ప్రధాన ప్రతినిధి యని, జైనులు ముక్తాత్ము డని, మీమాంసకులు కర్మశాసన మని యారాధించు త్రిలోకనాథుడైన హరి మా ప్రార్థనలను సఫలీకృతము చేయుగాక !* మనోభేదమునుబట్టి బ్రహ్మవిష్ణుమహేశ్వరు లని వివిధరీతుల కల్పిం

* యమ్ శైవాః సముపాసతే శివ ఇతి బ్రహ్మేతి వేదాన్తినః
బౌద్ధాః బుద్ధ ఇతి ప్రమాణపటవః కర్తేతి నైయాయికాః.
అర్హాన్ నిత్యథ జైనశాసనరతాః కర్మేతి మీమాంసకాః
సోయమ్ వై విదధాతు వాంఛితఫలమ్ త్రైలోక్యనాథో
హరిః.

పబడునట్టి యేకసత్యస్వరూపునిగురించి మహాతత్త్వవేత్త, శంకరుడు, ముచ్చటించెను.* దక్షిణహిందూ దేశము లో సామాన్యజనులు పాడునట్టి యొకపదము ఇట్లు తెలుపుచున్నది.

"వివిధప్రాంత పర్వతములనుండి యరుదెంచు నదులు ఒక్క మహాసముద్రవక్షమును జేరుచున్నవి. వాని జన్మస్థానములు భిన్నము లైనట్లు, వాని పేర్లును భిన్నములు. అవ్విధముననె యనేకనామములతో వ్యవహరింపబడినను, ఒక్కడైన మహాపురుషుని ప్రతిదేశ జనులు ప్రమొక్కుచున్నారు."♦

తన పూర్వసంబంధముల నిలుపుకొని, తన వ్యక్తిత్వమును స్వలాభమును రక్షించుకొనుటకయి, ప్రతిసంఘమును హిందూసంస్కరణవిధానము శక్తివంతము చేయును. ఏలయన ఎట్లు విద్యార్థులు, తమ విద్యాలయము లన్న, గర్వము జెందుదురో, అట్లే సంఘములు, తమ దేవత లన్న, గర్వము వహించును. మనము విద్యార్థులను ఒక కళాశాలనుండి మరియొక కళాశాలలోనికి

* హారిస్తుతి, 18.

♦ Gover, The Folksongs of Southern India, P. 165.

తీసికొనిపోవ నవసరము లేదు; కాని ప్రతికళాశాలలో పద్ధతుల నున్నతపరచి, విద్య నధికముగ నొసంగి, యా దర్శములు పరిశుద్ధము జేసి, సర్వకళాశాలలు మనల నొకటే పరమావధిని జేర్చునట్లు మనము యావ చ్ఛక్తితో పాటుపడవలెను. కళాశాలలన్నియు నేకవా తావరణముచే నావరింపబడి మన మొకే గమ్యస్థానము చేరుటకు మనల సంసిద్ధముచేయు నంతకాలము, మనము ఏ కళాశాలలో నున్నను, పాటింప నవసరము లేదు; బాలియాల్ (Balliol) సర్వోత్తమకళాశాల యని, మాగ్డలీను (Magdalene) అతినూత్నవిద్యాలయ మని చాటుకొను సంకుచితదేశభక్తిగల దురభిమానులు సహజ ముగ కొందరుందురు; కాని నిష్పక్షపాతబుద్ధితో పరి శీలించువానికి, వివిధకళాశాలలు ఒకదానికంటె నొకటి యెత్తుగ నేలబారున నిలచియుండు మేడలవంటి వని గాక ఒకే శిఖరమునకు గొంపోవు నూర్ధ్వాభిముఖము లయిన మార్గములవంటివె యని తోచక మానదు. ఏ కళాశాలలో నుండగలిగినను, మనము నిచ్చెనయొక్క మొదటిమెట్టుమీద గాని మిక్కిలి యున్నతమైన మెట్టు మీద గాని యుండవచ్చును. మన మెచ్చట నుండినను, అందులకు కారణము కళాశాల గాక మనమె. ఉత్తమ

హిందువులును అధమహిందువులు నున్నట్లే, ఉత్తమ క్రైస్తవులును అధమక్రైస్తవులును గలరు.

హిందూసంస్కరణవిధానము సిద్ధాంతవిషయమున, అనుసరణవిషయముునను, ఎట్లు యోగ్యముగ నున్నదో పరిశీలింపబడినది. క్లెమెంటు వెబ్ (Clement Webb) పండితుడు ఇట్లు వ్రాయుచున్నాడు: "అతి విభిన్నరూపములతో యుగయుగములందు నుద్భవిల్లు నీశ్వరావతారములకు సంబంధించిన సంప్రదాయములతోడను, ఏ స్థానికదేవతను గాని కులగురువును గాని విరాగియయిన భక్తుని గాని యీశ్వరావతారముగ వెంటనె స్వీకరించు నుద్యమముతోడను, ప్రపంచము నతీతించు ఈశ్వరసాక్షాత్కారముయొక్క యుత్తుంగ పవిత్రభావతరంగముల ప్రక్కను ఎంతయో యసహ్యములుగనో హేయములుగనో కన్పట్టు సర్వవిధవిగ్రహముల యెడను పురాణగాథల యెడను జూపబడు సహన స్వభావముతోడను, అది యే యన్యమతముకంటెను సులభముగ, తన గతచరిత్రముతోడి సంబంధము పోగొట్టుకొనకుండ, ప్రతిమతమును ఏ ప్రత్యేకవ్యక్తికో లేక సంఘమునకో తగియున్న రూపముతో నున్నదని గాంచు నట్టియు ఏకసనాతనసత్యస్వరూపుని నన్వేషించు విశ్వ

జనీనా కాంక్షతో గూడి నట్టియు విశ్వజనీన ధర్మముగ బహుశః వర్ధిల్లగలిగి యుండెడిది. కాని యాతని యథార్థస్వరూపము నెడల, ఏ యనంతభిన్న ప్రణాళికలద్వారమున నది ప్రకటితమగుచున్నదో లేక మానవులదృష్టినుండి మరుగుపడుచున్నదో యా ప్రణాళికలన్నియు నొకవిధముగ నుపేక్ష వహించుచున్నవి.*

ఈ వచనములు హిందూధర్మసాధారణలక్షణమును వెల్లడించుచున్నను, ఒక ప్రత్యాదేశమునుండి మరియొక ప్రత్యాదేశమును విచక్షణచేసి హిందూధర్మము గ్రహించుటలేదని తెలుపుటలో న్యాయ మెంత మాత్రము కనబడదు. ఉపేక్షను సహనమని హిందూధర్మము పొరపడుట లేదు. సమస్త ప్రత్యాదేశములు సత్యమును బోధించుచున్నను, అవి సమముగ దానిని వ్యక్తపరచుట లేదు. కడచిన యుపన్యాసాంతమున నే నీ విషయమునుగురించి ప్రసంగించితిని. దాని నిచట పెంచి చెప్పుట యనావశ్యకము. ప్రతి మనుష్యుడు జీవితపరమార్థమునుగూర్చి సర్వోత్తమమగు ప్రత్యాదేశము తనకు లభించువరకు, పూనికతో యోచింపవలయునని, హిందూ

* Needham, Science, Religion and Reality. PP. 334-5

ధర్మము వాంఛించును. ఆకస్మికముగ క్షుద్రపద్ధతుల నతిక్రమింపజాలని జనుల ప్రయోజనమునిమిత్తము, అవి సహనముతో జూడబడినను, శ్రేష్ఠతరమయిన భావము, పవిత్రతరమయిన యుపాసన సదా వారి దృష్టిపథమున స్పష్టముగ నుంచబడును. అభ్యుదయగమనమును వేగిరపెట్టుట లాభకరమని హిందూధర్మము విశ్వసింపదు. మన యుచ్చతరధార్మికానుభవములను గ్రహింపజాలని వారలకు మనము వానిని తెలుపునప్పుడు, తమ దర్శనానుభవములను జన్మాంధులకు బోధపరచు బుద్ధిమంతులను పోలియుందుము. వారి యాధ్యాత్మిక నేత్రములను మనము తెరచిననె గాని, ధర్మద్రష్టలు వర్ణించు విషయములు వారు గ్రహింపజాలరు. కావున నొకడు తన నైతికజ్ఞానశక్తులకును విద్యకును పరిస్థితులకును అనుగుణముగ కలిగియుండు సహజయోచనాపద్ధతితో జోక్యము పెట్టుకొనకపోయినను, వా డేస్థితియం దున్నను సానుభూతితో చేయూత నొసంగి వాని యాత్మయోన్నతికి హిందూధర్మము తోడ్పడును. ధర్మప్రాంగణములోనికి మానవుల నిర్బంధించిప్రవేశపెట్టుటను హిందూధర్మము నిరసించినను, వారి మనస్సుయొక్క సత్యవివేచనాశక్తియు సత్యగ్రహణశక్తియు వృద్ధి నొందవలయునని

నొక్కి వక్కాణించును. అంతియగాక, అభిప్రాయ మందు పొరపడుట నైతికవికలత్వము గాదు. గ్రహించు టలో మాంద్యముగ నుండుట హృదయభ్రష్టత్వముగాదు. ఈశ్వరతత్త్వమునుగురించి సంపూర్ణనిర్దుష్టావగాహమె మోక్షప్రాప్తి కవసర మయినయెడల, మనలో నెందరు నరకముఖమునుండి తప్పించుకొనగలరు ? శక్తిగీతాగ్రంథ మిట్లు చెప్పుచున్నది : "ఓ జననీ, సిద్ధాంతములను గ్రహించుటలో కలిగెడు దోషములమూలమున ఉత్త మగుణాన్వితమగు నీ స్వరూపమును అనుభూతము చేసి కొనజాలని భక్తులపక్షమున నీవు కనికరముతో జూపు ననుగ్రహమునకు మేరయే లేదు."

ఆత్మీయాభివృద్ధి నరికట్టు బంధనముల భేదించు శక్తి ఆత్మకు గలదని హిందూధర్మము పూర్తిగ విశ్వ సించును. సకలమతములు కలడని చెప్పు కేంద్రప్రాయు డును సత్యస్వరూపుడు నైన భగవానుడు మానవులకు సంప్రాప్తములగు విశ్వాసములను నిరంతరము వికసింప జేయుచునే యుండును. అంతియ గాక, ఒక నియమావళి విడిచి యంతకంటె నుచ్చతరమయిన నియమావళి నతి శీఘ్రముగ ననుసరించుమానవులు చేయుప్రయత్నములు అభ్యుత్థానమునకు గాక అధఃపతనమునకె కారణము

లగును. చరిత్రను నిర్మాణము చేయుటలో, ఈశ్వరవిధా
నము మెల్లగా పనిచేయును; ఆత్రముజెందు సంస్కర్తలు
తమ యభీష్టప్రణాళికలను ప్రపంచమున బలవంతముగ
ప్రవేశపెట్టి తమ కాలములోనే ప్రపంచమును రక్షింప
యత్నించినయెడల, వారు అపజయము నొందుదురు.
మానవస్వభావము వేగిరపాటునకు లొంగనేరదు.
ఇంకొక విషయము. ఒకానొక ప్రత్యేకమతమునకు విరు
ద్ధముగ నుండు సర్వమును బలాత్కారముగ తొలగించి
విశ్వాసమునందును ఉపాసనయందును ఏక కృత్రిమబా
హ్యాకారము నెలకొల్పుట ప్రయోజనకారి యని
హిందూధర్మము నమ్మదు. శాసనపూర్వకముగ ప్రవేశ
పెట్టు మోక్షమార్గములం దైనను దానికి విశ్వాసము
లేదు. ఈశ్వరతత్త్వమును ఉపాసనను గురించి యేదో
యొక ప్రత్యేకాభిప్రాయము గలవారికే వినియోగపడు
నట్లు హిందూధర్మము మోక్షపథమును సంకుచితపరుప
లేదు. ఇతరులను పూర్తిగ నట్లు దూరము చేయుట
సర్వజీవదయాపరుడగు విశ్వవిభుని స్వభావమునకు విరు
ద్ధము. ఒక జాతిజనులు ఈశ్వరునికి అభిమానులనియు,
మానవకోటిలో ధర్మాభివృద్ధి జేకూర్చుటలో వారిమ
తమే కేంద్రస్థాన మాక్రమించు చున్నదనియు అన్య

ల్లెరు వారివద్దనుండి ధర్మము నరువు దెచ్చుకొనవల యును లేదా ఆత్మీయశుష్కత్వము నొందవలయు ననియు, తలంచుట యన్యాయము.

ఇంతకును గణింపదగినది మతము గాక శీలమె. ధర్మాత్ములు కలిగియుండు విశ్వాసములనుబట్టి గాక సలిపెడు ఘనకార్యములనుబట్టియె మీరు వారలను గుర్తింతురు. ధర్మ మనగా నిర్దుష్టమగు విశ్వాసము గాక సద్వర్తనము.* యథార్థధర్మతత్పరులు ఇతరుల విశ్వాస ములను గురించి యెన్నడును బాధపడరు. జీసను చెప్పిన మహావాక్యము ఆలకింపుడు: "మందలో జేరని యితర ములయిన గొఱ్ఱెలును నాకు గలవు." జీసస్ యూదు డుగ జన్మించి యూదుడుగ మరణించెను. ఎవరినడుమ నాతడు జీవింప సంభవించెనో యా యూదీయజనులకు "యూదులుగ నుండుట పాపము. క్రైస్తవులుగ మారుడు." అని యాతడు బోధింప లేదు. యూదీయ మతమును నిర్దుష్టము చేయుటకు ఆతడు యావచ్ఛక్తితో పాటుపడెను. అతడు హిందువుగ పుట్టియుండిన యెడల,

* Cp. Spinoza: " Religion is universal to the human race; whereever justice and charity have the force of law and ordinance, there is God's kingdom."

హిందూమతమునెడలను అవ్విధమునసె కృషిసలిపి యుండును. యథార్థసంస్కర్త, వంశపరంపరాగతముగ మానవకోటికి లభించిన ధర్మమును పరిశుద్ధపరచి విపులము జేయునె గాని దానిని తృణీకరింపడు; అంతకంటెను నిరాకరింపడు.

సత్యముకంటె తమ కులముల నధికముగ ప్రేమించు వారు తమ కులములకంటె తమనె యెక్కువగ ప్రేమించు స్థితికి వచ్చెదరు. క్రైస్తవులను పరికింతము. క్రైస్తవమతమె యథార్థమత మని వాదించుటతో క్రైస్తవులు ప్రారంభింతురు. పిమ్మట ప్రొటెస్టాంటిజమ్ మాత్రమె యథార్థమగు క్రైస్తవమత మని, ఎపిస్కొపాలియనిజమ్ మాత్రమె యథార్థమగు ప్రొటెస్టాంటిజ మని, హైచర్చిమాత్రమె యథార్థమగు ఎపిస్కొపల్ప్రొటెస్టెంటుక్రైస్తవమత మని, వారి ప్రత్యేక దృక్పథము మాత్రమె హైచర్చియొక్క యుద్దేశమును ప్రకటించు నని చెప్పెదరు.

ప్రతిమానవజీవి, ప్రతిసంఘము, ప్రతిజాతి గౌరవనీయమగు వ్యక్తిత్వమును కలిగియున్న దని చెప్పు హిందూసిద్ధాంతము మెల్లగా వ్యాప్త మగుచున్నది. ప్రతిసంఘము, తన కేది ప్రత్యేకముగను నైజముగను

గలదో దానిని వృద్ధి నొందించుకొనుటకు, కలిగియుండు సంపూర్ణ స్వాతంత్ర్యమును ఇతరసంఘములు మన్నింప వలయు నని యట్టి సిద్ధాంతము విధించును. ప్రతి విచి త్రతయు అసామాన్య మయి ప్రచారసాధ్యము గాక యుండును. ఒకరి కుపయుక్తమయినది యితరు లెల్లరకు నంత యుపయుక్తముగనె యుండునని భావించుట సత్య ముయొక్క లక్షణమును తృణీకరించుటయె. భిన్న స్వభా వులగు మానవులకు చాలినంత విశాలముగనె ప్రపంచ మున్నది.

ఎక్కుడు స్వేచ్ఛతో గూడిన విశాలజీవనము లోనికి హిందూవిధానము తన యనుచరులను గొంపో వుట లేదని యొకొకప్పుడు వాదింపబడును. అట్టి యస్పష్ట మగు నిందారోపణమునకు సమాధానము జెప్పుట కష్టము. ఎటులయినను, హిందూధర్మము ప్రాచీనభావ ముల స్థానమును బలాత్కారముగ నాక్రమించుకొనిన యెడల, అనగా క్రమవికాసపూర్వకమగు సంస్కరణ విధానమునకు మారుగ జనులను వెంటనె నూతనపద్ధతికి మార్పునట్టియు మతాంతరుల జేయునట్టియు విధానము నవలంబించినయెడల, అది యెక్కుడు ప్రయోజనకర మయిన యభ్యుదయమును కలిగించి యుండుట చాల

సందేహమె. స్వాభావికముగ హిందూదేశమునందు మతముపేరిట వర్ధిల్లుచు వచ్చిన యద్భుతములైన అలౌకికమహిమలను హిందూధర్మము ఛేదించి తీసివేయ లేదనుట వాస్తవము. తెగులుపట్టిన కొమ్మలను రెమ్మలను కొట్టివేయునది గాక వేరుపురుగుల వినాశము చేయునదియె హిందూవిధానము.

హిందూధర్మము ప్రఖ్యాతి గాంచిన దినములలో, సర్వమానవసన్మానము, అకుంఠితసత్యదీక్ష యను నియమద్వయమును హిందువులు పాలించుటచే, వారి సాధారణధార్మికజీవన మెంతయొ యభ్యున్నతి జెందెను; కాని యిటీవల హిందువుల యాత్మీయశక్తియొక్క "పటుత్వము క్షీణించుట" కాన నగును. హిందూధర్మమునందు మూఢవిశ్వాసమునకు బలియయినవా రనేకులు గలరు; కాని యే దేశములలో నుత్తమనాగరికత హీననాగరికతను తొలగించిన దని చెప్పబడునో యచ్చట సయితము హీననాగరికత యింకను నిలచియె యున్నది. అనాగరిక మనుష్యుని కనుగొనుటకు మనము విశేష దూరము పోనక్కర లేదు. ఈ విషయముల దెల్పుటలో ప్రమాణపురుషు డైయున్న సర్ జేమ్సు ఫ్రేజర్ (Sir James Frazer) ఇట్లు చెప్పుచున్నాడు: "నవీనమగు

నైరోపాఖండమందు విద్యావిహీను లయి మూఢవిశ్వాసమునకు దాసు లైయున్న తెగలలో, ఈజిప్టు హిందూదేశములందు కొన్ని వేల సంవత్సరముల క్రిందట నెటులుండెనో, ప్రపంచములో నతిదూరప్రాంతములందు మూలమూలల నిప్పటికిని మిగిలియున్న యనాగరిక నిమ్నజాతులలో నెటుల నున్నదో, చాల యెక్కుడుగ నటులనె కలదు. స్కాట్లండులో క్రూరుడైన భూస్వామిని గాని దేశమంత్రిని గాని వధించునిమిత్తము ఒక విగ్రహామునిండ సూదు లెట్లు గ్రుచ్చబడెనో, లేక ఐర్లెండులో నొకవనిత మంత్రవేత్త యగుటచే నెటుల నగ్నియందు మెల్లగ వ్రేల్చబడి మృత్యువాలు చేయబడెనో, లేక రష్యాలో చోరులు తమ నిశీధవ్యాపారము అదృశ్యముగ జరుపుకొనుటకు తోడ్పడు వెలుగును మానుష్యుని క్రొవ్వు ఇచ్చునని తలంతురు గాన దానితో వత్తులు చేయుటకై యొక బాలిక యెటుల చిత్రవధ గావింపబడెనో వెల్లడించు వార్తాపత్రికా వృత్తాంతములను జదివి యప్పుడప్పుడు నాగరికప్రపంచము దద్దరిల్లును.* క్రైస్తవు లనేకులకు మంత్రతంత్రము లందు నమ్మకము గలదు. మానవసంఘములలోని

* The Golden Bough, abridged edition, p. 56.

యభ్యాసములను, అవి యెంత కాలమునుండి ప్రబలి యున్నవో యా కాలపరిమితి ననుసరించి, నిర్మూలించుట కష్టము. సత్వరసంస్కరణములు దుస్సాధ్యములు; మంద పరివర్తనములు సయితము విశేష కష్టసాధ్యములు. ఏల యన, మతములు స్వజాతీయపద్ధతులకు నెప్పటి కప్పుడు మరలు స్వభావము కలిగియుండును. పురుషరూపములనె గాక స్త్రీరూపములను గూడ నారాధనకై కల్పించు కొన్ని మతములకు జెందిన యాదిమజాతులు బౌద్ధసంఘ మున జేరినప్పుడు, వారు పురుషుడైన బుద్ధునితో పాటు స్త్రీయగు తారను గూడ నర్చించుటకు బూనిరి. ఆష్టారెత్తు (Ashtoreth)ను, ఐజిసు (Isis) ను, ఆఫ్రో డైటు (Approdite) ను భజించు గ్రీకోరోమనులు క్రైస్తవధర్మమండలిని ప్రవేశించిన పిమ్మట మేరీపూజ (Mariolatry) వృద్ధి జెందినది. క్రైస్తవమతమునందు కలుపుకొనబడిన హిందువునిగురించి యొక కథ కలదు. అతడు ఆదివారమునాడు చర్చికి, శుక్రవారమునాడు కాళీదేవియొక్క గుడికి వెళ్ళుచుండెడివాడు. "క్రైస్తవు డవు గావా?" యని ఫాదిరిదొర యడుగ, "అవును, నేను క్రైస్తవుడనె; కాని దాని యర్థము, నేను నామత మును మార్చుకొంటి ననియా?" యని యతడు బదులు

చెప్పెను. ఆపద, అనారోగ్యము, మరణభీతి, మరణావస్థ మొదలగునవి సంప్రాప్తములయిన సమయములందు అన్యమతావలంబకులైన హిందువులు తరచుగ హిందూ దేవతలకు మ్రొక్కుచుందురు. బాహ్యామత వేషములకు అంతర్జీవనమున ప్రవేశ్యుండవు. సంస్కర్త యిచ్చు నాజ్ఞకు బద్ధులై సాంఘికులు తమకు వంశపరంపరాగతముగ లభించిన యజ్ఞాతప్రవృత్తిని హఠాత్తుగ మార్చుకొనజాలరు. జ్ఞానమునందు, నీతియందు, ఉన్నతపదవి బడయునట్లు వారు విద్యావంతులయిననె గాని, పురాతనభావములు సమూలముగ వారినుండి తొలగనేరవు.

హిందూవిధానము పూర్తిగ నపజయము గాంచ లేదు. ఇంకను విశేషోన్నతి జెందుట కవకాశ మున్నను, సర్వతోముఖముగ నభివృద్ధి చేకూరినది. హిందూధర్మమునందు ఎల్లరకు నిర్ణీతమగు నేయొక సమానవిశ్వాసము గాని యేయొక యారాధనాప్రణాళిక గాని లేక పోవుట వాస్తవమైనను, అది యొక సమానమగు క్రమపద్ధతిలోనికి బహుసంఘములను వివిధోపాసనాప్రణాళికలను దెచ్చి బంధించెను. 1911 వ సంవత్సరపు జనాభా లెక్కలకు సంబంధించిన కార్యనివేదనమునందు బరన్సు (Burns) గారు ఇట్లు వ్రాసిరి. "నా విచారణవలన

మొత్తముమీద తేలిన పర్యవసాన మేమనగా, హిందువులలో బహుసంఖ్యాకులు భగవానుడని గాని పరమేశ్వరుడని గాని యీశ్వరుడని గాని పిలువబడు నేకమాత్రుడైన యుత్తమదైవమునందు దృఢవిశ్వాసము కలిగియున్నారనియె.* హిందూభావములయొక్కయు ఆదర్శములయొక్కయు వ్యాపనమునుగురించి సర్ హెర్బర్టు రిస్లి (Sir Herbert Risley) గారు ఇట్లు తెలిపిరి: "ఈ భావములు బడయుటకు పండితులు మాత్రమె యర్హులై యుండలేదు. చాలవర కవి వీధిలో తిరుగు మనుష్యునికి కూడ తెలియును. పరమాత్మ, కర్మము, మాయ, ముక్తి మొదలగు విషయములనుగురించి జ్ఞానలేశముగల యే హిందూకృషికునితో మీరు మాటాడినను, అట్టి యంశములలో మీరు జూపిన ప్రసక్తివలన వానికి మొదట కలుగు నాశ్చర్యము తొలగినవెంటనె, ఆ పదము లాతనికి పరిచితములై యనియు, ఆతని భావి జీవితనిర్మాణముతో వానికిగల సంబంధమును గూర్చి యాచరణమునకు వలసినంత స్థూలజ్ఞానము ఆతడు కలిగియున్నాడనియు, మీరు గ్రహించగలరు."♦ ఆసేతు

* Part 1, p. 362.

♦ The People of India.

హిమాచలము హిందువులలో ఆంతరికసంఘీభావము కలదు.

కొండజాతులనుండియు, సగము నాగరికత జెందిన యితర జనసమూహములనుండియు, క్రొత్తగ జేర్చుకొనబడిన వారిని సంతర్భుక్తము చేయుపని నిదానముగ జరుగుచు నేవిధముగను పరిపూర్తి జెందలేదు. హిందూ నాగరికతచే నింతవరకు తమ నీచభావములును నికృష్ట విశ్వాసములును నిర్మూలితములు గాక వానినె యింకను నవలంబించు పలువురు హిందువులుగ పరిగణింపబడు చున్నారు. కడచిన కొలది శతాబ్దములలో హిందూ ధర్మము తన యాదర్శములకు బద్ధమై యుండలేదు. నిమ్నజాత్యుద్ధరణకార్యము శోచనీయముగ నుపేక్షింపబడెను.

సంధించి మతిచెడి యొకడు ఆత్మహత్య జేసికొనబోవు నప్పుడు, వాని నాకృత్యమునుండి బలవంతముగ కాపాడుట యెంత విధాయకమో, సరియయిన యభిప్రాయములు కలిగియుండుటకు తోడిమానవుని నిర్బంధించుటయు నంత విధాయకమె యని తరచుగ చెప్పబడు కువాదమును హిందూధర్మ మామోదింపదు. ఇశ్రాయేలు (Israel) వంశస్థులు కెనాన్ (Canaan)

దేశములో మొదట ప్రవేశించినప్పటినుండియు, మానవ చరిత్రయందు రక్తాక్షరములతో సంకీర్ణమగు నేకేశ్వర విశ్వాసముయొక్క యసహనము లిఖింపబడి యున్నది. ఈర్ష్యాగుణారోపితుడైన యేకేశ్వరుని నుపాసించువారు అన్యమతస్థులతో నిష్కారణముగ యుద్ధములు సలుపుటకు పురిగొల్పబడుదురు. తాము లోబరచుకొన్న వారలను పెట్టు హింసలకు ఈశ్వరానుజ్ఞను వారు వేడుదురు. ప్రాచీనుడగు ఇజ్రాయేలుని దురహంకారమె క్రైస్తవ మహమ్మదీయమతములకు సంక్రమించినది. పాలస్తీను దేశమునకు బదులుగ గ్రీసుదేశము ఈ విషయమును పరిష్కరించి పాశ్చాత్యనాగరికతను నిర్మాణము చేసి యుండినయెడల, అది యిప్పటికంటె బాగుగ నుండకపోయెడిదేమో, మీరె చెప్పవలయును. వివిధపరమతస్థుల వినాశము ప్రోత్సహించి సమర్థించు పిచ్చి మూర్ఖత్వము వలన జనించు మతకలహములు హిందూదేశమునందు వాస్తవమునకు లేవనియె చెప్పవచ్చును. అచ్చటచ్చట నట్టి వెర్రిమూర్ఖత్వము చెలరేగి యుండినమాట నిజమె. కాని హిందూధర్మము విశ్వాసరాహిత్యమునకై యొకరిని హింసించుటను సాధారణముగ నెన్నడును ప్రోత్సహింపలేదు. ఇతరమతచరిత్రములతో పోల్చి చెప్పవలసివచ్చి

నచో, దాని చరిత్రము హింసాకళంకితముగాక వాని కంటె నెంతయో పరిశుద్ధ మయినది. అనేక భిన్నమానవ సంఘములను మిత్రభావమున కలిపియుంచుటకు దానికి శక్తి యుండెను. మానవజాతిలో దాదాపుగ నైదవ వంతు జనులను తన యనుచరులుగ గలిగియున్న బౌద్ధ మతము ఎల్లప్పుడు పరమతములను గౌరవించెను; బలాత్కారముగ వానిస్థానము నాక్రమించుట కెన్నడును ప్రయత్నింపలేదు. తమ సిద్ధాంతములను వెల్లడిచేసి కొనుచు పరులవి గర్హించుటకు తన కాలములో మత వివాదకులు కనపరచిన యాసక్తిని బుద్ధుడు ఖండించె నని యాదిమబౌద్ధ గ్రంథములలో నొకటి చెప్పుచున్నది.* భిన్నసంఘములలో అతృప్తిని ఫురిగొల్పునట్లు కనబడు నన్ని వివాదములు మానవలయు నని బుద్ధుడు తన

* సుత్తనిపాత, 782. అంగుత్తరనికాయ, iii. 57. 1 ను కూడ చూడుడు. అందు బౌద్ధమతస్థులు అన్యమతస్థులకు కూడ దానములు చేయవలయునని బుద్ధుడు హెచ్చరించుచున్నాడు. బౌద్ధమతస్థులు కానివారు సయితము స్వర్గము బడయ నర్హులే యని యాయన యంగీకరించుచున్నాడు. మధ్యమనికాయ (1. పుట 483) లో, ఒక ఆజీవకుడు కర్మసిద్ధాంతమున విశ్వాసము కలవాడగుటవలన స్వర్గమును పొందినట్లు ఆయన యుదాహరించి యున్నాడు. నిజమయిన సద్వర్తనముగల బ్రాహ్మణులను బుద్ధుడు విశేషముగ గౌరవించెను.

యనుచరులను గోరెను. అశోకుని శిలాశాసనములలో నొకదానియందలి విషయము మతసహనమె: "దేవతలకు ప్రియుడగు రాజు అన్నివిధములయిన మతములను గౌరవించును; కాని సర్వమతసారాంశము ప్రకటించుటతో సమమయిన ఫలము గాని కీర్తి గాని మరియొకటి లేదని తలంచును. కావున స్వవిశ్వాసమును సన్మానించుటయు, పరవిశ్వాస మెన్నడును నిందింపకుండుటయు ముఖ్యము. ఇందులకు భిన్నముగ వర్తించువాడు పరమమతమునకు అన్యాయము చేయుటయె గాక, స్వమతమునకు హాని కలిగించుకొనును." "నా సంరక్షణముక్రింద సర్వవిధములయిన మతసిద్ధాంతములు అనుసరింపవచ్చును."* హిందూదేశములోని హిందూబౌద్ధప్రభువులు ఈ నియమానుసారము నడచిరి. తన్మూలమున, సర్వవిఖ్యాతమతములచే హింసింపబడి శరణాగతులై యరుదెంచినవారు హిందూదేశమున ఆశ్రయమును బడసిరి. యూదులు, క్రైస్తవులు, పారశీకులు తమ పద్ధతుల ననుసరించి వర్తిల్లుటకు సంపూర్ణస్వాతంత్ర్య మొసంగబడిరి. ప్రయాగ మహోత్సవసమయమున హర్షచక్రవర్తి, మొదటి దినమున బుద్ధునికి, రెండవ దినమున తన తండ్రి కిష్టదైవ

* పంద్రెండవ శిలాశాసనము.

మైన సూర్యునికి, మూడవ దినమున శివునికి, శిలా విగ్రహముల ప్రతిష్ఠించె నని యూయన్ ష్వాంగు (Yuan Chwang) తెలుపుచున్నాడు. తొమ్మిదవ శతాబ్ధపు స్థానూరవియందలి సుప్రసిద్ధ కోట్ట యాముని తామ్రశాసనములును, కొచ్చిన్‌లోని విజయరాగదేవుని తామ్రశాసనములును, క్రైస్తవమతము నెడల హిందూ చక్రవర్తులు సహనము జూపుటయె గాక, తన్మతావ లంబకులకు ప్రత్యేకవసతులను కల్పించియుండి రను సత్యము నుద్ఘోషించుచున్నవి. తన రాజ్యమున సిథిల మయిన యొక క్రైస్తవచర్చిని తిరిగి నిర్మించుటకు మైసూరుహిందూరాజు ఇటీవలనె కొంత ద్రవ్యము దానముచేసెను.

నేడు ప్రపంచము అత్యంతస్వల్పప్రదేశముగ మారినది. ప్రకృతిశాస్త్రజ్ఞుల సాహసప్రయత్నములకును అద్భుతకార్యములకును కృతజ్ఞులము. విదేశస్థులు మన యింటిపొరుగువారైరి. జనసమ్మేళనము భావవినిమయ మును సమకూర్చుచున్నది. ప్రపంచము ఏకసహకార సంఘ మని మనము మెల్లగా గుర్తించుచున్నాము. మనము గణింపదగినంత శక్తివంతములై ఇతరమతములు కాన్పించుచున్నవి. శాంతిసఖ్యతలతో మనము కలసి

జీవింపగలుగుటకు సాధనోపాయములను వెతకుచున్నాము. మనము వెలుగును కలిగియున్నామనియు, ఇతరులెల్లరు చీకటిలో తడవులాడుచున్నారనియు, మనము చెప్పుచున్నంతకాలము మతవిషయమున శాంతిసఖ్యతలు పొందనేరము. అట్లు నుడువుట యుద్ధమునకు కాలుదువ్వుటయె. నేటి ప్రపంచరాజకీయాదర్శము, ఒకేవిధమయిన నాగరికతయు ఒకే సంఘేచ్ఛయు గల యేకసామ్రాజ్యము గాక, జీవనమునందు, జ్ఞానమునందు, అభ్యాసములందు, సంస్థలయందు, పూర్తిగ భేదించియుండునట్టియు శాంతిక్రమములతోను సామరస్యసహకారములతోను ఒకదానిప్రక్కను మరొకటి యుండునట్టియు, అన్యభాషలో నిర్వచించుటకె సాధ్యముగాని తమ ప్రత్యేకనిరుపమానశ్రేష్ఠగుణములను లోకమునకు సమర్పించునట్టియు స్వతంత్రజాతుల భ్రాతృసమితియె. విశాలజీవనమునందు స్వాతంత్ర్యమును సంరక్షణమును ఆత్మోపలబ్ధిని ప్రతిమానవకుటుంబశాఖయు పొందుటకు అవకాశ మిచ్చు ప్రపంచసంయుక్తరాష్ట్రపరిపాలనాక్రమమునందు, పదునెనిమిదవశతాబ్దపు సర్వజనీనతయు పందొమ్మిదవ శతాబ్దపు జాతీయతయు మేళవింపబడినవి. ఆ ప్రభుత్వాదర్శము మతజీవనములోనికి ప్రసరింపజేయని

యెడల, ప్రపంచమందు మతమునకు మంచి భావిదశ కలదను నాశ నాకు లేదు. ఏ కొలది భిన్నమతములలో నైన నొక్కొక్కటియు తనకె సత్యసారమున కాకరమగు ప్రత్యాదేశము కలదనియు, దానిని స్వీకరించుటయె స్వర్గమున కనన్యమార్గ మనియు, వాదించునప్పుడు, సంఘర్షణము లనివార్యములు. అట్టి సంఘర్షణములందు ఒక మతము మరొకమతమును అగ్రగామి కానియ్యదు. ప్రపంచము దుమ్మును ధూళియు నయి నాశమగువరకును ఏదియు నాధిపత్యము బడయజాలదు. తనది కానట్టి ప్రత్యన్యమతమును ధ్వంసముచేయుట మతవిషయమున నొకవిధమగు బొల్షివిజమ్. మనము దాని నరికట్టుటకు ప్రయత్నింపవలయును. ఒక సమానవిశ్వాసమునందు గాక ఒక సమానాన్వేషణమునందు ధర్మైక్యతను కనుగొన యత్నించు హిందూవిధానమువంటి దేదైన స్వీకరించిన పక్షముననే, మన మాకార్యము నిర్వహింపగలము. ప్రతివ్యక్తికి మాత్రమె గాక యుపయోగకరమని నిర్ధారణ యయి యొక్కొక్కవిధమగు రూపము నొందిన ప్రతిసజీవసంఘమునకు వలసినంత స్వాతంత్ర్యము సమకూర్చు నైక్యతయందు, ఆధ్యాత్మికైక్యతయందు, విశ్వాస ముంచుదము. బాహ్యమునుండి కూర్పబడు

నైక్యతను విశ్వసింపకుందము. ఏలయనగా, జీవము యొక్కయు జ్ఞానముయొక్కయు సర్వచారిత్రికస్వరూపములు అనుభవజ్ఞుల యంగీకారమును అట్లే యీశ్వరప్రామాణ్యతను బడయగలవు. ఒక మతము అన్యమతములను దిగమ్రింగినయెడల, ప్రపంచమున గొప్పకొరత యేర్పడును. ఎట్టి భేదమునకు జోటీయ్యని రూపసమత్వమును గాక యత్యంత విభిన్నతావిలసితమయిన సామరస్యమును ఈశ్వరుడు వాంఛించును. సర్వమును సమీకరణము జేసి సమన్వయపరచు హిందూధర్మముయొక్క యాశయము హిందూధర్మమును ఒక మహారణ్యముగ మార్చెను. అందలి ప్రతి సజీవశాఖయు తన కర్తవ్యమును నెరవేర్చును; ఈశ్వరాదేశముచే నడపబడును. ఒక్కొక్కటి తన స్థానమున నుండుటయు, అన్నియు ఈశ్వరగానమందు తమ భిన్నస్వరములతోను అపస్వరములతో సయితమును సమ్మిళితమయి, హిరాక్లిటసు (Heraclitus) మహనీయుడు నుడివినట్లు, శ్రేష్ఠతమమయిన సామరస్యము వెలువడజేయుటయు, మన యాదర్శమై యుండవలెను.

మతసంఘర్షణసమస్యను హిందూధర్మము పరిష్కరించునట్టి పద్ధతి యెల్లరచే భావికాలమున నంగీక

రింపబడుట చాలవరకు నిశ్చయమని నాకు పొడగట్టు చున్నది. ఒకడు, తన లక్ష్యములను నిర్ణయించుకొనుటకును వాని సంపాదనాప్రయత్నమున తన మార్గమును నిరూపించుకొనుటకును, గలిగియున్న స్వాతంత్ర్యమును అమితవిశ్వాసముతో మన్నించు నేటి మానవసమత్వాదర్శము అందులకు సాయబడును. స్వయముగ వరింపని దేద్దియు హితకరము గాదు; స్వయముగ నిర్ణయింపని దేద్దియు మూల్యవంతము గాదు. ప్రపంచములో ప్రతి ప్రాంతమందును భిన్నమతములు మెల్లగా తమ ప్రేమ హస్తములను ఒకదాని కొకటి యందిచ్చుటకు నేర్చు కొనుచున్నవి. ఈ సాయంకాలము నే నిచ్చుట నందుట యందుల కొక నిదర్శనము. సర్వమతమహాసమ్మేళనములును ఉదారస్వభావులగు భిన్నమత తత్త్వజ్ఞుల మహాసభలును ఒండొరులకు జ్ఞానపరిచయమును ఆనుకూల్యతను పెంపొందించును. ఒకదానితో నొకటి సరిపోల్చి వివిధధర్మగ్రంథములు పఠించుటమూలమున అన్యమతములయెడ నెక్కుడుగ న్యాయదృష్టి వర్ధిల్లుచున్నది. జనుల యున్నతజ్ఞానము, యుగాశయము, కాలావసరము ప్రతిమతమునకు గల ప్రత్యేకవిశేషత్వమును నిరూపించుచున్నవని కనపరచుటవలన, తద్గ్రంథపఠనము సర్వ

మతతత్త్వైక్యతను మనకు సుగ్రాహ్యము జేయును. మతముల యాంతరికసంబంధమునుగురించి స్పష్టము గ యోచించుటకు నేర్చుకొనుచున్నాము. పరస్పరవిరుద్ధములుగ గాక యన్యోన్యసహకారులుగ, అందువలన సమానోద్దేశము నెరవేర్చుటకు పరస్పరావసరములుగ, వివిధమతములనుగూర్చి తలపోయు ధోరణిలో పడుచున్నాము. పరమతసన్నిహితసాంగత్యము, ఏదోయొక మతముమాత్రమె సహనసాహసములు, స్వార్థరహిత ప్రేమ, నిర్మాణశక్తి గల మహనీయులను జనింపజేసిన దను నమ్మకమును పారద్రోలినది. ప్రత్యేకమమతము కోపోద్రేకమును వాంఛాతీవ్రతను మత్సరాంధత్వమును తన యనుచరులందు నివారించెను. ఎట్టి యనాగరికమతమైనను విశ్వవిధానమునం దొక స్థానము కలిగియున్నట్లు కాన్పించుచున్నది. ఏలయన, ప్రఫుల్లకుసుమములు, అవి వేనినుండి యుద్భవిల్లునో, ఆ మలినమూలముల యావశ్యకతను నిరూపించును. ఈశ్వరసాక్షాత్కారమునకు ప్రాముఖ్యత నీయబడుటవలన అంధవిశ్వాసము హైన్యత నొందుచున్నది.* హేతుజ్ఞానము భిన్నవస్తువు

* Cp. Dean Inge "The centre of gravity in religion has shifted from authority to experience ......The fundamental principles of mystical religi-

లను వేరుపరచి వేర్వేరు గదులయందు మూసిపెట్టును ; కాని యున్నతసహజజ్ఞానము వస్తువుల స్వాభావిక భేదములను పరిగణించి పరిపూర్ణతయొక్క విశాలైక్యతయందు మిలనముచేయ గడంగును. యథార్థధర్మతత్పరులు గాక, ఆంశికధర్మశీలురును కేవలధర్మశూన్యులును ఒండొరుల అంధవిశ్వాసములనుగురించి కలహించెదరు. స్విఫ్ట్ (Swift) మహాశయుడు కఠినవాక్కులలో నుడివినట్లు, "ఒండొరుల ద్వేషించుకొనుటకు చాలినంత మతము మనకు కలదు కాని యొండొరుల ప్రేమించుకొనుటకు మాత్రము వలసినంత లేదు."* మనము ధర్మజీవనమునందెంతగా పెరుగుదుమో యంతగా విభిన్నతను సహించువార మగుదుము.

**on are now very widely accepted, and are, especially with educated people, avowedly the main ground of belief."**

*The Platonic Tradition in English Religious Thought PP. 113—15*

# తృతీయోపన్యాసము

## హిందూధర్మము : 1.

హిందూధర్మమందలి యనుష్ఠానప్రకరణమును మన మెత్తుకొనుటకు పూర్వము, నైతికనిబంధనములను గురించి హిందువులకు గల యభిప్రాయమునకు వ్యతిరేకముగ చెప్పబడు ప్రధానాక్షేపణములలో కొన్నిటి విషయమై ముచ్చటించి కొంతచిక్కును తొలగించుట యావశ్యకము. మాయావాదము జగత్తు మిథ్యయని త్రోసివైచి నైతికసంబంధము లన్నియు నర్థశూన్యములుగ జేయుచున్న దని యొక యభిప్రాయము కలదు. భౌతికప్రపంచము బూటక మనియు, మానవచరిత్ర భ్రమాజనిత మనియు, చెప్పబడును. కాలమున కర్థము లేదు; జీవితమున కుద్దేశము లేదు. మానవజాతి నెటులనో వశపరచుకొన్న యీ భ్రాంతినుండి విముక్తి బడయుటయె మన సమస్తప్రయత్నములయొక్క లక్ష్యము.

వేదకాలమందలి తత్త్వజ్ఞులు జగత్తు వాస్తవమని విశ్వసించిరి. ఉపనిషత్తులు ప్రపంచమునకు ఈశ్వరసంబంధపూర్వకమగు యాథార్థ్యత కలదని నుడువుచున్నవి. సంగీతపరికరమును దాని ధ్వనులనుగూర్చియు,

సృష్టివిధానము తెంపు లేకుండ పాడబడు నొకే దీర్ఘ గానము కాదు; పరిపూర్ణతను వెల్లడించు విరామస్థానములు గీతమునందుండియే తీరును. కేవలచారిత్రికఘటనాపరంపరయె సర్వము కాని యెడల, అప్రాప్యమగు నాదర్శముకొరకు ప్రయత్నించుటయే మనకు శాశ్వతముగ విధింపబడని యెడల, చారిత్రికఘటనాపరంపరయందు నేదోయొక సమయమున మనము పరిపూర్ణతను జెందవలెను. అదియె మన చారిత్రికవ్యక్తిత్వమును అతిక్రమించుట, జననమరణములనుండి యనగా సంసారమునుండి మన విముక్తిని బడయుట. ఉద్దేశసాఫల్యమునకై జరుగు కృషియె చరిత్రము. దాని సాఫల్యతను క్రమక్రమముగా మనము సాధించుచున్నాము. ప్రతిజీవికి తన పరమార్థము సిద్ధించుటయె మోక్షము. పరిపూర్ణత జెందుటతో చారిత్రికజీవిత మంతమునొందును.* ఒక జీవి తన పరమార్థమును నెరవేర్చుకొనునప్పుడు, పరిపూర్ణతావిలసితమగు దృష్టివిశాలతను వృద్ధి నొందించుకొనును; కాని తన వ్యక్తిత్వమును గోల్పోవక తన కార్యములకు కేంద్రస్థానముగ నుంచుకొనును. సమస్తవిశ్వము పరిపూర్ణత జెందినప్పుడు, ముక్తజీవులు నిర్గుణసమాధియందు మును

* జ్ఞానైక నివర్త్యత్వమ్.

గుదురు. ఒక యణువువలె మన భూమండల మెచ్చట చరించుచున్నదో ఋం నక్షత్రమయమగు విశాల విశ్వముయొక్క వినాశమునకై నిశ్శబ్దముగను నిశ్చయముగను కృషి సలుపుచున్న ప్రాపంచికమహాశక్తులు నిజగమ్యస్థానము చేరనున్నవి. ఆత్మవినాశముమూలమున జగత్తు జన్మసాఫల్యత గావించుకొనును. స్థలపరివ్యాప్తమగు వస్తుజాలము పరిమితమై పరిమాణము గలిగి యున్నదని యంగీకరించు ఈన్‌స్టీన్ (Einstein) యొక్క రెలిటివిటి (Relativity) సిద్ధాంతము అట్టి ప్రపంచవిలయమునకు ప్రతికూలము గాదు. కాని సర్వశక్తుడు అనగా అనంతలీలాగర్భుడు అయిన పరాత్పరుని స్వేచ్ఛాక్రీడకు తన్మూలమున నెట్టి భంగము వాటిల్లదు. ఈజగత్తుపై తెర పడును గాని, మరియొక యవకాశము, మఱియొక కథాక్రమము, మరియొక నాటకము ప్రారంభము కావచ్చును. ఆ తీరున యుగయుగముల పర్యంతము జరుగవచ్చును.

అట్టి ప్రపంచవిలయము మన సకలోద్యమములయొక్క దీనపర్యవసానముగ నుండునని కొందరికి కనబడవచ్చును. కావున శాశ్వతస్వర్గమును గాని శాశ్వత నరకమును గాని మనకు వారు చిత్రించి ప్రదర్శింతురు.

సృష్టివిధానము తెంపు లేకుండ పాడబడు నొకే దీర్ఘ గానము కాదు; పరిపూర్ణతను వెల్లడించు విరామస్థానములు గీతమునందుండియే తీరును. కేవలచారిత్రికఘటనా పరంపరయె సర్వము కాని యెడల, అప్రాప్యమగు నాదర్శముకొరకు ప్రయత్నించుటయే మనకు శాశ్వతముగ విధింపబడని యెడల, చారిత్రికఘటనాపరంపరయందు నేదోయొక సమయమున మనము పరిపూర్ణతను జెందవలెను. అదియె మన చారిత్రికవ్యక్తిత్వమును అతిక్రమించుట, జననమరణములనుండి యనగా సంసారమునుండి మన విముక్తిని బడయుట. ఉద్దేశసాఫల్యమునకై జరుగు కృషియె చరిత్రము. దాని సాఫల్యతను క్రమక్రమముగా మనము సాధించుచున్నాము. ప్రతిజీవికి తన పరమార్థము సిద్ధించుటయె మోక్షము. పరిపూర్ణత జెందుటతో చారిత్రికజీవిత మంతమునొందును.* ఒక జీవి తన పరమార్థమును నెరవేర్చుకొనునప్పుడు, పరిపూర్ణతావిలసితమగు దృష్టివిశాలతను వృద్ధి నొందించుకొనును; కాని తన వ్యక్తిత్వమును గోల్పోవక తన కార్యములకు కేంద్రస్థానముగ నుంచుకొనును. సమస్తవిశ్వము పరిపూర్ణత జెందినప్పుడు, ముక్తజీవులు నిర్గుణసమాధియందు మును

* జ్ఞానైక నివర్త్యత్వాత్.

గుదురు. ఒక యణువువలె మన భూమండల మెచ్చట చరించుచున్నదో యా నక్షత్రమయమగు విశాల విశ్వముయొక్క వినాశమునకై నిశ్శబ్దముగను నిశ్చయముగను కృషి సలుపుచున్న ప్రాపంచికమహాశక్తులు నిజగమ్యస్థానము చేరనున్నవి. ఆత్మవినాశముమూలమున జగత్తు జన్మసాఫల్యత గావించుకొనును. స్థలపరివ్యాప్తమగు వస్తుజాలము పరిమితమై పరిమాణము గలిగి యున్నదని యంగీకరించు ఈన్‌స్టిన్ (Einstein) యొక్క రెలిటివిటి (Relativity) సిద్ధాంతము అట్టి ప్రపంచవిలయమునకు ప్రతికూలము గాదు. కాని సర్వశక్తుడు అనగా అనంతలీలాగర్భుడు అయిన పరాత్పరుని స్వేచ్ఛాక్రీడకు తన్మూలమున నెట్టి భంగము వాటిల్లదు. ఈజగత్తుపై తెర పడును గాని, మరియొక యవకాశము, మఱియొక కథాక్రమము, మరియొక నాటకము ప్రారంభము కావచ్చును. ఆ తీరున యుగయుగముల పర్యంతము జరుగవచ్చును.

అట్టి ప్రపంచవిలయము మన సకలోద్యమములయొక్క దీనపర్యవసానముగ నుండునని కొందరికి కనబడవచ్చును. కావున శాశ్వతస్వర్గమును గాని శాశ్వతనరకమును గాని మనకు వారు చిత్రించి ప్రదర్శింతురు.

కాని యీ శాశ్వతపదవు లనిన నిత్యములయిన యల సత్యజీవనస్థితులె. హెర్బర్టు స్పెన్సరు (**Herbert Spencer**) చెప్పినట్లు, పరిపూర్ణతనుండి యనగా ఆవరణమునకు తగినట్లు జీవి పొందు సంపూర్ణానుకూల్యతనుండి తొలగుట వినాశహేతువె. పరిపక్వావస్థ యన పూర్తియయిన నిశ్శబ్దత, నిశ్చలత, మరణము. ఈశ్వర స్తోత్రములను మనము పఠించుచుండ, ఈశ్వరుడు తనను గురించిన యీ ప్రశంసావాక్యములను వినుటకు నంతు లేని యోరిమిని ప్రదర్శించునట్టి కార్యరంగముగ స్వర్గ ముండునని తెలుపు దృష్టాంతములు ప్రాక్ప్రతీచీమండలముల రెంటియందును గలరు. ముక్తజీవికి నుపయుక్తమగు కార్య మొక్కటియె; అది మోక్షప్రాప్తికై కృషిసలుపు జీవులకు సాయపడుట. ముక్తి బడయని జీవులుకొందరు మిగులుచు, తరణోపాయమగు జ్ఞానము కొరకు నెంతకాలము నిరీక్షించుచుందురో యంత కాలము ముక్తాత్ములకు కొంతపని యుండును. కాని ప్రపంచపరమార్థము ఫలించిన దనియు, సర్వమానవులకు పరిపూర్ణత్వము సిద్ధించిన దనియు, మన మంగీకరించినయెడల, ఇక జరుగవలసిన కార్య మెద్దియు నుండదు. "అనంతకాలము మనుటవలన, శ్రేష్ఠము

శ్రేష్ఠతర మగుట గాని శ్వేతము మరింత శ్వేతముగ మారుట గాని తటస్థింపదు."* అని అరిస్టాటిల్ (Aristotle) చెప్పుచున్నాడు. కృషి లేనియెడ, సృష్టియె లేదు. ఎల్లరకు ముక్తి కలుగుట యన సృష్టికార్యము పరిసమాప్తి నొందుటయె. బ్రాడ్లే (Bradley) వచించునట్లు, "పూర్ణముగ సత్యమయిన దెద్దియు క్రియావంతము గాదు." క్రియాశీలత చారిత్రికఘటనాక్రమముయొక్క లక్షణము. పరిపూర్ణతాసిద్ధి చారిత్రికఘటన కాదు. అది లోపరహితము; ఎట్టి కార్యములకు జోటియ్యదు.

సృష్టి యనంతమనియు, కావున జరుగవలసిన కార్య మెల్లప్పుడు నుండుననియు, కొందరు వాదింతురు. సర్వజీవులు పరిపూర్ణత జెందు కాల మెన్నటికిని రాదని వారి వాదనయొక్క తాత్పర్యము. కాని వారు చెప్పునదియె వాస్తవమైనచో, ఈశ్వరసంకల్పమునకు భంగము కలుగును. అనంతసృష్టిక్రమము అనంతముగ జరుగుచుండునంత కాలము, ముక్తాత్ములు సర్వముక్తి సిద్ధించుతరి—అనగా, మానవు లందరకు మోక్షము ప్రాప్తించు సమయమున—మాత్రమె గోలోప్పునట్టి తమ వ్యక్తిజీవితముల కలిగియుండ వలసివచ్చును.

* Nicomachean Ethics i. 6.

FX

శంకరుని వాదము మాయావాద మని చెప్పుట న్యాయము కాదు. శంకరుడు విజ్ఞానవాదమును ఖండించి ప్రాపంచికవిషయములకు ఆత్మేతరమయిన యాథార్థ్యత కలదని నిరూపించెను. మనకు గోచరించునప్పుడు విషయము లాకారము దాల్చుననియు, మనకు కానిపించనప్పుడు తమ యస్థిత్వమునె గోల్పోవుననియు, చెప్పు దృష్టివాదము ఆతని వాదము కాదు. శంకరుడు స్వప్నములను జాగ్రదావస్థలోని యనుభవములనుండి వేరుపరచి చూపి యారెంటిని తారుమారు చేయవలదని హెచ్చరించెను. జాగ్రదావస్థలోని యనుభవములను మన తార్కికజ్ఞాన మెట్టి యుక్తిచేతను అసత్యము లని ఖండింపదు.* నాకు దెలిసినంతవరకు ఆతడు విషయాస్తిత్వవాదియె. విషయములు భావములను పాలించును.♦ శంకరుని యవిద్యాసిద్ధాంతముకూడ ఈయభిప్రాయమును స్థిరీకరించును. ఏలయన, అవిద్య ఏ యొకానొక మానవాత్మయో

* నైవమ్ జాగరితోపలబ్ధమ్ వస్తుస్తంభాదికమ్
కస్యాంచి దపి అవస్థాయామ్ బాధ్యతే.
బ్రహ్మసూత్రముల వ్యాఖ్యానము, ii. 2. 29

♦ న వస్తు యథాత్మ్యజ్ఞానమ్ పురుషబుద్ధ్యపేక్షమ్.
భూతవస్తువిషయాణామ్ ప్రామాణ్యమ్ వస్తుతంత్రమ్.

ప్రత్యేకముగ కలిగియుండునట్టిది కాదు ; అది పరిమితత్వమునకు సంబంధించి జగన్నియమముగ నుండుటచే సకలమానవాత్మలు కలిగియుండు సామాన్యగుణము. అది పరివర్తనాశీలమగు ప్రపంచమునకు కారణము ; విశ్వజనీనము. ఏ మానవుడైన మోక్షమును పొందినయెడల, ఆతని దృష్టిలో ప్రపంచము నశించుట లేదు. కాని భ్రమకు బదులు జ్ఞానము ప్రబలును. మృగతృష్ణను గురించిన భ్రాంతి ప్రకృతిశాస్త్రజ్ఞానముచే పటాపంచలు చేయబడి మనల నిక నేమాత్రము ప్రలోభపెట్ట జాలకపోయినను, ఆ భ్రాంతికి మాత్రము వినాశము లేదు. ప్రపంచము శూన్యమని త్రోసివేయబడదు ; కాని దానికి పునర్వ్యాఖ్య చేయబడును.

విషయీవిషయముల నడుమ తర్కము నిరూపించు ద్వంద్వత్వము స్థిరము గాదని శంకరుని విశ్వాసము. అవి యేకత్వమునస్థాపితములు ; పరమాత్మని యంశములు. ఆత్మాన ఏవ ధర్మాః. బ్రహ్మము వినా వానికస్తిత్వమె లేదు. "ప్రపంచమున చేతనాచేతనరూపములయిన తమ లక్షణములతో ననేకసామాన్యవిశేషములుగలవు. ఈసామాన్యవిశేషములన్నియు పరంపరగా నొక మహాసామాన్యమునందు అనగా ప్రజ్ఞానఘనుడైన

బ్రహ్మమునం దిమిడి యంతర్భూతములై యున్నవి.”*
శంకరుడు బ్రహ్మమునకును ప్రపంచమునకును అభేదసం
బంధము కలదని చెప్పలేదు. కాని ప్రపంచము ఈశ్వరు
నినుండి భేదముగ నుండునని మాత్ర మంగీకరింపడు. ♦
టీకాకారుడు చెప్పినట్లు, “ప్రపంచమునకు బ్రహ్మముతో
నైక్యత లేదు; ఆ యాదికారణునితోడి సంబంధమునకు
తా వాసంగని పార్థక్యత మాత్రము లేదు.❡ కార్య
ప్రపంచమునకు యాథార్థ్యత లేదని శంకరుడు చెప్పి
నప్పుడు, “కారణముతో సంబంధము లేని” అని గాని
“బ్రహ్మముతో సంబంధము లేని” అని గాని యట్టి
యర్థమిచ్చు నితరములయిన మాటలు గాని తన
యనంగీకారముతో జేర్చువాడు.” ‡

* అనేకాహి విలక్షణా శ్చేతనాచేతనారూపా స్సామాన్య
విశేషా స్తేషామ్ పారంపర్యగత్యా ఏకస్మిమ్
మహాసామాన్యే అంతర్భావః ప్రజ్ఞానఘనే.
శంకర. బృహదారణ్యకోపనిషత్, ii. 4. 9.

♦ భామతీ: న ఖ ల్వనన్యత్వ మితి అభేదమ్ బ్రూమః
కింతు భేదమ్ వ్యానేధామ.

❡ కారణాత్ పృథక్ సత్తాశూన్యత్వమ్ సాధ్యతే,
న తు ఐక్యాభిప్రాయేణ.

‡ కారణవ్యతిరేకేణ, బ్రహ్మవ్యతిరేకేణ.

అనంతుని గర్భమునుండి సాంత మెట్లుద్భవిల్లెనను మన ప్రశ్నమునకు సమాధానముగ "అది దుర్గ్రాహ్యమగు నిగూఢవిషయము—మాయ" యని శంకరుడు చెప్పుచున్నాడు. నిర్గుణసత్యస్వరూపుడు కలడని మన మెరుగుదుము; భౌతికప్రపంచము కలదని యెరుగుదుము; భౌతికప్రపంచము నిర్గుణబ్రహ్మముపై నాధారపడి యున్నదనియు నెరుగుదుము; కాని యది యెట్లో నిర్వచించుట మన బుద్ధికి మించిన విషయము. సృష్టివాదము సహేతుకముగ లేదు. ఈశ్వరుడు కొంతకాలమేకాకిగ నుండె ననియు, తనకు సాంగత్య మవసరమని యకస్మాత్తుగ తలంపు గలిగి ప్రపంచమును సృజించె ననియు, అది యూహించును. ఆవిర్భావసిద్ధాంత మంతకంటెను తృప్తికరముగ లేదు. ఏలయనగా, సాంత మనంతము నెట్లు వ్యక్తపరుపగలదో గ్రహించుట కష్టము. ఈశ్వరుడు ప్రపంచరూపము దాల్చెనని మనము చెప్పునెడల, ఈశ్వరుడు సంపూర్ణముగనో, లేక యాంశికముగనో యెటుల నట్టి రూపము ధరించె నను ప్రశ్నము పుట్టును. సంపూర్ణముగ నయినయెడల, విశ్వము నతిక్రమించి దేవుడు లేకపోవును; ఆంశికముగనె యయినయెడల, దేవుని విభజించుటకు సాధ్యమని యర్థమగును.

ఈశ్వరునిలో కొంతభాగము ప్రపంచాతీతముగను మరి కొంతభాగము ప్రపంచమునందును సంచజాలము. సగము కోడిని గ్రుడ్లు పెట్టుటకు నిలువయుంచి మిగతసగమును వంటనిమిత్తము తీసిన నెట్లుండునో, అదియు నట్లే యుండును.* ఈశ్వరునికిని ప్రపంచమునకును గల సంబంధము సహేతుకముగ నిర్ణయించుట యసాధ్య మని శంకరుడు నమ్ముచున్నాడు. రెండుకొనలను గట్టిగ పట్టుకొనుడని యాతడు మనల గోరుచున్నాడు. అవి రెండును ఎక్కడ కలియునో కనుగొనుట మనకు సాధ్యము గాకపోయి నను, పాటింప నవసరము లేదు.

జగత్తునకును ఈశ్వరునకును గల నిగూఢసంబంధమును తెలిసికొనుటకు మానవబుద్ధి యశక్త మని ఐరోపాహిందూదేశముల తత్త్వజ్ఞానచరిత్రమె చాటుచున్నది. ఎవ రా సంబంధ మతిగూఢమె యని యంగీకరించి మానవబుద్ధికి సర్వజ్ఞత్వము లేదని సమాధానము చెప్పుకొని తృప్తిపడెదరో వారె మహాతత్త్వజ్ఞులు. ప్రాగ్దేశీయుడగు శంకరుడును, పశ్చిమదేశీయుడగు

* నహి కుక్కుటాదే రేకదేశో భోగాయ పచ్యతే
ఏకదేశస్తు ప్రసవాయ కల్ప్యతే విరోధాత్.
ఆనందగిరి. బ్రహ్మసూత్రముల వ్యాఖ్య. i, 2–8.

బ్రాడ్లే (Bradley) యు యుక్తియుక్తమగు ఈ యజ్ఞేయ వాదమును చేపట్టిరి. భేదములతో గూడిన విశ్వము గలదు. అది స్వతంత్రముగ నుండుట కశక్తము; మరొక దానిపై నాధారపడి యున్నది. ఆ యాశ్రయమె నిర్గుణ బ్రహ్మము. ఆ రెంటిసంబంధము దుర్గ్రాహ్యము. "ఈశ్వరుడు సర్వము సృష్టి యగునట్లు జేసెను; ఓహో! అది యెంతయొ దివ్యముగ నుండెను." అను వాక్యము నందలి యభిప్రాయము ఈ సమస్యను పరిష్కరింపదు. ప్రపంచము "చాల శ్రేష్ఠము"గ నున్నదని యది యంగీకరించును; కాని యీ విషయము మనకు సందేహాస్పదము. ప్రకృతిలోని దుష్టకార్యములకు ఈశ్వరుడు బాధ్యుడని నమ్మజాలక, ఆయన ప్రకృతిని స్వాధీన పరచుకొనుటకు వ్యర్థముగ నెంతయో ప్రయత్నించె ననియు, ప్రకృతియొక్క దుర్జేయస్వభావమువలన ఆయన శక్తి కొంతవరకు నిష్ప్రయోజన మయ్యెననియు, ప్లేటో (Plato) తలచెను. సైతాను నిర్మించిన ప్రపంచమును రక్షించుటకు ఈశ్వరుడు ప్రయత్నించుచున్నాడను నభిప్రాయమును జ్ఞేయవాదులు (Gnostics) చెప్పబూనిరి. దీనినిబట్టి ఆగస్టిన్ (Augustine) "సర్వము దుష్టభూయిష్ఠము" అను సిద్ధాంతమును తన్నివారణ

మార్గమును ప్రతిపాదించెను. సైతానును జన్మింప జేసిన దియు పరమేశ్వరుడె యని నుడివి, జె. ఎస్. మిల్ (J. S. Mill) తలంచునట్లు సందేహాస్పదమయిన యీ ఘనతమూలమున పరమేశ్వరుడు సర్వశక్తుడె యగు చున్నాడని యభిప్రాయపడు కొందరికను గలరు. ఈ ప్రపంచము అనేకవిధముల దోషభూయిష్ఠమై యున్నను, మన మూహింపదగిన సర్వప్రపంచములలో నిదియె శ్రేష్ఠతమమయిన దని లెబ్నిజు (Leibniz) వాదించుచున్నాడు; కాని యీ యభిప్రాయమునందు ఈశ్వరశక్తిని అగౌరవపరచు భావ మిమిడియున్నది. పరిపూర్ణము అపరిపూర్ణముగ పరిణమించుటకు కారణము హెజిల్ (Hegel) యొక్క నిర్గుణత్వవాదము జూప జాలకున్నది. బర్గ్సోన్ (Bergson) ప్రపంచ మందున్న చేతనాచేతనముల సంఘర్షణమును స్పష్టీకరించి యవి రెండును ఒకే యాదిమజ్ఞానముయొక్క భావాత్మకములును అభావాత్మకములు నైన లక్షణము లని విశ్వసించుచున్నానని తెలిపెను; కాని యీ ద్వివిధములయినవి మూలకారణమునుండి యెట్లుద్భవిల్లెనో నిరూపింప జాలకున్నాడు. సృష్టిజాలము భావమాత్రములును క్రియాసహితములు నగు వివిధాత్మీయరూపములై

యను సిద్ధాంతము క్రోసి (Croce) తుదకు ప్రకటించెను. కాని యేకాత్మనుండి యీ రూపము లెట్లు బయల్వెడలునో సహేతుకముగ నాతడు జూపడు. రూపములె సర్వము నయినచో, నిరాకారుడు లేకపోవును; నిరాకారు డుండినను ఆతడు దేనితోడను సంబంధము లేని వాడుగ నుండును.

బుద్ధికుశలతను కనపరచుచున్న యజ్ఞేయవాద మెక్కుడు సమంజసముగ నున్నది. కాని మానవుని తార్కికబుద్ధి యపజయ మొందితినని యంగీకరింప నొల్లదు. నిర్గుణబ్రహ్మము దుర్గ్రాహ్య మనియు, ప్రపంచము ఎటులనో దానిపై నూగులాడుచున్న దనియు నభిప్రాయపడి యది యూరకుండ జాలదు. నిర్గుణబ్రహ్మమును సగుణస్వరూపునిగ నిర్ణయించి ప్రపంచమా పరమపురుషుని వికాస మని చెప్పి యవ్విధమున సంబంధము గూర్చును. మానవబుద్ధియొక్క బలహీనత ననుసరించి శంకరు డీ భాషాలంకారములను వాడుట కంగీకరించెను. ఈశ్వరపరిపూర్ణత్వము ప్రపంచములోనికి పొంగి పొరలుచున్నది. 'మహాకళానిపుణుడగు పరమేశ్వరుని మేరమీరిన శక్తుల బహిర్గతప్రవాహమె ప్రపంచము. లీల, అనగా క్రీడ, సృష్టికళారచనయం దిమిడి

యున్న సమంజసత్వమును స్వాతంత్ర్యమును ఆనందకర మగు సహజశక్తిప్రకర్షమును వ్యక్తపరచును. ఈశ్వరుడు పురుషస్వరూపుడగు ప్రభువని యెంచి యాయనకు స్వయముగ ప్రకాశించి ప్రబోధించు శక్తి కలదని భావింతుము. వికాసవిహీనమగు పరిపూర్ణత యచింత్యము. స్వయంప్రకాశమునకు కారణభూతమైన శక్తి కూడ మాయ యని పిలువబడును. దేనితో విషయిక క్రియాపూర్వకమగు సంబంధము గలిగి తద్వారమున తనను వ్యక్తపరచుకొనునో యా విషయములు కలిగియుండు శక్తికిని ఆ పదము వాడబడును. కాని యీ ప్రయత్నములు ఈశ్వరునకును ప్రపంచమునకును గల సంబంధ మెట్టిదో గ్రహించుటకు మానవు లవలంబించు వివిధములైన పన్నుగడలె.

అది యెట్లున్నను, జీవన మొక స్వప్న మనియు, అనుభూతసంఘటన లన్నియు భ్రమలనియు, ఏ సిద్ధాంతమును చెప్పియుండ లేదు. శంకరుని తరువాత వచ్చిన యొకరిద్ద రనుచరు లీ సిద్ధాంతము నామోదించిరి; కాని యది హిందూతత్త్వజ్ఞుల సాధారణాభిప్రాయ మని తలంపజనదు.

తరువాతి యాక్షేపణము తద్వ్యతిరేకమగు

మరొక కొనకు బోవుచున్నది. ప్రపంచము బ్రహ్మమయమగుటచే నైతికనియమములు హిందువునకు అర్థశూన్యములు. ప్రతిజీవియు దైవమే. కన్నపు దొంగయు అప్రమాణములు చేయువాడును సలిపెడు మహాపవిత్రకార్యములను మన మడ్డుపెట్టుటకు నిమిత్తము లేదు! పికడెల్లిసర్కసు దైవమా, హైడ్‌పార్కు దైవమా యని మిమర్శకు డాశ్చర్యముతో ప్రశ్నించి యన్ని విధములయిన హైందవజ్ఞానముతో సంబంధించియున్న యీశ్వరసర్వాంతర్యామిత్వ సిద్ధాంతమును ఖండించుచున్నా నని విశ్వసించుచున్నాడు. ప్రపంచమునకు బాహ్యుడై సంపూర్ణముగ దూరస్థుడుగను అతీతుడుగను ఈశ్వరు డుండునని చెప్పు నిరుత్సాహకరమగు శుష్క ఆస్తిక్యభావము రూపుమాపుటకు హిందూ ధర్మము ధ్వజమెత్తును. ప్రపంచములోని భౌతికనియమము ఈశ్వరమహోద్దేశము నెరవేర్చు కార్యసాధనము మాత్రమె. సృష్టియందలి నియమానువర్తనము, క్రమపద్ధతి, పరిణామవిధానము—ఇవి యాత్మశూన్యమైన యంత్రముయొక్క జ్ఞానరహితసంచలనమును గాక, సర్వజ్ఞుడగు పరమాత్ముని జ్ఞానయుక్తపరిపాలనమును వెల్లడించును. విశ్వమందు ఈశ్వరుడు సర్వాంతర్యామి

మైయున్నా డనుటచే, ఈశ్వరుడు విశ్వముతో అభేద సంబంధము కలిగియున్నా డని చెప్పుట గాదు. అభేద సంబంధ మనగా ఈశ్వరుడు సంపూర్ణముగ జగత్తునం దిమిడి యుండుటయె. ఏ వస్తువునందైన ఈశ్వరదర్శనము పొందదలచిన, మనము కన్నులు తెరచిన చాలును. ప్రపంచవస్తుసముదాయమున కావల ఈశ్వరు డేమియు మిగిలియుండక పూర్తిగ మనయెదుటనె పరివ్యాప్తుడై యుండును. ప్రపంచము ఈశ్వరావిర్భావము మాత్రమె గాక యాయన సంపూర్ణముగ రూపము దాల్చిన మూర్తి. పరమాత్ముడు సర్వాతీతు డని స్పష్టముగ చూపుచు పైవాదమును ఖండించుటకు హిందూతత్త్వజ్ఞు లేమరియుండరు. "ఆయన ప్రపంచమున కాధారుడు గాని దానియం దెంతమాత్ర మంతము నొందడు."* ప్రపంచము ఈశ్వరునియం దున్నది గాని యీశ్వరుడు ప్రపంచమందు లేడు. జగత్తునందు వ్యక్తులకు ప్రత్యేక జీవనము కలదు. ఈశ్వరజ్ఞానకణములు వ్యక్తులందు కొలదిగ గాని హెచ్చుగ గాని యెట్లు ప్రకాశించినను, అవి దేనినుండి యుద్భవిల్లునో యా కేంద్రజ్వాలనుండి భిన్నములై యుండును.

* భూతభృన్న చ భూతస్థః

ఈశ్వరసర్వాంతర్యామిత్వము పరిణామభేదములకు తావొసంగుచు వాస్తవవిషయమై యున్నదని హిందూతత్త్వజ్ఞులు అంగీకరింతురు. జగత్తున ఈశ్వర ప్రజ్వలితముగాని దేద్దియు లేకపోయినను, జడమునందు కంటె జీవియందును, బుద్ధిశూన్యమగు జీవియందుకంటె బుద్ధిసహితమగు జీవియందును, క్షుద్రజీవియందుకంటె మానవునియందును, దుష్టునియందుకంటె శిష్టునియందును, ఈశ్వరు డధికతరముగ నవతరించుచున్నాడు. కాని ప్రపంచములోని యధమాధములు నయినను ఈశ్వరదూరులై నరకాగ్నియందు ద్రోయబడుటకు మాత్రమె తగియుందు రని తృణీకరింప దగదు. హిందూ ధర్మము ఈశ్వరసర్వాంతర్యామిత్వమునందు విశ్వాసము గలిగి మనము ఈశ్వరసాన్నిధ్యమునుండి తప్పించుకొనుట యసాధ్య మని ప్రకటించుచున్నను, మన యెదుట నున్న ప్రతివస్తువు దైవమని చెప్పదు. పిక డెల్లి నయితము ఈశ్వరు డిచ్ఛగించిననె గాని నెలకొని యుండుటకు సాధ్యము గాదు ; కాని యది దైవము గాదు. నీచ మానవులయందు నయితము ఈశ్వరాంశబీజములు గలవు ; ఘోరపాపుల యుద్ధరణమునకై యీశ్వరుడు సదా ప్రేమహస్తములను చాచి యుంచును. నిజముగ

నెవరివిషయమునను నిరాశజెంద నక్కరలేదు. గతకాల మున ప్రతిపుణ్యాత్మునకు పాపకళంకితమగు నీచజీవన మున్నట్లే, భావికాలమున ప్రతిపాపాత్మునకును పరిశుద్ధ మగు పుణ్యజీవనము గలదు. తా నూహించుకొను నంతగ నెవరును శిష్టుడు గాని దుష్టుడు గాని కాడు. దుష్టవర్తనులయందు, పాపాత్ములయందు గల యీశ్వ రాంశబీజములను మొలకెత్తించుటకై ప్రపంచమహాపురు షులు గడంగుదురు.

సర్వనైతికాభివృద్ధులకు మూలాధారమని సాధా రణముగ తలంపబడు మానవస్వాతంత్ర్యమె లేదని కర్మ సిద్ధాంతము చెప్పునని కొందరు వాదింతురు. కాని సరిగా పరిశీలించినయెడల, కర్మశాసనము యథార్థ స్వాతంత్ర్యమునకు విరుద్ధము గాదు. అది యింద్రజాలము నందు—అనగా, ఇష్టము వచ్చినట్లు ప్రపంచరీతిని త్రిప్ప గల శక్తియందు—మన కున్న విశ్వాసమును తొలగ జేయు ప్రాకృతికనియమమె. సృష్టియందు దాగి, రాగ ద్వేషములతో పనిచేయు జీవాత్మల చేష్టలద్వారమున గాక, మార్పునొందని శాసనములు నిర్వహించు కార్య ములచే, సృష్టిపరిణామము నిష్పన్న మగును. సూర్యుడు పగటియందు, చంద్రుడు రాత్రియందు, ఆకాశమున ప్రయా

ణములు క్రమముగ చేయుచుండినయెడల, నిశ్శబ్దముగ ఋతుపరంపర భూమిమీద దివారాత్రములందు సదా నడచుచుండినయెడల, అందులకు కారణము ఘనతరమైన యొక మహాశక్తి వానినెల్ల నియమితపథములందు నడపుటయె. "ఓ గార్గి, నిశ్చయముగా ఆ యవ్యయుని యాదేశము ననుసరించి సూర్యచంద్రమండలములు వేర్వేరుగ నున్నవి; భూమ్యాకాశములు వేర్వేరుగ నున్నవి; నిమిషములు, గంటలు, దివారాత్రములు, పక్షములు, మాసములు, ఋతువులు, సంవత్సరములు వేర్వేరుగ నున్నవి. ఓ గార్గి, నిశ్చయముగా ఆ యవ్యయుని యాజ్ఞానుసారము, హిమాలయపర్వతములనుండి కొన్ని నదులు తూర్పునకును కొన్ని నదులు పశ్చిమమునకును తమతమ గతులయందు ప్రవహించుచున్నవి."* సర్వత్ర విధివశమయిన వర్తనమె కాన్పించును. విశ్వము సంపూర్ణముగ శాసనబద్ధము.

కర్మ సిద్ధాంతము, శాసనపూర్వక పరిపాలనము బాహ్యజగత్తునందు మాత్రమె గాక, మానసికనైతిక జగత్తునందు కూడ నున్నదని చెప్పెను. ప్రకృతియందును మానవసంఘమునందును సమానముగ "ఋత" ప్రకా

* బృహదారణ్యకోపనిషత్, iii. 8. 9.

శించుచున్నాడు. ప్రతిక్షణము మన శీలముల నిర్మించుకొనుచున్నాము; మన విధాయకకృత్యములను నెరవేర్చుకొనుచున్నాము. "మన ముపక్రమించు నే యుద్యమము వ్యర్థము కాదు, అనగా దాని సాఫల్యమునకు నెట్టియాటంకమును లేదు. మనము చేయ తలపెట్టించిన కొద్దిమేలు సయితము మహాప్రతిఘటనలనుండి మనల రక్షించును."* మన హృదయములు వేనియందు లగ్నము చేయుదుమో యవి శరీరముతో నశింపవు. ఈ సత్యము మనకు శాశ్వతజీవనము కలదని ప్రస్తుతమె స్ఫురింపజేసి మన జీవితముల నుత్సాహపరచును.

సర్వమునకును ఈశ్వరేచ్ఛయె కారణమని మనస్సును సమాధానపరచుకొనుచు, ఈశ్వరాజ్ఞానుసారము పైశాచిక దుష్కృత్యములను జనులు గావించుచుండిన కాలమున, కర్మసిద్ధాంతము పొడసూపి నీతియొక్క ప్రాధాన్యతను నిరూపించి యీశ్వరుడు శాసనకర్త యని కనపరచెను. సమస్తము శాసనబద్ధమె; కాని సమస్తము దైవాధీనము. కర్మశాసనము యంత్రప్రాయమగు నియమము గాదు; ఆత్మగతమై మనల పురిగొల్పు ప్రవృత్తి. ఈశ్వరుని యిచ్ఛాసంకల్పములు దానియందు మిళితమై

* భగవద్గీత, iii. 40.

యున్నవి. ఈశ్వరుడు దాని యధిపతి—కర్మాధ్యక్షుడు.* న్యాయము ఈశ్వరుని గుణము; ఈశ్వరుని న్యాయ స్వభావము "కించిన్మాత్రము గూడ మార్పు నొందనిది." అని బైబిలు ప్రకటించెను. అగోచరమైనను, విశ్వవ్యాప్తముగ నున్న న్యాయమునుబట్టి ప్రతికార్యము, ప్రతిచింతనము వన్నెగట్టబడును. తీర్పు చెప్పుట ముందెప్పుడో దీర్ఘకాలమున గాక యిప్పుడే, యిక్కడనే. ఎవరు దానిని తప్పించుకొన జాలరు. ఈశ్వరశాసనములు దుర్లంఘనీయములు. అవి బాహ్యమునుండి విధింపబడుననుటకంటె మన స్వభావములయందె కూర్పబడిన వనియు, పాపము ఈశ్వరధిక్కార మని, శాసనోల్లంఘన మని యనుటకంటె ఆత్మతిరస్కార మని, ఆత్మద్రోహ మని యనుటయె సమంజసము. మన గతజీవిత యావత్ఫలమును మనతో మనము తీసికొని పోవుచుందుము. దానిని తొలగించుటకు మనకు సాధ్యము గాదు. అది కాల వశమున మాపు జెందునది కాదు; మరణముతో నశించునదియు కాదు.

ఈ కర్మవిధానమందు పశ్చాత్తాపమునకును, తత్ఫలితమగు క్షమాపణమునకును చోటు కలదు. కర్మ

* శ్వేతాశ్వతరోపనిషత్, Vi. 11.

మండలి విశ్వాసము ధర్మజీవనమును, ప్రార్థనను, ఉపాసనను అసాధ్యములు చేయునని వాదించు విమర్శకునకు కర్మమునుగురించి సరియయిన యభిప్రాయమె లేదు. ఈశ్వరుడు శాసనమునకు పట్టముగట్టి తన పదవినుండి తొలగెనని యాతని యూహ. తుపానును మనకు దార్ఢ్యత నొసంగు మని గాని, భూకంపమును మన పాపముల క్షమింపు మని గాని కోరుట యెంత నిష్ప్రయోజనమగు మూఢకృత్యమో, యీశ్వరుని ప్రార్థించుటయు అట్టిదియె. ప్రార్థన మనకు కావలసిన సర్వమును సమకూర్చు అలాద్దీనుని దీపమువంటి దని హిందువు పరిగణింప డనుట వాస్తవము. సూర్యమండలమును దాని మార్గమధ్యమున నిలుపునట్టియు, తుపాకిగుండును దాని త్రోవనడుమ నడ్డగించునట్టియు నైంద్రజాలికుడు గాడు, పరమేశ్వరుడు. కాని యాయనయొక్క చిరనూతనత్వమును నిత్యత్వమును, ప్రేమయు న్యాయమును, అమోఘమగు నైతికశాసనముయొక్క పాలనావిధానమందు పొందుపరుపబడి యున్నవి. నైతికశాసనము అనతిక్రమణీయ మని మనము దృఢముగ నుడువవచ్చును; కాని పాపములు క్షమింపబడు ననియు మనము నమ్మవచ్చును. ఆధ్యాత్మికమగు జీవనమును, తద్వృద్ధియు సమస్తవిశ్వ

మెట్టి శాసనములచే పరిపాలింపబడుచున్నదో యట్టి శాసనములచేతనె నడుపబడుచున్నది. మనము శరీరమునకు అపచారము చేసినయెడల, శరీరవ్యాధులచే భ్రష్టత్వము జెందుదుము. శరీర మపవిత్రము చేసికొనినందులకు శిక్షయె బుద్ధిక్షయము, ఆత్మమాలిన్యము. నైతిక ఆధ్యాత్మిక ధర్మజ్యోతిని చూడక కన్నులు మూసికొని మనము బుద్ధిపూర్వకముగ పాపమునందు పడినయెడల, ఈశ్వరనిర్మాణమగు జగత్తునందు పాపఫలితము మనకు తప్పక లభించుటయు, స్వయముగ తెచ్చిపెట్టుకొన్న యంధత్వము మనల నధోగతి నొందించుటయు, నిశ్చయము. మనుష్యుడు కష్టపడి సంపాదించుకొను దానిని ఈశ్వరు డాతని కిచ్చుటకు నిరాకరింపడు. ఒకడు చేసిన పాపపరిహారార్థము అతనికి బదులు మరియొకడు బాధ ననుభవించుటవలన పాపము తొలగనేరదు.* ఒకడు చేసిన నేరము అతనినుండి మరొకనికి మార్చుటకు వీలు లేదు. ఆత్మసంయమమువలన లభించు పరితాపముతో పాపమునకు ప్రాయశ్చిత్తము జరుగవలయును. లంచమిచ్చి యీశ్వరుని వశపరచుకొనుటకు వలనుపడదు;

* మునిర్మనుతే, మూర్ఖో ముచ్యతే. ముని ధ్యానము చేయును; మూర్ఖుడు ముక్తిని జెందును.

పాపమునకు మెరుగుపెట్టుట సాధ్యము గాదు.

ప్రతిమానవుడు ఏ శక్తిసామర్థ్యములతో, ఏ పరిస్థితులందు జన్మించునో యీ యంశమును కర్మశాసనము లెక్కగొనును. గతజీవితము నిర్ణీతరూపము దాల్చె నని యది భావించినను, భావిజీవనము కొన్ని పరిమితులకు మాత్రము లోబడియున్న దని చెప్పును. తన శక్తిసామర్థ్యముల మేరలో మనుష్యునకు తన యాధ్యాత్మికస్వభావముద్వారమున స్వాతంత్ర్యము లభించును. మానవుడు కేవలము కొన్ని యంధప్రాయములగు శక్తులతో కూడిన యంత్రమును పోలియుండడు. తమంతట తామె పనిచేయు నట్టివియై వానిని బానిసనుగా చేయు శక్తులను వాని యాత్మ జయింపగలదు. ఆత్మను ఆత్మచేత నుద్ధరింప వలయునని భగవద్గీత మనకు బోధించును. మనకు ప్రసాదింపబడిన శక్తిసామర్థ్యములను మన జన్మసాఫల్యమునకై మన ముపయోగింపగలము. జీవితము పేకాట వంటిది. మన పేకముక్కలు మన కీయబడును. మనము వానిని ఏరికొనుట లేదు. అవి మన సంచితకర్మమునకు సంబంధించినవి; కాని మన యిష్టము వచ్చినట్లు వానిని ఆటలో నుపయోగింపవచ్చును; మన యిష్టప్రకారము ఆటను నడుపవచ్చును; జయమో అపజయమో

పొందవచ్చును. మనకు స్వాతంత్ర్యము కలదు.

స్వచ్ఛందవృత్తికి అవకాశము లేకున్నను, మనుష్యుడు భావికాలమున నెట్లు జీవించునో తెలుపుచు భవిష్యత్తు చెప్పుటకు వీలులేదు. అభ్యాసవశములయి యున్నంతవరకు, అనగా తమంతట తాము జరుగునవియై విచక్షణకు లోనగాకున్నంతవరకు, మానవుని భావికార్యములను మనము ముందుగా తెలిసికొనవచ్చును. కాని విచక్షణచేయుట యన స్వచ్ఛందవృత్తి కాదు. కారణము లేక, దేనితో సంబంధించక, నిరూపణమునకు జోటియ్యక, మానవుని జీవితమునందు పనిచేయు నొక శక్తియె స్వతంత్రేచ్ఛ యయినచో, అది యంగీకృతము గాదు. అట్టి యిచ్ఛ పరిశీలించుట కసాధ్యము. సాధారణమగు కారణకార్యపరంపరతో దాని కెట్టి సంబంధము లేదు. వక్రమముగను క్రమవిరుద్ధముగను అది పని చేయును. అటువంటి యిచ్ఛచే మానవకార్యములు నిర్ణయింపబడవలసివచ్చినచో, శిక్ష నొసంగుట గాని, శీలమభ్యసింపజేయుట గాని నిరర్థకము. మనుష్యుడు శక్తిసామర్థ్యములను తన బుద్ధికౌశలమున కనుగుణముగ నుపయోగించుటకు కర్మశాసనము వానికి స్వాతంత్ర్యమొసంగును. ప్రకృతియందలి సక్రమశక్తులను, స్వభా

ద్ధిని, సంఘమును మనుష్యుడు వశపరచుకొనును. ఈ విధముగా అకృత్రిమమును న్యాయము నగు స్వాతంత్ర్యమునకు అవకాశము గలదు. స్వయంనిర్ణయరాహిత్యము, విధివశత్వము—ఇవి రెండు యావజ్జీవితమునకు నొక నిర్ణీతస్థిరగతి కలదను కృత్రిమవిశ్వాసము మనకు కలుగ జేయును.

విశ్వమునందలి ప్రతిస్వల్పకార్యము ముందుగా నిర్ణీతము కాలేదు. పూర్వము నిశ్చయింపబడిన కార్యక్రమ మేదో యిప్పు డనుసరణములోనికి దెచ్చుట మాత్రమె కాదు, మనము గావించునది. భావికాలమున నేమి జరుగునో యీశ్వరునకు సంపూర్ణముగ తెలియ నేరదు. ఏలయన, మన మందరము ఆయనతో కలసి పాటుపడువారము. ఈశ్వరుడు మనకు వెలుపల నెచ్చటనో యుండడు. ఆయన మనలోపల కూడ నున్నాడు. మనలోని యీశ్వరశక్తి సరిగ వినియోగమునకు వచ్చినచో, తన్మూలమున ఆకస్మికపరివర్తనము సయితము కలుగును. క్రమాగతముగ గాక హఠాత్తుగ కొన్ని జంతువులు పొందు పరిణామము మానవునియందును అసాధ్యము గాదు. ఏలయన, సత్యము క్రియాశీలమయి దినదినప్రవర్ధమానమగు జీవనము; యంత్రము తిరిగి

తిరిగి చేయునోకే కార్యక్రమణికవంటిది కాదు.

మార్పు జెందుటకు కాలము మించిపోవుట యనునది లేక యెప్పటికిని అవకాశము కలదని చెప్పి కర్మశాసనము పాపిని ప్రోత్సహించును. నిరాశకు, ప్రలోభనమునకు, నేరమునకు,ఆపదకు లోనైన జనులకు అది యాశాకవాటములను మూయుట లేదు. మానవులు తరచుగ దుర్మార్గులై యుండక శక్తివిహీనులై యుందురు. కావున పాపులను కారుణ్యదృష్టితో జూచుటకు అది మనల పురిగొల్పును. మానవహృదయము బాగు పడునను నాశకే యవకాశము లేనంతగా దుష్టమయి యుండనేరదు. మంచిని విడిచి చెడుగును, కష్టసాధ్యమగు స్వర్గారోహణమును విడిచి సులభసాధ్యమగు నరకావరోహణమును, మానవుడు పరిగ్రహింపడు.

మనుష్యుడు అశక్తుడై తనకు సాధ్యమైనది కూడ చేయుటకు అనిష్టుడై యున్నప్పుడు, దురదృష్టవశమున హిందూ దేశమునందు కర్మసిద్ధాంతమునకును, విధివశత్వవాదమునకును భేదము లేకుండ జేయబడెను. సోమరి తనమునకును పిరికితనమునకును కర్మసిద్ధాంత మొక సాకుగ జేయబడెను; ఆశను గాక నిరాశను బుట్టించు సందేశముగ మార్పబడెను. అది యిట్లు పాపికి చెప్పెను:

"నీవు భ్రష్టుడవు; అంతియ కాదు, నీ వెప్పటికైన గూడ పొందగల స్థితి యంతయు నదె. జననమునుండియు ముందుగా నీకు విధింపబడిన జీవితమె యది." అట్టి నిరాశాజనితమగు తత్త్వజ్ఞానము కర్మసిద్ధాంతమునుండి యుద్భవింపనేర దని తెలుపుటకు వలసినంత చెప్పి యున్నాను.

హిందూధర్మములోని యనుష్ఠానభాగమునకు మన మిప్పుడు మరలుదము. హిందూధర్మ మొక విధమగు జ్ఞానకాండ మనుటకంటె జీవనవిధానక్రమ మనుట యెక్కుడు సమంజసము. మానవునకు జ్ఞానప్రపంచమున నది సంపూర్ణస్వాతంత్ర్య మొసంగుచున్నను, అనుష్ఠాన నియమావళిని అవశ్యాచరణీయముగ విధించును. ఆస్తికుడు, నాస్తికుడు, సందేహవాది, అజ్ఞేయవాది, ఎల్లరు హిందూధార్మికజీవనవిధానము నంగీకరించునెడల, హిందువులుగ నుండవచ్చును. సమానబాహ్యాచారవ్యవహారములు కలిగి యుండవలె నని గాక జీవనవిషయమున ఆధ్యాత్మికనైతికదృష్టిని కలిగి యుండవలయు నని హిందూధర్మము విధించును. "ఏదోయొక యభిప్రాయమును విశ్వసించు వాడు గాక లోకశ్రేయమునకై పాటుపడు వా డెన్నటికిని దుర్గతిపాలు కానేరడు." నహి

కల్యాణకృత్ కశ్చిత్ దుర్గతిమ్ తత గచ్ఛతి.* యథార్థముగ, ఆచరణముతరువాతనే విశ్వాసము కుదురును. తన యిచ్ఛను నెరవేర్చుకొనుటద్వారముననె యొకడొక సిద్ధాంతమును గ్రహించును. మన మతవిశ్వాసములు, దార్శనికభావములు ఏవియైయున్నను, మనము దయాశీలురమును, న్యాయవంతులమును, మన కుపకారముచేయు వారియెడ కృతజ్ఞులమును, దురదృష్టవంతులయెడ కనికరస్వభావులము నయి యుండవలె నను విషయములో మన మందర మేకీభవింతుము. హిందూధర్మము నైతికజీవనము కలిగియుండవలె నని విధించును; నైతికశాసనము, అనగా ధర్మము, తమకు విధించు సత్కార్యనిర్వహణమునకు తమయంతట తామె బద్ధులగు నట్టి వారెల్లరను పరస్పరసాంగత్యములోనికి దెచ్చును. హిందూధర్మము ప్రత్యేకాచారములు గల యొక సంఘమును గాక ధర్మశాసనము నంగీకరించి యాతురతతో సత్యము నన్వేషించు జనులెల్లరను జేర్చు నట్టి యొక భ్రాతృమండలిని స్థాపించెను.

ధర్మ మనగా ఋజువర్తనము. ఋగ్వేదమునందలి "ఋత" అను పదము ప్రపంచ క్రమవిధానమును

* భగవద్గీత.

తెలుపును. దానియందు, జీవుల పరమార్థము అనగా సత్యము, పరిణామశాసనము అనగా ధర్మము—ఈ రెండు భావము లిమిడి యున్నవి. ధర్మము అను పదము ధర్ (అనగా పట్టుకొనుట) అను వ్యుత్పత్తినుండి నిష్పన్నమైనది. జీవికి నాశ్రయమిచ్చి దాని స్థితిలో దానిని పోషించునది యనియె ధర్మమునకు అర్థము. ప్రతిజీవికి గాని ప్రతి మానవసంఘమునకు గాని దాని ధర్మము కలదు. అదియె దాని జీవనము నడపు శాసనము. ప్రపంచమందలి సత్యముతో ఆనుకూల్యత జెందుట ధర్మము, అనగా పుణ్యము. తద్విరుద్ధమయినది యధర్మము, అనగా పాపము. ప్రపంచము నావరించి పరిపాలించు సత్యముతో సామరస్యము నొందకుండుటయె దుర్నీతి.

కాంక్షలు మానవకృషికి కారణభూతములు. మానవజీవితము కొన్ని ముఖ్యవాంఛలపై నాధారపడి యున్నది. దానిలో నొక్కొక్కటియు దాని యాశయమునుబట్టి మరొక దానినుండి భేదించును. ఆ యాశయమును తృప్తిపరచుటకయి యొక విధమైన కృషికి మనుష్యులను ప్రేరేపించును. ఈ వివిధకాంక్షలు పరస్పరము స్వాతంత్రములయి యొకదానితో నొకటి కలియక,

అనగా నొకదాని నొకటి మార్పునొందింపక యున్నచో, వాని భిన్నచర్యలు ప్రత్యేకము లయి యన్యోన్యసంబంధ శూన్యము లగును. కుటుంబజీవనమునకు ఆర్థికోద్యమ ములతో నెట్టి జోక్యము నుండదు. పారిశ్రామికోద్యమ ములద్వారమున నేర్పడు సంబంధములు నీతిశోభితము లుగ నుండవు. ధర్మసాధనలు లౌకిక వ్యాపారములయెడ నుదాసీనములుగ నుండును. కాని మనుష్యుడు సంపూర్ణ వ్యక్తి కావున వాని సర్వాకృషులను సమన్వయపరచు నొక యైక్యత కలదు. ప్రతివ్యక్తికిని తనయందు దార పుత్రాది వాంఛలు, ధనాధికారకాంక్షలు, లోక శ్రేయోభిలాష, ఈశ్వర ధ్యాననిరతి కలవు. ఈ భిన్న ములయిన యనురాగములు పరస్పరసంబంధము గలిగి యొకదాని నొకటి మార్పు నొందించును. అవి మానవ జీవితమునందు పరస్పరము ఆధారపడి తమ చర్యలను గావించును. జీవనము ఒకటే కావున, ఒకటే మహాజీవన తత్త్వశాస్త్రము కలదు. అందు ధర్మము అనగా ఋజు వర్తనము, అర్థము అనగా ధనము, కామము అనగా సుందరమగు శుభజీవనము, మోక్షము అనగా ఆధ్యా త్మికస్వాతంత్ర్యము—అను నాలుగు పురుషార్థములకును స్థానము కలదు. హిందువుల ధర్మ స్మృతి కాంక్షలతో

గూడిన ప్రస్తుతజీవనమునకును, భావిశాశ్వతజీవనమునకును సంబంధము కూర్చును; భూలోకమును, స్వర్గలోకమును ఏకముగ బంధించును.

విషయవాంఛలతోను సాంఘికాశయములతోను కూడియున్న శారీరకజీవనమునకును, ధర్మసాధనలతోను మోక్షేచ్ఛతోను కూడియున్న ఆధ్యాత్మికజీవనమునకును, ఎట్టి శాశ్వతవైరుధ్యము కలదని హిందూధర్మము విశ్వసింపదు. జగదాశ్రయునినుండి విడివడిన ప్రాపంచికజీవనమును మాత్రము అది నిషేధించును. ప్రపంచము మీదను ప్రాపంచికవిషయముల మీదను ఏకాగ్రదృష్టి నిలుపునటువంటి లౌకికజీవనము మానవునకు తృప్తిని గొలుపదు. ఏలయనగా, ఎట్టి ప్రపంచైశ్వర్యమయినను శూన్యమై వినాశ మొందును. మనము నమ్ముకొనియుండు ప్రపంచసంపదలు వానిని కలిగియున్నామని గర్వించు క్షణముననే, యవి మనల విడనాడును. ప్రపంచమునకు నిత్యస్వరూపునితో గల సంబంధము ఛేదింపబడినయెడల, అది యెటుల వినాశము నొంది సంతాపకరముగ నిష్ప్రయోజన మగునో హిందూతత్త్వజ్ఞులు విశదీకరింతురు.

సకల ప్రాపంచిక బాంధవ్యములకు అంత్యము

కలదు ; కాని యవి విస్మరింప దగవు. అవి కాన్పించక పోయినంతకారణముననే యవి లేనట్లు చరించుట వినాశమును గొనితెచ్చుకొనుటయె. నిత్యము అనిత్యమునందు వ్యక్త మగుచున్నది. అనిత్యముద్వారమున నిత్యము పొందబడును. సాంతరూపమున నున్న సత్యము అనంత సత్యమునకు దీసికొని పోవును. సాంతమును సాంతమని గ్రహించి దానినుండి తొలగుటయు, సాంతమును అనంతముయొక్క స్వరూప మని గ్రహించి దానితో చేరి యుండుటయు వైరాగ్యము. అవి రెండును పరస్పరసంబద్ధములు, వానిని వేరుచేయుట వినాశహేతువు. ఉపనిషత్తు ఇట్లు చెప్పుచున్నది: “ప్రపంచమును మాత్రమె యారాధించువారు అంధకారమున నుందురు. కాని యనంతమును మాత్రమె యారాధించువారు అంతకంటె నెక్కువ యంధకారమున నుందురు. రెంటిని యంగీకరించువారు, ప్రపంచమును గురించిన జ్ఞానమువలన మరణమునుండి రక్షించుకొని, యనంతమునుగూర్చిన జ్ఞానమువలన యమృతత్వమును జెందుదురు.”

అర్థము మానవుని యార్థికరాజకీయజీవనమును, ధనాధికారతృష్ణను లెక్కగొనును. ఒక వస్తువును పొంది సొంతము జేసికొనుటకు మానవుని ప్రేరేపించు వాంఛ

మానవస్వభావమునకు ఆశ్రయభూతముగ నున్నది. మానవహృదయతత్త్వమును మార్చిన నెగాని యందున్న తనది యను తలంపును మనము నిర్మూలింపజాలము. ఏలయన, బహుజనులు స్వకీయవిషయములద్వారముననె యాత్మవికాసమును పరులతోడి సంబంధబాంధవ్యము లను బడయుదురు.

సుఖసంపదలను బడయు ప్రయత్నము న్యాయమైన మానవకాంక్షనుండి జనించినది యయి, అవి తుదకు మానవుని యాత్మస్వాతంత్ర్యమునకు అనగా మోక్షమునకు జేర్పవలసినచో, అవి ధర్మమార్గములద్వారమున సంపాదింపబడవలెను గదా ! ఈ లక్ష్యములలో నొక్కొక్క దానికొరకు నైతికశిక్షణము అవసరము. సాధనశృంఖలముల మూలముననను, స్వార్థపరిత్యాగము వలనను మాత్రమె స్వాతంత్ర్యము బడయనగును. స్వాతంత్ర్యమును ఆత్మయందు దర్శించి దానిని సంపాదించుటకై మనలను మనము హద్దులలో పెట్టుకొని మన యిచ్ఛను కొన్ని మార్గములయందే చరింపనీయవలెను. రాజకీయ స్వాతంత్ర్యము గల దేశములలోని జనులు అభిప్రాయము నందును ఆచరణమునందును చాలవరకు బంధింపబడి యుందురు. అభిప్రాయములయందు, ఆచరణములయందు

స్వాతంత్ర్యము విశేషముగ తగ్గిననే గాని రాజకీయ స్వాతంత్ర్యము చేకూరదు. ఆధ్యాత్మిక స్వాతంత్ర్యము నిమిత్తము, హిందూసంఘము దైనికజీవనమందలి యత్తి స్వల్పవిషయములను సయితము శాసించినది. ఆ శాసనములె ధార్మికనియమములు. ఈ నియమములు దేశమందలి యన్ని ప్రాంతములలోను చరిత్రయందలి యన్ని యుగములలోను, ఒక విధముగ లేవు. సింధునదిమొదలు కన్యాకుమారివరకు నాగరికత వ్యాపించుచు రాగా, హిందూస్మృతికర్తలు దేశస్థుల యద్భుత వివిధాచారములను స్వీకరించిరి. ధర్మస్మృతులలో వానికన్నిటికిని స్థానమిచ్చిరి. కాని నీతిసందర్భమున నాక్షేపణీయములుగ గన్పట్టు వానినెల్ల పరిష్కృతములు చేయుటకు వారు యత్నించిరి.* వాని నన్నిటిని యంగీకరించి యొక యాదర్శప్రాయమైన వర్తనమును వారు విధించిరి. తన్మూలమున నాచారములు కానరాకుండ సంస్కారము నొందెను. ఒక యువకుడు తన సందిగ్ధావస్థలయందు "వివేచనాశక్తి, సమయస్ఫూర్తి, దయార్ద్రహృదయము గలిగినట్టి ధర్మాభిలాషులగు" బ్రాహ్మణులు ఆ పరిస్థితులం దెట్లు నడచుకొనిరో యా వర్తనమును ప్రమా

* బౌధాయన, బృహస్పతి, దేవల, గౌతమ, చూడుడు.

ణాముగ గైకొనవలయు నని కోరబడినట్లు తైత్తిరీయో పనిషత్తునందు చెప్పబడినది. సాత్వికపురుషులయొక్కయు ద్విజాతులలోని ధర్మాత్ములయొక్కయు నడవడి సకల దేశములకు, వంశములకు, వర్ణములకు జెందిన యాచారములతో జతపడునని మనువు వాదించుచున్నాడు.

మోక్షమనగా నాత్మోపలబ్ధి. మనుష్యుడు ఆహారముచేతనే గాని, వృత్తి, ధనము, వాంఛ, అధికారము, వీనివలననే గాని—బాహ్యప్రకృతితోడి సంబంధముల మూలముననే గాని జీవింపడని హిందూధర్మము చెప్పుచున్నది. ఆత్మోపార్జనమె వాని యాథార్థజీవనము. దానినే వాడు జీవింపవలెను. ఆత్మపరిత్రాణమె, మానవుడు అనంతుని ప్రేమయందు పరిపూర్ణత గాంచుటయు, మోక్షము. తుదకు సంతృప్తి గొల్పునది యిదియె. సకలేతరోద్యమము లీ యుద్దేశ్యసాఫల్యమునకు తోడ్పడులాగున నడుపబడును.

స్వాతంత్ర్యసంపాదనమార్గములను గురించి హిందూతత్వజ్ఞులు మిక్కిలి యుదారహృదయులై యున్నారు. "తమ వెనుక నెట్టి జాడలు విడువక విహంగములు వాయువున విహరించునట్లును, మత్స్యములు

సముద్రమున నీదునట్లును జ్ఞానుల మార్గ ముండును.*

అట్టి వివిధమార్గములు జ్ఞాన, భక్తి, కర్మ లను మూడు గొప్ప తెరగులుగ విభజింపబడినవి. ఆ మూటిలో నొక్కొక్కటి మిగత రెంటితో చేరక యుండదు; కాని మార్గముయొక్క ప్రధానలక్షణమును స్ఫుటపరచును. జ్ఞానమునకు సూక్ష్మబుద్ధియని గాని, తార్కికశక్తియని గాని యర్థము గాదు. జ్ఞాన మనగా జీవగతమగు ననుభవము. మనము ఈశ్వరసాన్నిధ్యమున జీవించునప్పుడు మాత్రమె, పాపమునుండి రక్షింపబడుదుము. మనకు యథార్థమగు జ్ఞానదృష్టి యుండినచో, పుణ్యకార్యము దానియంతట అదియే జరుగును. సత్యశీలుడు పుణ్యమార్గమున చరింపక తప్పదు. భక్తిమార్గము ఆ మూటిలో నెక్కువ జనప్రీతి గాంచినది. పాపాత్ములు, పుణ్యాత్ములు, పామరులు, పండితులు, జ్ఞానహీనులు, జ్ఞానవంతులు, ఎల్లరు అది సులభసాధ్య మని గ్రహింతురు. ప్రార్థన, విజ్ఞప్తి, ఉపవాసము, త్యాగము, ధ్యానము, ఆత్మపరీక్ష—అన్నియు భక్తిసాధనలో జేర్పబడును. దాని యుచ్చతమావస్థలయందు భక్తి జ్ఞాన

* శకునానా మివాకాశే జలే వారిచరా నివ
యథా పదమ్ న దృశ్యేత తథా జ్ఞానవిదామ్ గతిః.

ముతో నైక్యము జెందును; అవి రెండును కలసి పుణ్య కర్మముగ అనగా ధర్మజీవనముగ వ్యక్తమగును.

జీవన మొకవైపున వ్యక్తిగతమై, మరియొక వైపున సంఘగతమై యుండును. ఆ రెండు పక్షములును అవినాభావసంబంధమున బంధింపబడి యున్నవి. వర్ణ భేదసంస్థ సంఘగతజీవనమును, ఆశ్రమవిధానము వ్యక్తిగతజీవనమును వృద్ధినొందించును. బ్రహ్మచర్యము అనగా విద్యాభ్యసనకాలము, గార్హస్థ్యము అనగా గృహస్థుడై లోకశ్రేయమునకు పాటుపడు కాలము, వానప్రస్థము అనగా సాంఘికబంధనములను సడలించుటకై వినియోగింపబడు విరామకాలము, సన్న్యాసము అనగా ఆత్మత్యాగము గలిగి స్వాతంత్ర్యమునకై యాతురతతో నిరీక్షించు కాలము—ఈ నాలుగు ఆశ్రమములు శాశ్వత జీవనమునకై జేయబడు తీర్థయాత్రయందలి వేర్వేరు మజిలీలను సూచించును.

శరీరమును మనస్సును స్వాధీనపరచి శిక్షణమునందుంచుకాలము మొదటి యాశ్రమము. మృదులయౌవనము ధర్మజీవనముగ మార్చబడును. విద్యార్థి కొంత నిర్ణీతకాలము తన గురువుయొక్క గృహమున నివసింపవలసియుండును. అచ్చట వాడు భావిజీవనమున తనకు

తోడ్పడునట్టి కళలను విజ్ఞానశాస్త్రములను అభ్యసించును. స్త్రీలు కూడ బ్రహ్మచర్యమున కర్హులు.* వారు జెందియున్న వర్ణములకు గరపబడు విద్య వారికిని గరపబడుచుండెను. వా రావిధముగ తమ జీవితములో అవసరసమయములందు వర్ణధర్మముల నిర్వర్తింప సమర్థత బడయుచుండిరి. అన్యసంఘములలోని భిన్నాచారములు గల స్త్రీలు వివాహమునకై స్వీకరింపబడినపుడు వేదాధ్యయనసందర్భమున నిషేధములు కల్పింపబడెను.

రెండవ యాశ్రమము మనుష్యుడు గృహస్థుడైన పిమ్మట గడపవలసిన కాలము. మానవుడు సామాన్యముగ తనతో తాను తృప్తిజెంది యుండడు. దైవసన్నిభుడగు అరిస్టాటిలు (Aristotle) ఏకాంతజీవనము నానందముతో గడపియుండవచ్చును. కాని సామాన్య స్త్రీపురుషుల కది సాధ్యము గాదు. వీరు సాధారణముగ వైవాహిక జీవనమున బ్రవేశింప బ్రోత్సహింపబడుదురు.♦ వాంఛలను బహిరంగముగను నిరాటంకముగను

* పురా కల్పేషు నారీణామ్ మౌంజిబంధన మిష్యతే
అధ్యాపనం చ వేదానామ్ సావిత్రీవచనమ్ తథా.

♦ శాయన పరాశరసంహితకు వ్రాసిన వ్యాఖ్యానము (బొంబాయి సంస్కృతగ్రంథమాల, రెండవగ్రంథము. 82వ పుట) లో

తృప్తిపరచుటవలనకంటె వానిని అణచుటవలన నెక్కుడు అనర్థములగు ఫలితములు వాటిల్లు నని ఫ్రూడు (Freud) మహనీయుడు ఐరోపాఖండములో ప్రస్తుతము ప్రచారము చేయుచున్న విషయము హిందూదేశము కొన్ని శతాబ్దములక్రిందటనే గ్రహించియుండెను. సంసారమునుండి మరలి పరుగెత్తువాడును యుద్ధమునుండి పలాయనమగువాడును, ఒకే విధమగు నపజయము పొందుదురు. జీవితములో నపజయము గాంచువారె ధర్మనిర్వహణమునకు సమకూరు నవకాశములను విడతురు. వివాహము పవిత్రమైనదిగ నెన్నబడును. దేవతలు సయితము

హారితస్మృతి (XX. 23) ని చూర్చి ప్రస్తావించి యున్నాడు. ఆస్మృతి ప్రకారము, బ్రహ్మవాదినులు అనగా బ్రహ్మజ్ఞానమునకై జీవితముల నర్పించుకొనినవారు, సద్యోవధువులు అనగా వివాహితలైనవారు—అను రెండుతెరగతులుగ బాలికలు విభజింపబడిరి. ప్రాచీన సంస్కృతవాఙ్మయయుగము నాటి విఖ్యాతనారీమణులు కొందరు—బృహదారణ్యకోపనిషత్తునందు పేర్కొనబడిన గార్గి, మహాభారతమునందు జెప్పబడిన సులభ, రామాయణమునందు తెలుపబడిన శబరి మున్నగువారు—వివాహము చేసికొనకయె జీవించిరి. హిందూ సాంఘికశాసన స్మృతి యట్టి యసాధారణవ్యక్తుల కంతగా సంబంధించి యుండదు. నెలకొల్పబడవలసిన యొక మాదిరి జీవనమునకును, ఆజీవనమున నిర్వర్తింపబడవలసిన పద్ధతులకును సంబంధించి యుండును. అది సాధారణజనులనిమిత్తము నిర్మింపబడును.

వివాహమున జేర్పబడిరి. హిందువు నిర్గుణబ్రహ్మధ్యానమునుండి మరలి సగుణభగవానుని యారాధనకు గడంగినప్పుడు, వాని యుపాస్యదేవత విధిగ పత్నీసహితమై యుండును. వాడు బ్రహ్మచారిని గాని బ్రహ్మచారిణిని గాని యుపాసింపడు. శివుడు అర్ధనారీశ్వరుడు. సహకారము, పరస్పరసంబంధము కలిగి, ప్రత్యేకముగ నుండిన నసంపూర్ణములును, కాని కలసియుండిన సంపూర్ణములును, నగు పరమేశ్వరుని స్త్రీపురుషశక్తులను శివవిగ్రహము ప్రకటించును. దాంపత్యజీవనమున నసుచితమైనది గాని, దోషయుతమైనది గాని యెద్దియు లేదు. దాంపత్యజీవనము, వివాహసంస్థద్వారమున, జ్ఞానసీతిపూర్వకములగు గాఢసఖ్యతలకు మూలాధారముగ జేయబడెను. వివాహము మానవదౌర్బల్యమును కనుగొని కనికరముతో వాని సౌకర్యమునకై నెలకొల్పబడిన సంస్థయనుటకంటె, వాని యాత్మాభివృద్ధికి తోడ్పడు సాధనమనుట యెక్కుడు సమంజసము. ఆత్మను వికసింపజేయు నిమిత్తమె గాక, గృహస్థధర్మమును కలకాలము ప్రవర్థమానము జేయుటకును, అది విధింపబడెను. వివాహము ద్వారమున సాంఘికప్రయోజనము నెరవేరును.

ప్రతివంశము, ప్రస్తుతము జీవించుచున్నట్టియు

నిదివరకు గతించినట్టియు, పరస్పరసంబంధముగల బంధువుల కూటము. వంశ మేకమను భావము, వంశస్థుల మనంబుల నాటుకొను నట్లు జేయుటకై శ్రాద్ధకర్మము విధింపబడెను. తత్కార్యాంతమున "ఓ పితరులారా, ఒక శూరుడగు పుత్రుడు నాకు లభించు నట్లు జేయుడు." అని కర్త యభిలాష దెల్పును.*

వివాహసంస్థ, వ్యక్తిసంబంధముగను, సంఘసంబంధముగను నిర్వహించు ప్రయోజనములను హిందూ ధర్మము స్పష్టీకరించును. పురుషుడు నిరంకుశపాలకుడు గాడు; స్త్రీ బానిసయు గాదు. కాని యిరువురును తమ వ్యక్తిగతాభిరుచుల నుచ్ఛ్రితాదర్శమునకు లోబరచి, ఆ యాదర్శముకొరకు పాటుపడు సేవకులు. ఇంద్రియప్రేరితమగు మోహము, ఆత్మవిస్మృతిజనకమగు ప్రేమగ పరిశుద్ధపరుపబడును. హిందువులకు వివాహము పరిష్కృతము గావలసిన సమస్యయె గాని స్థిరపడిన ఘటనగాదు. కల్పనాకథలలో తప్ప, అభిరుచులు, అభ్యాసములు, ఆదర్శములు, ఆశయములు మున్నగు సర్వవిషయములందును పరస్పర మేకీభవించు దంపతులు కనబడరు.

* వీరమ్ మే దత్త పితరః. వేదప్రార్థన: మేము మహావీరులను గలిగి యుందుము గాక! సువీరాసో భవేమ.

తొలగింప నలవికాని విభేదము లెల్లప్పుడు నుండును. ఈ భేదములతో నొక సమన్వయజీవనము సమకూర్చి, పెంపొందించుటయె వివాహసంస్కారము నెరవేర్చు పని. ఆదర్శప్రాయమగు నొక సంపూర్ణజీవనములోనికి మార్చబడవలసిన సామగ్రియే జన్మసిద్ధములగు శక్తులు, వాంఛలు.

వివాహమునందు స్వయంవరమునకు కొంత యవకాశము కలదు గాని, శ్రేష్ఠతమములగు వివాహములు గూడ చాలవరకు అదృష్టవశములె. మన జీవితమే శక్తులతో నిర్మితమయినదో ఆ యద్భుతశక్తులను మన యిష్టానుసారమే రూపమునైనను పొందింపవచ్చును. కాని యదృష్ట మను పేరుతో పిలువబడు రేఖ యొకటి ఆ రూపమునందు మరలమరల గోచరించుచునె యుండును. అదృష్టవశముగ సంప్రాప్తమయిన దాంపత్యసంబంధమును, యావజ్జీవిత సంబంధముగ పరిణమింపజేయు వివాహమె జయప్రదమైనది. వివాహము అయినతోడనె దంపతుల పోరాటము అంతము నొందదు. ప్రత్యేక స్వార్థములను, అభిలాషలను అణచి యొక విశాలతరమగు నాదర్శోపలబ్ధికై వారు చేయు యావజ్జీవితకృషి యొక్క ప్రారంభమె వివాహము. ఒక సమానాదర్శ

నిదివరకు గతించినట్టియు, పరస్పరసంబంధముగల బంధువుల కూటము. వంశ మేకమను భావము, వంశస్థుల మనంబుల నాటుకొను నట్లు జేయుటకై శ్రాద్ధకర్మము విధింపబడెను. తత్కార్యాంతమున "ఓ పితరులారా, ఒక శూరుడగు పుత్రుడు నాకు లభించు నట్లు జేయుడు." అని కర్త యభిలాష దెల్పును.*

వివాహసంస్థ, వ్యక్తిసంబంధముగను, సంఘసంబంధముగను నిర్వహించు ప్రయోజనములను హిందూ ధర్మము స్పష్టీకరించును. పురుషుడు నిరంకుశపాలకుడు గాడు; స్త్రీ బానిసయు గాదు. కాని యిరువురును తమ వ్యక్తిగతాభిరుచుల నుచ్ఛతరాదర్శమునకు లోబరచి, ఆ యాదర్శముకొరకు పాటుపడు సేవకులు. ఇంద్రియప్రేరితమగు మోహము, ఆత్మవిస్మృతిజనకమగు ప్రేమగ పరిశుద్ధపరుపబడును. హిందువులకు వివాహము పరిష్కృతము గావలసిన సమస్యయె గాని స్థిరపడిన ఘటనగాదు. కల్పనాకథలలో తప్ప, అభిరుచులు, అభ్యాసములు, ఆదర్శములు, ఆశయములు మున్నగు సర్వవిషయము లందును పరస్పర మేకీభవించు దంపతులు కనబడరు.

* వీరమ్ మే దత్త పితరః. వేదప్రార్థన: మేము మహావీరులను గలిగి యుందుము గాక! సువీరాసో భవేమ.

తొలగింప నలవికాని విభేదము లెల్లప్పుడు నుండును. ఈ భేదములతో నొక సమన్వయజీవనము సమకూర్చి, పెంపొందించుటయె వివాహసంస్కారము నెరవేర్చు పని. ఆదర్శప్రాయమగు నొక సంపూర్ణజీవనములోనికి మార్పబడవలసిన సామగ్రియే జన్మసిద్ధములగు శక్తులు, వాంఛలు.

వివాహమునందు స్వయంవరమునకు కొంత యవకాశము కలదు గాని, శ్రేష్ఠతమములగు వివాహములు గూడ చాలవరకు అదృష్టవశములె. మన జీవితమే శక్తులతో నిర్మితమయినదో ఆ యద్భుతశక్తులను మన యిష్టానుసారమే రూపమునైనను పొందింపవచ్చును. కాని యదృష్ట మను పేరుతో విలువబడు రేఖ యొకటి ఆరూపమునందు మరలమరల గోచరించుచునె యుండును. అదృష్టవశముగ సంప్రాప్తమయిన దాంపత్యసంబంధమును, యావజ్జీవిత సంబంధముగ పరిణమింపజేయు వివాహమె జయప్రదమైనది. వివాహము అయినతోడనె దంపతుల పోరాటము అంతము నొందదు. ప్రత్యేక స్వార్థములను, అభిలాషలను అణచి యొక విశాలతరమగు నాదర్శోపలబ్ధికై వారు చేయు యావజ్జీవితకృషి యొక్క ప్రారంభమె వివాహము. ఒక సమానాదర్శ

ప్రాప్తికొరకు సలుపబడు సేవ యత్యంతభిన్నవ్యక్తుల నేకముగ బంధింపగలదు. ప్రేమ త్యాగమును పురిగొల్పును. సంయమసహనములద్వారమున దంపతులు ప్రేమను పవిత్రపరచి యందు ఈశ్వరుని దర్శింతురు.

ఆదర్శవివాహమునందు దంతతు లిరువురియొక్క యథార్థప్రయోజనములు పూర్తిగ సమరసపరుపబడును. ఉత్తమనీతియుక్త మగు వివాహము జీవితాంతమువరకు నొకరితో నేర్పడు దాంపత్యమె. దంపతు లిద్దరును యావత్ప్రపంచమును ప్రతిఘటించి యొకరికి నొకరు తోడుగా నుండుటకు సాయపడు నట్టిదియయి, సీతారాములలోగాని సావిత్రీసత్యవంతులలో గాని కాన్పించు దాంపత్యమె హిందూశాస్త్రములు ఆదర్శముగ జూపును. సంపూర్ణాదర్శము లభ్యము కానంతవరకు, దానికంటె హీనములయి దానినె లక్ష్యముగ జూపు నాదర్శములతో జనులు తృప్తి జెందవలెను. కాని యంతమాత్రమున నిమ్నతరమయిన దాంపత్యసంబంధమును గాంచి యుచ్చతరదాంపత్యముగ మనము భ్రమింప నక్కరలేదు. ఎనిమిది విధములయిన వివాహములు హిందూస్మృతి యామోదించును. సమకాలికుల యాచారములను మనువు తన దృష్టియం దుంచకపోలేదు. ఆయన వివిధ

వివాహములను ఒక క్రమమయిన వరుసను పొందుపరచెను. స్వాభిలాషకు ప్రాధాన్యత నొసంగని వివాహములకు నుత్తమస్థాన మీయబడెను. స్వయంవరమువలన నేర్పడు (గాంధర్వ) వివాహములును, బలాత్కారముచే జరగు (రాక్షస) వివాహములును, విక్రయముద్వారమున కూర్పబడు (ఆసుర) వివాహములును తరువాతి స్థానముల నాక్రమించును. అధమమయినది పైశాచికము. కన్య నిద్రలో నున్నప్పుడుగాని స్మృతితప్పి యున్నప్పుడు గాని మతిచెడి యున్నప్పుడు గాని కాముకుడు ఆమెతో సంభోగించినప్పుడు నేర్పడునది పైశాచికవివాహ మనబడును.* అది చాల నీచమయిన వివాహము. కాని యట్లు పీడింపబడిన పడతులకు సతీత్వగౌరవమును వారి బిడ్డలకు ఔరసత్వాధికారము నొసంగవలయు నను ఘనమయిన యుద్దేశముతో పైశాచికవివాహములు న్యాయసమ్మతములుగ నంగీకరింపబడెను.

వంశముయొక్క మేలును గోరి యేకపత్నీవ్రతాదర్శము సడలింపబడును. ఆ యాదర్శము సర్వోత్తమమయినదని ప్రతిపాదింపబడినను, బహుభార్యాస్వీకారము కూడ నామోదింపబడును. ఒకడు వివాహితుడై

* మనువు, iii. 34.

యుండగా, పుత్రసంతానము లేకపోవుటచే గాని; ప్రలోభనమువలన గాని, దురదృష్టవశమున గాని, యొక వనితను దుర్నీతియందు ప్రవేశపెట్టినప్పుడు, బహిష్కారబాధనుండియు ప్రజాతిరస్కారమునుండియు ఆమెను కాపాడి అపకీర్తికి, భ్రష్టత్వమునకు లోనుగాకుండ రక్షించుటయు, తమ జననీజనకుల నడతలకు తా మెంత మాత్రము బాధ్యులు గానట్టి యామె బిడ్డలను బోషించుటయు, ఆతని విధి యగును. కావున బహుభార్యాస్వీకారమున కనుమతి యొసంగబడును. రామాయణకథ నేర్పు ముఖ్యనీతులలో బహుభార్యాస్వీకారము అనర్థదాయక మనునది యొకటి. దశరథుని రాజమందిరము కుట్రలకు కేంద్రస్థాన మయ్యెను. కథానాయకుడగు రాముడు ఏకపత్నీవ్రతాదర్శమునకు దృష్టాంతముగ నున్నాడు.

ఎల్లరు తప్పక వివాహము చేసికొనవలె నని విధించు పద్ధతి, జీవితమునకు పరమార్థము లేదని నిరాశజెందు అవివాహితనారీమణుల సంఖ్యను పెరుగనీయ కున్నను, దానికి కొన్ని ముఖ్యలోపములు గలవు. వితంతువివా

హములు నిరుత్సాహపరచుట యావశ్యక మయ్యెను.* బాలికల వివాహవయస్సు వితంతువివాహములమూల మున, ఉద్దేశింపబడకయె, తగ్గుచు వచ్చెను. నాయకులు హైందవాదర్శములను స్మరణకు దెచ్చుకొని యెక్కుడు తృప్తికరములయిన పద్ధతుల నిప్పుడు నెలకొల్పుట యావశ్యకము.

వివాహ మాత్మలకు సంబంధించిన దని యంగీక రించినయెడల, అది ఛేదింపరాని దని మానవులు తలంప వలసియుండును. జీవితమునెడల వారు అల్పదృష్టి కలిగి యొక క్షణమున నేర్పడు భావోద్రేకమును గాని భ్రాంతి నిగాని వారు మార్గదర్శకముగ గైకొనునంతవరకు, వివా హసంబంధము శాశ్వతమయిన దని యెంచుట యసా ధ్యము. మోహాంధులై యున్న మొదటి కొలదిరోజు లలో, వారు తమ ప్రేమాస్పదులు స్వర్గీయదేవకన్య లని తలపోయుదురు; కాని యా విస్మయత వెంటనె తొల గును. సంపూర్ణసుఖవాంఛ వారిని వీడనియెడల, వారు కలవరము జెంది తరచుగ నసూయాపరు లగుదురు.

* ఈక్రిందివి చూడుడు:
ఋగ్వేదము. x. 18. 8; అశ్వలాయన, iv. 2. 18; అగ్నిపు రాణము. cl iii.

ఈ యశాంతి యొక విపరీతాదర్శముయొక్క ఫలితము. పరిపూర్ణదాంపత్యము సమకూర్పబడవలయును గాని, సిద్ధముగ లభించునది గాదు. అన్యోన్యప్రాతికూల్యత యెక్కుడు తీవ్రమయిన పోరాటమునకు కారణమగును. వివాహవిచ్ఛేదమునకు గడంగుట యన పరాజయ మంగీకరించుటయె. అపసవ్యమయిన యతుకులు, అనుకూలపడని సరిపెట్టుటలు, అపజయసూచకములె గదా!

నవీనపరిస్థితులు బహుసంఖ్యాకములయిన వివాహవిచ్ఛేదములకును వియోగములకును కారణభూతములు. జీవితము అతివేగముగ పరుగిడుచున్నది. ఒకరినొకరు గ్రహించుటకు అవకాశము లేదు. నేడు విద్యాధికులు తమ ప్రవర్తనమె యోగ్య మని కనపరచుటకై, వ్యక్తియొక్క స్వేచ్ఛకు మితిమీరిన ప్రాధాన్యత నిచ్చుచు వాదనలు సలుపుచున్నారు; నీమమును తీవ్రముగ ప్రతిఘటించుచున్నారు. జన్మసిద్ధములగు నింద్రియశక్తులతోను విషయవాంఛలతోను గూడిన జీవితమునె యాత్మవికాస మనియు, ఆత్మాభివృద్ధి యనియు వారు భ్రమించుచున్నారు. తాము ఆత్మస్వరూపులు గాక పశుతుల్యులన తలంపులో పడుచున్నారు. మానవచరిత్ర ప్రారంభమునుండియు, మానవులను పాప మంటియె యున్నది;

కాని వారు ఇటీవల దానిని గౌరవింప మొదలిడినారు. పురుషుడు గాని స్త్రీ గాని తనకు వివాహమూలమున జత పరుపబడిన వ్యక్తితో విసుగు జెంది మరొకవ్యక్తిని గైకొనుట యతి నవీనవిషయము గాదు. కాని నిజముగ నవీనమయినది యీ పద్ధతిని సమర్థించుచున్న నూతనకుతర్కమె. మారువేషముతో మోహము ఉత్తమనాగరికతమాడ్కి నటించుచున్నది. కీర్త్యపకీర్తులందు తన భర్తతోడ నున్న సతీమణి యాచారదాస్యము సలుపు పిరికిపంద యని యాక్షేపింపబడుచున్నది. నీతిశాస్త్రములు కృత్రిమము లని, అవ్యాజానురాగములు బూటకములని తలంచి వానిని త్యజించుటకు ధైర్యము గలిగి తన భర్తను విడిచి మరొకని చేపట్టు స్త్రీ మహావీరవనిత యని ప్రశంసింపబడుచున్నది. దంపతుల వ్యభిచారవర్తనములు తక్కువ భీతావహములును ఎక్కువ జనామోదకరములు నగుచున్నవి.

స్త్రీల దుష్టత్వము పెంచిచెప్పుటలో హిందువులును యథాశక్తి తోడ్పడినవారె యయినను, స్త్రీ పురుషుని సదా ప్రలోభపెట్టునదని, వినాశహేతువని, డోనాల్డ్సన్ (Donaldson) వచించినట్లు "పురుషయుద్ధనౌక ప్రక్కన జేరి దానిని బ్రద్దలుకొట్టుటకు నెల్లప్పుడు ప్రయ

త్నించు ఫిరంగులయోడ* యని, పరిగణించు శాస్త్రవాక్యములు గొన్ని హిందువులు కూడ వచించునప్పటికిని, స్త్రీనిగురించి మొత్తముమీద వారికిగల యభిప్రాయము ఉత్కృష్ట మయినదే. పురుషునికి సమస్తకార్యములందు తోడ్పడు సహధర్మిణి* యని స్త్రీ హిందువుల ప్రశంసకు పాత్ర మగుచున్నది. స్త్రీ వలన ప్రపంచమునకు సమకూరు మేలు ప్రత్యేకముగ గలదని హిందువుల విశ్వాసము. స్త్రీకి ప్రత్యేకబాధ్యతలును ప్రత్యేకవిధులును గలవు. "సంఘములో ప్రతిశ్రేణివారును పురుషులును స్త్రీలును తాము మాత్రమె, యావత్సంఘోపయుక్తమగు జ్ఞానముయొక్కయు ధానముయొక్కయు సముదాయమునకు జేర్పగలిగినది యన్న జేర్పునిమిత్తము గలిగి యున్నారు; హీనమయిన యనుకరణమువలన వారు

* ఋగ్వేదము v. 61. 8 ను వ్యాఖ్యానము జేయుచు, శాయన యిట్లు చెప్పుచున్నాడు: "భార్యాభర్తలు ఒకే పదార్థమందలి రెండు సమభాగములుగ నున్నారు; కావున వారు ప్రతివిషయమునను సమానులు. ఇరువురును కలసి యైహికాముష్మిక కార్యములన్నిటియందును సమముగ కృషి సలుపవలెను." ఈ యాదర్శమును సంకుచితపరచు వచనములు గొన్ని మను యాజ్ఞవల్క్య స్మృతులందు గలవు.

తమకును సంఘమునకును నష్ట మాపాదించుకొందురు"* అని యున్న తధీశాలి యగు బర్ట్రాండ్ రసెల్ (Bertrand Russel) కూడ నంగీకరించుచున్నాడు. బిడ్డలు ఆకాశమునుండి రాలిపడక తమ తల్లులగర్భములందు రూపము ధరింపవలసి యున్నంతకాలము స్త్రీలకు ప్రత్యేకవిధికృత్యము లుండును. శిశువులను కని పెంచుటకు స్త్రీలు విశేష కాలమును శ్రద్ధను వినియోగింపవలసి యుండుటచే, కుటుంబముయొక్క యార్థికబాధ్యతలు వారికి లేకుండ జేయబడును. పురుషుడు లౌకికవృత్తులందు పాటుపడువాడని (యజ్ఞప్రాధాన్య డని), స్త్రీ ఆత్మనిగ్రహమునందును ఆత్మత్యాగమునందును మహాన్నత్యము జెందగలిగినది యని (తపఃప్రాధాన్య యని) యెంచబడుచున్నారు. స్త్రీల విషయమున ప్రయోగింపబడు కఠినతరమైన నైతికశాసనము నిజముగ వారికి ఘనతనె సమకూర్చును. ఏలయన, స్త్రీలకు స్వభావసిద్ధముగ నాధిక్యత గలదని యది యొప్పుకొనును. కాని నవయుగవనిత—నే నిట్లు చెప్పుటకు అభ్యంతరము లేనియెడల—తన యాత్మగౌరవమును కోలుపోవుచున్నది. ఆమె తన వ్యక్తిత్వమును ప్రత్యేకత్వమును మన్నించుట లేదు. పురుషుని అనుకరించుటకు ప్రయ

* **Hypatia**

త్నించుచు తనకు తెలియకయె యాతనిని గౌరవించుచు న్నది. వేగముగ పురుషునివలెను మరియు యంత్రము వలెను మారుచున్నది. అధిక ప్రయాసములవలన సాధ్యము లగు జీవనవృత్తులలో ప్రవేశించుటచే, ఆమెకు తన యాంతరిక స్వభావముతో సంఘర్షణము కలుగుచున్నది.

కుటుంబబాధ్యత నతిక్రమించి జీవించు వ్యక్తికి మూడవ యాశ్రమము లభించును. భార్య భర్తయొక్క యాధ్యాత్మికాశయములందు పాల్గొనుచుండిన యెడల, ఆమె యాతనితో నరణ్యమునకు జనును. మనువు నడివి న ప్రకారము, ఒకడు పితామహుడై చర్మము ముడతలు పడి వెండ్రుకలు నెరసినప్పుడు తృతీయాశ్రమమునందు ప్రవేశింపవలెను. ఒకడు తన శరీరశక్తులు క్షీణించిన ప్పుడు, అరణ్యమున కరిగి యథార్థమయిన యాత్మీయజీవ నము బడయుటకు ప్రయత్నింపవలెను. జీవితకోలాహల మునుండి తొలగి యుచ్చతరసమస్యలనుగూర్చి సమాలో చన సలుపుటకై యేకాంతవనవాసము గడపుట, యీ యాశ్రమప్రధానోద్దేశము.

మనుష్యుని యాధిక్యత సంఘముయొక్క యక్క రలను దీర్చుటతోనె పరిపూర్తి నొందింప గూడదు. మను ష్యుడు కేవలము సంఘసేవకుడు గాని దేశసంరక్షకుడు

గాని యైశ్వర్యప్రవర్ధకుడు గాని యైయున్నా డనుకొనుట పొరపాటు. ఆత డంతకంటె నధికుడు. వాని లౌకికజీవన ప్రాశస్త్యమునుబట్టి యాతని యాత్మశక్తి నిర్ణయింప దగదు. మానవుని యాధ్యాత్మిక జీవనమునకు నాధార భూతముగ నున్న జీవాత్మయందు అనంతశక్తి యిమిడి యున్నది. మానవుడు యావత్ప్రపంచమును జయించి నను తన యాత్మను రక్షించుకొననియెడల, వానికి తన్మూలమున నేమి లాభము? ఒక సంస్కృత శ్లోక మిట్లు చెప్పుచున్నది: "వ్యక్తిని గృహామునిమిత్తమును, గృహాము సంఘమునిమిత్తమును, సంఘము దేశమునిమి త్తమును, సమస్తప్రపంచమును ఆత్మనిమిత్తమును త్యజింప వలెను."* గృహాము, దేశము, జాతి, ప్రపంచము–ఇవి మానవాత్మను తృప్తి పరుపజాలవు. ప్రతివ్యక్తియు తన జీవితములో నొక స్థితియందు తన భార్యను బిడ్డలను, తన జాతిని వృత్తిని, విడువవలయునని కోరబడుచున్నాడు. జీవనపథమందలి యంత్యభాగమున నెవరికి వారె ప్రత్యే కముగ ప్రమాణము జేయవలసి యుండును.

సన్యాసియొక్క యాశయము ప్రాపంచికజీవన బాధ్యతలను విసర్జించుట గాక, సంపదచే గాని కీర్తిచేగాని ప్రలోభపెట్టబడక, జయముచే నుప్పొంగక, అపజయ

ముచే గ్రుంగక, ఆధ్యాత్మిక స్వేచ్ఛతో జీవించుచు నున్నత పదవిని బడయుటయె. ఆతడు శాంతస్వభావము వృద్ధి నొందించును. కావున "పరుషవచనములను సహనముతో భరించును. ఎవరిని దూషింపడు. తన శరీరమునకు బాధ కలిగించినను, ఎవరిని ద్వేషింపడు."* ఈ స్వాతంత్రవ్యక్తులు ఎట్టి స్వకీయప్రేమబాంధవ్యములనుగాని ప్రత్యేకవాంఛలను గాని కలిగియుండక తమ యంతరమున ప్రపంచస్వాతంత్ర్యమును దర్శించి దాని యుపలబ్ధి కయి సర్వసంగపరిత్యాగముతో జీవించు మహాత్ములు. అఖిలప్రపంచముయొక్క విశాలజీవనమును వారు స్వీకరింతురు.♦ ప్రేమయందు నోలలాడుదురు. ధర్మమునందు క్రీడింతురు. వారు సాంఘికక్రమపద్ధతుల నెంతమాత్రము పాటింపక సాంఘికాచారములను మన్నింపరు కావున, సంఘము వారిని పరాన్నభుక్కులుగ పరిగణించును. ఏ గృహమునకుగాని, ధర్మమండలికిగాని, ఏ జాతికి గాని, ఏ దేశమునకు గాని బద్ధులై యుండరు గావున, ప్రభుత్వము వారిని నమ్మి యుండదు. ఏ పారిశ్రామిక యంత్రశాలయందు, ఏ సాంఘికసంస్థయందు, ఏ రాజ

* మనువు, vi. 47 ff

♦ వారాణస్ మేదిని.

కీయసంఘమునందు, వారు కృషి సలుపరు. ఈ సన్న్యా సులు మానవజీవనమునకు హానికరముగ ప్రపంచమును మార్చు నుద్దేశములకు తోడ్పడరు; వ్యక్తులను యంత్ర ములవలె మార్చివేయు పారిశ్రామికవృత్తులను వృద్ధి నొందింపరు; యుద్ధహేతువులగు జాత్యహంకారములను పెంపొందింపరు. దేశభక్తి యీ మహాత్ములకు తృప్తి గొలుపదు. హిందూజాతీయజీవనమో, ఆంగ్లజాతీయ జీవనమో గాక, విశ్వజీవనమె వారి కాహ్లాదకరము. సర్వమానవులను సమస్తజంతులను వారు సమదృష్టితో జూతురు. (సమతా సర్వస్మిన్.)

క్రైస్తవబౌద్ధమతశాఖలుగొన్ని సన్న్యాసజీవనము కంటె గృహస్థజీవనము హీన మని నిరసించి యావన్మా నవకోటిని ఒక్క మారుగ మఠములందు జేర్పవలె నని యభిలషించుచున్నవి. హిందూధర్మము సన్న్యాసమును శ్లాఘించుచున్నను, గృహస్థాశ్రమమును తృణీకరింపదు. ప్రతిస్థితియు ఆవశ్యకము. ఆ స్థితి యెంతవర కవసరమో యంతవరకు శ్రేష్ఠమయినదె. పుష్పమునకు పత్రము, పత్రమునకు కాండము, కాండమునకు మూలము, అనా వశ్యకము లగునా? మానవు లొక స్థితినుండి మరొక స్థితికి క్రమముగ మారవలయు ననియె సాధారణసూత్రము.

ముక్తజీవి ప్రపంచక్షేమము నెడల నుదాసీనముగ నుండడు.* బుద్ధుడు నిర్వాణద్వారముకడ చేరినప్పుడు, దానివద్దనుండి మరలివచ్చి, కష్టములతో, దుఃఖములతో, బాధపడుచు నొక్క మానవుడైనను ప్రపంచమున మిగిలి యుండువరకు దానిని దాటనని ప్రతిజ్ఞ గైకొనెనని యూయనను గూర్చి యొక కథ చెప్పుదురు. భాగవతమందలి యొక యుత్కృష్టశ్లోకమునందు ఈ భావమె వ్యక్తమగుచున్నది. "అష్టసిద్ధులతో వెలుగొందు పరమానందపదవిని గాని పునర్జన్మరాహిత్యమును గాని నేను వాంఛింపను. బాధపడుచు జన్మముల నెత్తు సకల జీవులు దుఃఖవిముక్తు లగుటకై వారెల్లరి దుఃఖమును నా దుఃఖముగ గ్రహింతును గాక!" త్యాగశిరోమణి యగు మహాదేవుడు ప్రపంచముకొరకు విషము ద్రాగెను. ఉచ్ఛ్రితమజీవనస్వాతంత్ర్యము, క్షుద్రజీవితముల గడపువారి మధ్య, కష్టపడుటకు, త్యాగముచేయుటకు, మృతినొందుటకు మహాశౌర్యసాహసములతో ప్రకటితమగును.

* సన్యాస మనగా నేను, నాది యను భావములను త్యజించుటయె; కాని శాస్త్రవిధిత కర్మమును విడచుట కాదు. అహంకార మమకార త్యాగ ఏవ సన్యాసో వక్ష్యతే నా శేషశాస్త్రార్థత్యాగః మనువునుగురించి మేధాతిథి, vi. 32.

జీవితముయొక్క యీ చతుర్విధమగు నాశ్రమ పద్ధతి హిందువుల హృదయములందు రాజ్యము చేయుచున్నది. ఒక సంఘముయొక్క యాదర్శసద్వర్తనము ఆ సంఘముయొక్క జనసామాన్యమునం దెన్నడు నుత్తమరూపమున గాన్పింపదు. ప్రతిసంఘమునందు సహజముగ శిష్టులు కొంద రుందురు. వారే యన్యుల కంటె నెక్కువగ సంఘముయొక్క ధర్మజీవనమును, ఉత్తమాదర్శములను, పవిత్రభావములను, ముఖ్యాభినివేశములను వెల్లడింతురు. యావత్సంఘము వారిని ఆదర్శపురుషులుగ జూచును. వత్తి చివరను వెలుగు ఉన్నాడు, ప్రమిద వెలుగుచున్న దని చెప్పుదుము గదా!

# చతుర్థోపన్యాసము

## హిందూధర్మము : 2

జాతులు అన్యోన్యసహకారజీవనమును, నాగరికతలు పరస్పరజ్ఞానవినిమయమును, కలిగి యుండవలె నని విశ్వసించు హిందూధర్మముయొక్క ముఖ్యలక్షణమగు సమగ్రసమీకరణభావమునకు వర్ణసంస్థ దృష్టాంతముగ నున్నది. వర్ణసంస్థ పరస్పరవిశ్వాససహనములనుండి జనించినదనుట విరుద్ధముగ గాన్పించ వచ్చును గాని, అది వాస్తవము. అసహనమునకును నిరంకుశత్వమునకును అది నేడు సాధనభూత మయి భ్రష్టత్వము జెందినను, అసమానత్వము పెంపొంచి యొకరి నొకరు బహిష్కరించుకొని వేర్వేరుగ జీవించుటకు అది తోడ్పడుచున్నను, ఈ దురదృష్టఫలితములు దాని మూలోద్దేశములకు సంబంధించినవి గావు. అభివృద్ధి వాంఛించు హిందూదేశవిద్యార్థులు సమర్థు లయియున్న యెడల, తాము నిస్సందేహముగ గలిగియున్న యధికారమునుబట్టి, గుర్తించుటకు గూడ సాధ్యముగాని రూపమున వారాసంస్థను సంస్కరింపవచ్చును. దానివలన గలిగిన యరిష్టములను పేర్కొనుటకు నే నిప్పుడు పూనుకొన లేదు;

దాని మూలసిద్ధాంతములపై పునకు మీ దృష్టిని మరల్ప వలయు నని గోరుచున్నాను.

ప్రస్తుతపు వర్ణముల నేమాత్రము పరికించినను, వర్ణసంస్థ యుద్భవిల్లుటకు కారణములు వివిధములై యున్నట్లు తేటపడును. వర్ణములు తెగలకు, జాతులకు, మతములకు, వృత్తులకు సంబంధించి పలువిధములుగ నున్నవి. జనులు ఒక చోటినుండి మరొక చోటికి వలస పోవుటవలన కొన్ని వర్ణము లేర్పడినవి. ఒక ప్రాచీన వర్ణమునకు జెందిన జనులు దేశములో మరొక ప్రాంత మున కరిగి నివసించి నప్పుడు, వారొక నూతనవర్ణముగ నేర్పడిరి.

పదముయొక్క యర్థమునుబట్టి స్పష్టపడుచున్న రీతిని, వర్ణము మొదట జనులను వారి శరీరచ్ఛాయ నను సరించి విచక్షణచేయుటలో వాడబడెను. హిందూదేశ పూర్వచరిత్రమును మనము పరిశీలించినచో, ఒక జాతి తరువాత మరొక జాతి యెట్లు దేశముపై దండెత్తి వచ్చి నది మనకు విశదమగును. తచ్చరిత్రారంభకాలము నందు సయితము, దేశములో ఆదిమనివాసులయిన నల్లజాతులు, బలిష్ఠులైన ద్రావిడులు, పీతవర్ణులయిన మంగోలియావారు, ఆనందభరితహృదయులును శౌర్య

వంతులు నగు ఆర్యులు నివసించుచుండిరి. అతిశీఘ్ర కాలములో దేశమునకు పారశీకులతోను గ్రీక్కులతోను సిథియనులతోను సమీపసంబంధ మేర్పడెను; వీరిలో కొందరు దేశమందు నివాస మేర్పరచుకొనిరి. ప్రపంచములో నే దేశమునకును, హిందూదేశమునకు గల జాతీయసమస్యలు, లేవు.

జాతీయసంఘర్షణసమస్యను పరిష్కరించుటకు ప్రయోగింప తలంపునకు వచ్చు వివిధోపాయములు సంహారణము, వశీకరణము, ఐక్యతాసంధానము, సామరస్యస్థాపనము. మొదటిపద్ధతి ప్రపంచమునం దంతటను పూర్వకాలమున తరచుగ నవలంబింపబడెను. ప్రాచీనదేశచరిత్రములందు అకాలమృత్యువాతబడిన యసంఖ్యాకసంఘముల గాథలు కన్పట్టును. కాని యీ మానవసంహారణకార్యము న్యాయమైనదా? ఒక జాతీయనాగరికత యంతరించినప్పుడు, ప్రపంచమున కెంత నష్టము వాటిల్లెనో మన మూహించుకొన గలమా? రెడ్ ఇండియనులు ప్రపంచాభివృద్ధికి గావించిన సాహాయ్యము బాహ్యమున కేదియు గాన్పింపకుండుట వాస్తవము; కాని యీశ్వరు డెల్లర కపారప్రేమతో నొసంగు జీవితకాలము వారును గడపి యుండినయెడల, బీజప్రాయములై వారియం దణగి

యుండి క్రమముగ పరిపక్వ మొందియుండెడి శక్తు లెట్టివో
మన కేమయిన తెలియునా? మన నాగరిత, మన ప్రతి
ష్ఠాపనములు, మన యాచారములు, ఇతరులు వ్యక్తము
గనె గాక తమ యందవ్యక్తముగ గూడ కలిగియుండు
వానికంటె నెన్నియో రెట్లు శ్రేష్ఠతరములయిన వని
నమ్ముటకు తగినంత యాధారముగ నుండునది, మనలను
గురించియు, ప్రపంచమునుగురించియు, ఈశ్వరసంకల్పము
లనుగురించియు మన మేమి యెరుగుదుము? ఒక జాతి
యందు గర్భితములయిన శక్తు లేమాత్రము కలవో,
యవి బహిర్గత మగుటకు పూర్వము, నిశ్చయించుట
యసాధ్యము. నాగరికత లొక రోజులో నిర్మాణము
గావు; రెడ్ ఇండియనుల యదృష్టము బాగుండి యున్న
యెడలను, జ్ఞానవంతు లని పిలువబడు వారు తాము నిజ
ముగ చాల యజ్ఞాను లని తెలిసికొని యహంకారమును
వీడి చరించి యుండిన యెడలను, రెడ్ ఇండియనులమూల
మున కొంత మేలు తప్పక చేకూరి తన్మూలమున ప్రపం
చ మిప్పటికంటె నెక్కుడు నైశ్వర్యవంతముగ నుండెడి
దని నేను చెప్పుటకు సాహసించుచున్నాను. మానవజన్మ
మును మానవజాతుల విభజనమును ఎంత ప్రాచీనకాల
మున ప్రారంభ మయ్యెనో యా కాలముతో సరిపోల్చి

చూచినప్పుడు, పాశ్చాత్యనాగరికత కేవల మీ నడుమ బయలుదేరినదె. మానవకోటిలో ప్రస్తుత మగ్రస్థానమందున్న గ్రేటుబ్రిటనుల పూర్వులలో కొందరు జూలియస్ సీజరు (Julius Caesar) వర్ణించిన దానికంటె నెక్కువ యభివృద్ధిలో లేరు. మతపూజలయందు చర్మముల ధరించి దేవతల తృప్తిపరచుటకై బ్రతికియున్న మనుష్యులను దహనముచేయుచు మృగతుల్యులై యుండిన యాదిమ బ్రిటన్ దేశీయులలో గర్భితములయిన మహాశక్తుల నెవరు గ్రహింపగలిగిరి? ట్యూటనుల పూర్వులతో పరిచితులైన వారెవరయినను, వారు సంగీతమునకును మన స్తత్త్వశాస్త్రమునకును ఒనర్చిన మహోపకారమును, ముందుగ నూహించి చెప్పగలిగిరా? మానవుని యవ్యక్తశక్తులు విశేషముగ గలవు; భిన్నజాతులలో నున్న ప్రధాన భేదములనుగురించి మనకు దెలిసినది బహ్వాల్పము కావున జాతుల నణగ ద్రొక్కుటయు నిర్మూలము చేయుటయు వివేకవంతులొనర్పదగిన పని గాదు. మానవస్వభావమును చరిత్రమును గూర్చి లేశమయిన తెలిసినను, ఆదిమారణ్యకజాతులయెడలను, అనాగరిక నిమ్నజాతులయెడలను, మనము సానుభూతి జూపగలిగి అసిధారను బోలి దుర్గమ మయియున్న పథమున కావల

తీక్ష్ణప్రకాశముతో తేజరిల్లు నిత్యధామము జేరుటకు వారు కూడ, ఎటువంటి దోషయుక్తములగు పద్ధతుల ననుసరించుచున్నను, కృషి సలుపుచున్నారనియె గ్రహింపగలుగుదుము. ప్రతిదేశస్థులు, ప్రతిజాతివారు ఉద్ధరణ పథమున నెంతయల్పముగ ముందునకు వచ్చినను, ప్రత్యేక మానసికస్వభావము గల యొక మాదిరి జీవనము వారియందు వ్యక్తమగును. మానవకోటియొక్క ప్రయోజనములనుబట్టి చూచిన, అన్నిమాదిరుల జనులకు సాహాయ్యము జేసి వారిలో పూర్వవికాసమును అభివృద్ధియు కలుగునట్లు విద్య గరపుట యావశ్యకము. ఏ జాతియు కేవలము తనకొరకె జీవింపదు; తనకొరకె మృతి నొందదు. అది గాక, శరీరమునకు, సంఘమునకు, జ్ఞానమునకు నష్టకరములయిన పరిస్థితులవలన జాతులు హైన్యత నొందును. కాని యా జాతులకు బాహ్యము నుండి ప్రబోధము కలిగినప్పుడు, వానిలోనుండి సమయోచితపరివర్తనముతో గూడిన మహాశక్తులు వెలువడును.

సంహారణము అసాధ్య మయినప్పుడు, ప్రపంచమున ప్రబలములైన జాతులు ద్వితీయోపాయ మయిన వశీకరణమును అవలంబింతురు. బానిసను రక్షింపుము,

నిరోధకుని నిర్మూలింపుము—అను సూత్రము వారను సరింతురు. బోక్సరువిప్లవసమయమునను, అమెరికాలో నిప్పుడును, కాంగోతీరమునను, బ్రెజిలునందును, పికింగులోను ప్రపంచనాగరికతజాతులవారు తాము నల్లరంగు గల వారిని పెట్టినబాధలు జ్ఞప్తికి దెచ్చుకొనినచో, వారి యంతరాత్మకు శాంతి యుండనేరదు. ఇటీవల మిల్నరు ప్రభువు (Lord Milner తన విశ్వాసమును వెల్లడించెను. ఆతని యుద్దేశప్రకారము, బ్రిటిష్‌సామ్రాజ్యము, బ్రిటిష్‌జనులయొక్క బంధువు లెల్లకు కలిగియుండు సౌభ్రాత్రమును, బ్రిటిష్‌వారు తమకు లోబడిన దేశములపై పొందు యాజమాన్యమును పెంపొందించునది యని తెలుచున్నది. నాగరికత యనగా విద్యాబుద్ధులందు వెనుకబడి హీనులని పరిగణింపబడు జాతులను ఉన్నతస్థితిలో నున్న జను లణగద్రొక్కుట గాదు. బలహీనులను అజ్ఞానులను నాశము చేయుటకు గాని దాస్యమున ద్రోయుటకు గాని యీశ్వరుడు మన కధికారమిచ్చునా ? ఒక జాతి మరొక జాతితో సమానముగ తెలివితేటలు గాని శరీరబలము గాని కలిగియుండక పోవచ్చును ; కాని యుత్తమాదర్శ మనుసరించి హీన జాతులు సయితము వృద్ధినొందుటకు సమానాధికార

ములు నాగరికజాతు లొసంగుట యవసరము. నాగరిక
జాతులు ప్రతిజాతియొక్క స్వాతంత్ర్యమును మన్నించి
యందలి జనులు బాహ్యావకాశములను పూర్ణముగ విని
యోగించుకొనుటకును తమ ప్రత్యేకసహజస్వభావము
లను పెంపొందించుకొనుటకును తోడ్పడవలెను.

స్వల్పకాలములో సాధింపవలె నన్న, భిన్న
జాతుల మిలనము విశేషముగ జరుగుట యసంభవము.
ఏలయన, సాంఘికసంప్రదాయమును స్వభావసిద్ధముగు
వంశపరంపరాగతజీవనమును అనేక శతాబ్దములనుండి
జనులకు సంక్రమించుచు వారి గుణమునందు, బుద్ధి
యందు, శరీరమునందు నొక్కమారుగ నిర్మూలింప
నలవిగాని విస్పష్టవ్యత్యాసములను జనింపజేసినవి. జాతి
సంఘర్షణసమస్యను పరిష్కరించుటకయి, జాతుల వ్యక్తి
త్వములకు భేదములను తొలగించుట యనావశ్యకము.
ఏవైన కొన్నిటిని ఐక్యము జేయుట యనగా వానిని సమ
రూపము నొందించుట యని యర్థము గాదు.

వివిధజాతుల సంఘర్షణసమస్య పరిష్కరించు
టలో, హిందూధర్మము అనపాయకర మయి యొకటే
మార్గముగ నన్న సమదృష్టి విధానము ననుసరించెను.
దానిప్రకారము, ప్రతిజాతి యితరుల యభివృద్ధికి భంగము

కలిగింపకుండ, తనయందలి శ్రేష్ఠత్వమును పెంపొందించుకొనుట కవకాశము కలిగియుండవలెను. చరిత్రయందు చేర్కొనబడిన ప్రతిసంఘము నిరుపమాన మయి ప్రత్యేక రూపము దాల్చియున్నది; తుదకు లోకములో ప్రయోజనకరమె యగును. ఉత్తమనీతి ననుసరించి, మనము దాని వ్యక్తిత్వమును గౌరవింపవలెను. భిన్నజాతులను విచక్షణచేయుచు వర్ణభేదము వానియం దనంతవిభిన్నత కలదని ప్రకటించును. వైదికార్యులు తాము ఈశ్వరుని యభిమానసంతాన మని తలంచి యతిసంకుచితదృష్టితో హిందూదేశమున తమ జీవితము ప్రారంభించినను, శీఘ్రముగ తమ జీవితాదర్శమును విశ్వజనీనము గావించి సర్వమానవులకు వర్తింపదగు నొక నైతికవిధానమును మానవధర్మమును వర్ధిల్లజేసిరి. హిందూదేశములోని భిన్నజాతులను సమీపమునకు దెచ్చి వారియందు మైత్రి నెలకొల్పుటకు పూనియుండి రని హిందూసంఘ నిర్మాతలు స్తుతింపబడుచున్నారు. దక్షిణదేశమును నాగరికత నొందించిన యుద్యమమున శ్రీరాముడు ఆదిమనివాసుల నుపయోగించుకొనెను. ఆయన యార్యులకును ఆర్యేతరులకును సఖ్యత గూర్చెను; ఆ కార్యమునె శ్రీకృష్ణుడును బుద్ధదేవుడును నిర్వహించిరి.

ఆదిమనివాసులును తదితరులును హిందూపద్ధతి నవలంబించినప్పుడు, వారు తమ వ్యక్తిత్వమును విడువ లేదు; కాని తమ వ్యక్తిత్వమును మాత్రమె గాక తా మంతర్గతము జేసికొన్న హిందూభావమును కూడ మార్పు నొందించిరి. హిందూసంఘముయొక్క యాదర్శ మునందును, అందు నూతనముగ జేరిన జాతియొక్క యాకృతియందును సమముగ నా మార్పు కాన్పించును. వృద్ధికి తగిన యవకాశములను బాధ్యతలను కలుగజేయు హిందూధర్మముయొక్క విశాలజీవనమునందు పలు తెగలు చేర్చుకొనబడెను. ఆ సదవకాశములవలన, వారు విద్యానాగరికతలు గల హిందువుల సాంఘికజీవన మునందు పాల్గొనిరి. అంతియ గాదు. తమ బాధ్యతల ననుసరించి వారు దానికి నూతనజ్ఞానము, నైతికోన్నతి, ఆధ్యాత్మికఘనత—వేయేల జాతీయజీవనమును పెంపొం దించు సర్వము సమకూర్చిరి. ప్రత్యుపసంఘము తన స్వభావము ననుసరించి హిందువుల యాశయముల నల వరచుకొనెను; సంస్కరించెను. ఆదిమనివాసుల దుస్థి తిని గురించి మన మేమియు పెంచి చెప్పుకొన నక్కర లేదు. పశుప్రాయులైన జనసమూహామునుండి వా రుద్ధ రింపబడి శాంతశీలము బడసిరి. ఒకే దేశములో నాశ్ర

యము పొంది, ఏకాశయములచే నైక్యము జేయబడి, ఒకే విధమగు మానసికనైతికపరిస్థితుల ప్రేరణముచే పరిణామము జెందుచు మిళితమయిన భిన్నజాతులు తాము ప్రత్యేకముగ నున్నతస్థితిని బడయుటయె గాక, తమలో జన్మమును బట్టి యేర్పడిన భేదము లెన్ని యున్నను, సఖ్యతను కూడ సమకూర్చుకొనిరి. వాలెంటైను చిరోల్ (Valentine Chirol) ఇట్లు చెప్పుచున్నాడు: "హిందూధర్మము యొక్క పరివర్తనాశీలములును సూక్ష్మములునైన యాదర్శములు చారిత్రికకాలమునకు పూర్వమె బహువిధజాతుల విరుద్ధాచార విశ్వాసములను ఒక సమగ్రసాంఘికసంస్థయందు మిళితము జేసెను. తత్సంస్థ హిందూదేశవాస్తవ్యు లగుచు వచ్చిన బహుజనులకు శరణ్య మగుటకై తగినంత యౌదార్యమును, ఆర్యసంతతియగు హిందువుల యౌన్నత్యము కాపాడుటకై తగినంత దృఢత్వమును కలిగి యుండెను."*

ఎట్టి నీమము పాటింపక జాతులు మిళితమగుటను హిందూనాయకులు ప్రోత్సహింప లేదు. ఆహారవిహార విషయములలో వివిధసంఘస్థు లనుసరించుచున్న నియ

* India : Old and New pp. 42-3.

మములకు హిందూధర్మశాస్త్రములు తావొసంగెను. నిమ్నజాతు లని పరిగణింపబడు జనులు తమ తమ విధి నిషేధములను, ఆచారవిశ్వాసములను కలిగియున్నారు; అవి తమకొరకు తామె కాలక్రమమున సృజించుకొనిరి. పరంపరాగతముగ సంక్రమించు పూర్వార్జితము సంఘ మండలి ప్రతిసభ్యుడు భుక్తము చేసికొనుచున్నాడు. ఆచారవ్యవహారముల చట్టమె యొక సంఘమును తదితర సంఘములనుండి వేరుచేయును. నిజముగా వర్ణసంస్థ యొక విధమగు నాచారమె.* మనకు పరుల యాచార విశ్వాసములు అనాగరికములుగను దోషయుతములుగను గాన్పించును; కాని యే యాచారవిశ్వాసముల నవలంబించు సంఘమైనను తనయందు శాంతి గలిగి యన్యసంఘములతో సఖ్యత బడసి జీవించుటకు నవి సాయపడు నని యెల్ల రంగీకరింప దగును. ప్రతివ్యక్తికి తన వర్ణములోనె వివాహమాడుట సాంఘికముగ గౌరవనీయము. "నిమ్న" జాతి స్త్రీ తన వర్ణమునకు వెలుపల, "ఉచ్చతర" మగు వర్ణమునుండి యయినను, ఒకరిని వివాహ మాడ నిరాకరించును.

వర్ణవిషయక హిందూసిద్ధాంతము పురుషులును

* న కులమ్ కులమ్ ఇతి ఆహు రాచారమ్ కుల ముచ్యతే.

స్త్రీలును విచ్చలవిడిగ కలియుట నామోదింపక పోయి నను, చాలవరకు స్వతంత్రముగ భిన్నవర్ణస్థులు వివాహితులై బిడ్డలు కనుట యాచారమై యుండెను; జాతుల ప్రధాన భేదములు మార్పు నొందెను. ఏమాత్ర మన్యజాతి సంపర్కము లేని సజాతీయసంఘములు ఆదిమనివాసులగు అనాగరికజనులందే కనబడును; అభివృద్ధి జెందుటకు పాటుపడు జనులలో కనబడవు. హిందూజాతిలోనికి విజాతీయుల రక్తము తరచుగ ప్రసరించుచునె వచ్చినది; హిందువులయందు సయితము రక్తము బ్రాహ్మణుల నుండి ఛండాలురవరకు క్రమక్రమముగ వ్యాపించినది. స్త్రీపురుషసంయోగము హద్దు లేకుండ జరగుటకు ప్రోత్సాహ మీయబడకున్నను, అనులోమప్రతిలోమ వివాహవిధానములద్వారమున వర్ణాంతరదాంపత్యములు నిబద్ధము చేయబడెను. మనువు సవర్ణస్థుల వివాహములె యోగ్యము లని ప్రతిపాదించుచున్నను, "నిమ్నతర" జాతులస్త్రీలతో పురుషులు చేసికొను వివాహములయెడ, అనగా అనులోమవివాహములయెడ, సహనము చూపుచున్నాడు. ఆయన ప్రతిలోమవివాహములను, అనగా "ఉచ్చతర" వర్ణముల స్త్రీలకు నిమ్నతరవర్ణస్థులగు పురుషులతో జరుగు వివాహములను, సమర్థింపక పోయి

నను, అట్టి వివాహములవలన జనించిన వివిధసంతతులను వివరించి యున్నాడు. సక్రమము లని యెన్నబడకున్నను, అవి వ్యాపించియుండె ననుటకు సందేహము లేదు. ఆచారముచే గాని శాస్త్రముచే గాని నిషేధింపబడియో యామోదింపబడకయో, తరువాత కొంత కాలమునకు మన్నింపబడిన వివాహములవలన ప్రథమమున నుద్భవిల్లిన జనుల స్థితిని క్రమపరచుటకు మిశ్రమవర్ణము లేర్పరుపబడెను. "అస్పృశ్యులు" అని నేడు పరిగణింపబడు కొన్ని సంఘములు నీమవిరుద్ధమగు దాంపత్యమువలన జనించిన వట.

ఈ విషయమునుగూర్చి ముచ్చటించు నప్పుడు, అన్ని విధములగు వర్ణాంతరదాంపత్యములు అనర్థదాయకము లని హిందూవిధానము ఖండింప లేదని చెప్పవలసియున్నది. భిన్నసంఘములు రమారమిగ సమస్థితియం దుండినప్పుడు, వానియందు వివాహబాంధవ్యములు ప్రబలుట యత్యంతప్రయోజనకరములె గదా! యూరేషియనుల శోచనీయమగు దృష్టాంతము తరచుగ నుదాహరింపబడును; కాని హిందూ, పాశ్చాత్య సంఘములు రెండును విశేషముగ భేదించి యుండుట తటస్థించినది. అంతియ గాక, యూరేషియనుల జననపోషణము

లకు గల పరిస్థితులు ఉత్తమజనులకు సయితము అరిష్టదాయకములు. హిందూస్త్రీని దుర్నీతిలో ప్రవేశపెట్టిన శ్వేతముఖుడు సంతానము కలిగినతోడనే దాదాపుగ నెల్లప్పుడామెను విడనాడును. వ్యభిచారఫలితముగ ప్రపంచములోనికి వచ్చిన బిడ్డ సరియయిన పోషణము లేకయు మిక్కిలి నీచముగ చూడబడియు నెంతయో హేయములగు పరిస్థితులందు సామాన్యముగ పెరుగును. వంశపరంపరాగతప్రకృతియె గాక పరివేష్టించియుండు నావరణము గూడ జీవితమును నడపును గదా !

అయినను సవర్ణవివాహవిషయక సిద్ధాంతము హేతుశూన్యము గాదు. సవర్ణవివాహములు మాత్రమె యోగ్యము లని చెప్పవలసి నంతగ వంశపరంపరాగత ప్రకృతి బలీయ మయినదో కాదో నిశ్చయించుట కష్టము. స్వభావము, పోషణము—వీనిలో నేది ప్రధాన మను ప్రశ్న మిప్పటికిని తీవ్రముగ చర్చింపబడుచున్నది. కులీనత గాని వంశపరంపరాగతమైన యితర సల్లక్షణము గాని యున్నతజాతుల యాధిక్యతకు కారణము గాదని మానవసమత్వవాదులకు దృఢాభిప్రాయము కలదు. అయినను హిందువుల యభిప్రాయమును ప్రాచీనగ్రీకుల యనుభవము, నవీనవిజ్ఞాన

శాస్త్రము బలపరచుచున్నవి. పరంపరాగతముగ మానవగుణస్వభావములు తరతరములకు సంక్రమించు నని విశ్వసించి గ్రీకులు నికృష్టులను నాశము జేయుచు నుత్కృష్టుల సంఖ్య పెంపొందించుచు మానవజాత్యభివృద్ధికయి కృషి సలుపవలె నను సిద్ధాంతమును నిజముగనె ప్రతిపాదించిరి. క్రీస్తునకు పూర్వము ఆరవశతాబ్దమున నతిప్రాచీనకాలముననె గ్రీకు కవీశ్వరుడు—మెగరావాస్తవ్యుడగు తియోగ్నిస్ (Theognis)—ఈ విధముగ వ్రాసెను: "మనము మేలయిన పొట్టేళ్ళకొరకు, ఖరములకొరకు, అశ్వములకొరకు వెతకుదుము. వానిలో శ్రేష్ఠమయినవి శ్రేష్ఠమయిన వానిని జనింపజేయు ననియెల్లరు నమ్ముదురు. కాని యుత్తమపురుషుడు దుష్టురాలగు, అధమాధముని పుత్రికను వివాహ మాడుటకు జంకడు. ఉత్తములు నీచులతో బాంధవ్యము కలుపుకొనుచున్నారు కాన, మన జాతిలోని జనులు కలుషాత్ములగుచున్నందులకు నాశ్చర్యపడవలదు." జంతువులలో శ్రేష్ఠములయిన వాని నేరి జతపరచు పద్ధతియె మానవజాత్యభివృద్ధికిని ప్రశస్తమగు పద్ధతి యని ప్లేటో (Plato) యభిప్రాయపడె నని మన కందరకు దెలియును. ఉత్తమజాతీయుల సంఖ్య వర్ధిల్లుటకు వలసిన ప్రోత్సాహము

ప్రభుత్వ మీాయవలయు నని (Aristotle) అరిస్టాటలు కూడ విశ్వసించెను. స్వభావసిద్ధముగ సర్వమానవులు సమాను లని పదునెనిమిదవ శతాబ్దమునం దంతకంతకు దృఢతరముగ వాదింపబడుచున్నది. అమెరికా, ఫ్రాన్సు దేశముల స్వాతంత్ర్యప్రకటనములకు కారణభూతులైన రూసో (Rousseau) లాకి (Locke) మహానీయు లభిప్రాయపడినట్లు, మెత్తటిమన్నువలె మనుష్యులు బాహ్యపరిస్థితులమూలమున పరివర్తనము జెందుదు రని బకుల్ (Buckle) కూడ నభిప్రాయపడెను. అయినను బాహ్య పరిస్థితులకు గల శక్తి నున్నదానికంటె నెక్కువచేసి యీ యభిప్రాయము చెప్పుచున్న దని నవీనవిజ్ఞానశాస్త్రము తెలుపుచున్నది. కేవల బాహ్యపరిస్థితుల మార్పుమీాద నభ్యున్నతి యాధారపడి యుండదు. వంశపరంపరాగత ప్రకృతి నాధారము జేసికొని పరిణామక్రమము జరుగుచుండు నని డార్విన్ (Darwin) చేసిన బోధను గాల్టన్ (Galton), విస్మాన్ (Weismann) డిఫ్రీసు (De Vries) లవంటి యితరజంతుశాస్త్రజ్ఞులు చేపట్టిరి. మానవ సంతానవిషయక శాస్త్రము ఒక విధముగ దృఢములును, సుస్థిరములు నయిన పునాదులపై నేడు స్థాపితమై యున్నది. జీవాణువును జాగ్రత్తగ వేరుపరచి

యెట్టి బాహ్యప్రేరణమునకు లోనుగాకుండ కాపాడుట మూలమున, దాని యద్భుతశక్తి వెల్లడియయ్యెను. ఆ స్థితిలో నది దానికి ముందుగనె నిర్ణీతమైయున్న మార్గమును విడువక యనుసరించును. ఆటంకపరుపబడినప్పుడు నయితము, నిరోధమును తొలగించుకొని తిరిగి దాని సహజమార్గమున చరించును. మనశరీరములోని ప్రతి జీవాణువునందు చిన్న రక్తకణములు గలవు. అవియె క్రియకు మన జీవనగతిని, మన ఎత్తును బరువును రూపమును రంగును నరముల నిర్మాణమును ప్రాణశక్తిని స్వభావమును జ్ఞానమును నిర్ణయించును. మన శరీరమందలి ప్రతిజీవాణువులోని రక్తకణములలో సగము తండ్రి నుండియు సగము తల్లినుండియు వచ్చును. అవి మనకు మన తల్లిదండ్రులగుణములను భద్రముగ నందజేయును. ఎట్టి బుద్ధిమాంద్యము గాని మనోవైకల్యము గాని, మన తల్లిదండ్రులకు గాని, పితామహులకు గాని, ప్రపితామహులకు గాని యుండినయెడల, అది మనకును మన బిడ్డలకును మన మనుమలకును సంక్రమించును. అదృష్టవశమున, హిందూతత్త్వజ్ఞులు, ఊహించియో స్వానుభవమునుబట్టియో, వంశపరంపరాగతప్రకృతి కలదని తెలిసికొని దాదాపుగ నాకే మాదిరిగ నుండి

యొకే స్వభావము గలవారిలో వివాహసంబంధము లేర్పడుటకు ప్రోత్సహించిరి. ఉత్తమకుటుంబములోని వ్యక్తి నీచకుటుంబములోని వ్యక్తిని వివాహమాడిన యెడల, ఒకరి వంశపరంపరాగత సత్స్వభావము మరొకరి వంశపరంపరాగత దుష్టస్వభావముచే భ్రష్ట మగును. తన్మూలమున ఆ దంపతులకు జనించిన బిడ్డకు మహానష్టము జీవనప్రారంభముననె కలుగును. తల్లిదండ్రులు దాదాపుగ నొకే శ్రేణికి జెందిన వారైనయెడల, వారి బిడ్డయు జీవితవైఖరియందు వారితో సమానముగ నుండును.* రక్తమునకు గల ప్రభావము కనబడియె

* మార్టిన్ కల్లకాక్ అను నాతనిని గురించిన చిత్రమయిన వృత్తాంత మిటీవల Popular Science Siftings పత్రిక యందు ప్రచురింపబడెను: "మార్టిన్ కల్లకాక్ విప్లవయుద్ధమునందు పాల్గొనిన యొక యౌవనసైనికుడు. అతనిది యుత్తమవంశము. కాని యుద్ధసమయమున ప్రబలిన విపరీతసాంఘికపరిస్థితులనుబట్టియు సర్వసామాన్యమగు మర్త్యలనిబట్టియు తాను శ్రేష్ఠకులీనుడను విషయము నాతడు విస్మరించెను. మందబుద్ధిగల యొక సుందరాంగిని గూడెను. తత్ఫలితముగ నొక మందబుద్ధిగల బాలుడు జన్మించెను. ఈ బాలుడు పెరిగి యొక హీనకులీనురాలిని వివాహమాడెను. వారు అధిక సంతానము బడసిరి. ఈ బిడ్డలు తిరిగి తమ్ముబోలిన హీనజన్ములను పెండ్లి చేసికొనిరి. ఆశాఖ యటుల నాయతరములవరకు వృద్ధిజెందెను. చిరకాలము క్రిందటి యాదుర్దినము మొదలుకొని యిప్పటి

తీరును. కేవలబాహ్యాపరిస్థితుల సాహాయ్యముతో, సాధారణ బుద్ధికౌశలమునుండి యసాధారణధీశక్తిని, స్వభావసిద్ధమయియున్న బుద్ధిమాంద్యతనుండి సూక్ష్మబుద్ధిని, వెలువడజేయ మనకు సాధ్యము గాదు.

అయినను దీనినిబట్టి, స్వభావమె సర్వము, పోషణము నిరుపయోగము, అని తలంప జనదు. ఎట్టి పోషణాముండవలెనో సంఘమును సంఘస్థితినిబట్టి నిర్ణయింపబడ

---

వరకు మార్టిన్ కల్లికాక్ తోడను అనామకురాలైన యీ బాలిక తోడను తమ వంశసంబంధమును వెలుపుకొనువారు 480 మంది యుద్భవిల్లి ప్రపంచ జనసంఖ్యను పెంచిరి. వీరిలో 143 గురు మందబుద్ధి గలవారు, 33 గురు దుర్నీతిపరులు, 36 గురు సక్రమ వివాహము చేసికొననివార లుద్భవిల్లినవారు, 3 గురు మూర్ఛవ్యాధి పీడితులు, 3 గురు పరుల బాధించువారు, 8 మంది వ్యభిచారగృహ యజమానులు. ఆ మొదటి మార్టిన్ ఈ ఘోరనీచ సంతతికి కారకుడైన తరువాత, గొప్ప ధీశక్తులు గల యొక క్వేకరు యువతిని వివాహమాడెను. ఈ సంయోగము వలని సంతతి 496 మంది. వారిలో పలువురు రాష్ట్రపాలకులు, సైనికులు, వైద్యులు, న్యాయవాదులు, న్యాయాధిపతులు, అధ్యాపకులు, భూస్వాములు, సత్పౌరులు, సాంఘికజీవనము యొక్క ప్రతివృత్తియందు ఘనతజెంది శ్లాఘనీయులై యుండిన తల్లిదండ్రులు గలరు. ఒకడు ఒక మహావిశ్వవిద్యాలయ సంస్థాపకుడు. ఈ సంతతిలోని యిప్పటి చివరివాడు సమస్తైశ్వర్యములతో తులతూగుచు మంచిపలుకుబడి కలిగియున్నాడు.

వలెను. హిందువులు వర్ణభేదమును చక్కగ పాటించు చుండి నంతవరకు, స్వభావమును పోషణమును కలసి పరస్పరము సాయపడుచుండెడివి. వంశపరంపరాగతమగు సాంఘికప్రకృతి యనునది కలదు. ఒక తరముతరువాత మరియొక తరమువారు సంఘమునందు సంచితమగుచుండు శారీరక మానసిక లక్షణములను తమ బుద్ధిపూర్వక కృషిద్వారమున బడయుచుందురు.

సాంఘికక్రమజీవనము స్వయంవినాశము జెందక వర్ధిల్లవలె నని మనము గోరినయెడల, వివాహసంబంధముల విషయమున కొన్ని హద్దులను కల్పించుట యావశ్యకము. వివాహములు తప్పక యేకవర్ణస్థులలోనె జరుగవలె ననుట గాదు; కాని దాదాపుగ సమానమైన నాగరికస్థితియు నైతికోన్నతియు బడసిన వారిలో జరుగవలయును. ఏలయన, వర్ణములు కూడ భ్రష్టత్వము జెందును. జనకుని వృత్తి పుత్రుడు తప్పక యనుసరింపవలె నని విధింపబడుటచేత, జ్ఞానాధికులయిన వ్యక్తులు సంఘజీవనము నతిక్రమించి యున్నతముగ పెరుగుటకును, జ్ఞానహీనులైన వ్యక్తులు తమ శక్తులకు దగినట్లు గడపగలిగిన నిమ్నతరజీవనములో ప్రవేశించుటకును ఏ వర్ణము ననుమతి నియ్యదు. ప్రస్తుత మున్నరీతిని, వర్ణ

సంస్థ ఉన్నతశక్తులతో జన్మించి స్వసంఘము లందిముడ
జాలని వారికిని హీనశక్తులతో జన్మించినవారలకును
దారి చూపుట లేదు. విద్యాశిక్షణమువలనను, నీతి
ప్రబోధముమూలముననుు, జ్ఞానహీనులను అధములను
జ్ఞానవంతులుగను ఉత్తములుగను జేయుటకు సర్వవిధ
ముల ప్రయత్నము జరుగవలెను; కాని వివేచనాశూన్య
ముగ వివాహములు జరుగుట సదా వాంఛనీయము
గాదు.

గొప్ప జాతీయసంక్షోభములను కలిగింపకుండ,
క్రమాగతమగు జాతీయసామరస్యమును హిందూధర్మము
నెలకొల్పెను. వర్ణసంస్థ గావించు సమ్మేళనము వివిధ
జాతీయుల నేకము జేయుటతో ప్రారంభ మయ్యెను.
హిందూధర్మముచేత నింకను స్వీకరింపబడని యనేక
జడారాధకు లుండుట వాస్తవము. హిందూదేశము
స్వాతంత్ర్యము గోల్పోవుటతో, అన్యజాతులను స్వీకరించి
సంస్కరించు కార్యము ఆగినది; కాని యిప్పుడు
హిందూనాయకు లా కార్యమునెడ తమకుగల బాధ్య
తను మెల్లగా గుర్తించుచున్నారు.

బాహ్యమునుండి హిందూధర్మమును ప్రతిఘటిం
చుచున్న జాతులకు అది కనపరచిన మార్గమె వర్ణసంస్థ.

తనలోనికి గైకొనిన భిన్నజాతులను నాగరికత నొందించుటకు హిందూధర్మ మవలంబించిన సాధనమె వర్ణసంస్థ. ఏ విధముగనయిన నొక ప్రత్యేకజీవనము గడపు జనులు ఒక వర్గముగ నేర్పరుపబడుదురు. ఒక సంఘము క్రొత్త మాదిరి జీవనమును వ్యక్తపరచినప్పు డెల్లను, ఒక వర్ణము బయల్వెడలును. మాతృధర్మమునకు భిన్నమగు నొక నూతనభావము దాని గర్భమునుండి జనించి పెంపొంది క్రొత్తవిధమగు జీవనము నుద్భవింప జేసినచో, ఒక నూతనవర్గ మేర్పడును. సహేతుకముగ విభజన చేయగలిగి నన్ని తెగలుగ జనులను హిందూసంఘము విభజించి వేర్వేరుగ నుంచినది. ఎప్పుడు క్రొత్త తెగలు బయలుదేరినను, వానిని స్వీకరించుటకు సిద్ధముగ నుండును. సృష్టి నిర్మాణరహస్యమున కనుగుణముగ, అనగా నేకమునం దనేకముగను, సామరస్యముతో విభిన్నముగను, క్రమపద్ధతిని వివిధముగను, ఉండుట కది యత్నించును.

నేడు అనేకసుప్రసిద్ధ గ్రంథకర్తలు ప్రపంచజాతుల మహాసంగ్రామము జరుగనున్నది గావున జాగరిల్లు డని మనకు తెలుపుచున్నారు. ప్రతిజాతి తనకు ప్రత్యేక వ్యక్తిత్వము కలదను జ్ఞానము పొంది, దాని వృద్ధి

నొందించుట మన ప్రకృతకాలమున గానవచ్చుచున్న గొప్పమార్పు. నల్లజాతులు ప్రపంచ పరిపాలనములో భాగస్వాము లగుట కాందోళనము సలుపుచున్నారు. రాజకీయముగ పరాధీనములై యున్న జాతులు రాజకీయ స్వాతంత్ర్యమును గోరుచున్నారు. వలస నిముత్తము జనులను పంపునట్టి దేశములకును, వారు ప్రవేశించునట్టి దేశములకును నడుమ సంఘర్షణ మతితీవ్రముగ నున్నది. బలహీనులును అజ్ఞానులును సోమరులు నగు జనులతో గూడియున్న జాతులను నాశము నొందించినప్పుడు గాని, వశపరచుకొనినప్పుడు గాని, ఈ పద్ధతిని సమర్థించుటకై, పొలములు బీడు పడియుండుటకును, ఖనిజములు త్రవ్వి తీయబడక యుండుటకును ప్రపంచమందు సాధ్యపడదు కావున అడవిజాతులును ఆదిమనివాసులును తమ నివాసస్థలమున కదల్పబడకుండ వసించుట కాసింప జనదనియు, సారవంతములయిన భూముల నాక్రమింప తటస్థించినవారు వానిని వృద్ధి నొందింప లేనంతటి బలహీనులును అలసులు నయిన యెడల, వారిని తొలగించి యా బంజరు భూములను ఫలవంతము జేయగల జనులు వానిని వశపరచుకొనుట యవసరమును న్యాయము ననియు కారణముగ చెప్పబడుచున్నది. మానవులు ప్రపంచమున వివిధ

ప్రాంతములకు సంచారము చేయుట తటస్థించుచుండును గదా! అట్టివారిలో నొక సంఘమువారు రత్నఖని యొక్క గాని, నూనెబావియొక్క గాని యుపయోగ మెరుగకయు, తమ సంచారములలో నెచట నివాస మేర్పరచు కొందురో యచట భూగర్భమున నవి యున్న వని కూడ నెరుగకయు నున్నస్థితిలో, వారి నివాసమె వారవి తమ యజమాన్యమున నుంచుకొనుటకు పూర్తి యగు హక్కు కలిగింపదు. ఏదేశమును ఆ దేశస్థులకె జెందియుండదు. ప్రపంచముయొక్క యక్కరలు విచారించుట ప్రధానము. ఈ వాదము ప్రస్తుత పరిస్థితులలో తగదు. జనసమ్మర్దమువలన నొక దేశస్థులు తమ దేశమునుండి పరదేశములకు వృత్తినిమిత్తము వెళ్లి నప్పుడును, తమ ఖనిజ సంపద నుపయోగమునకు దెచ్చుట కయి తెలివిగల పనివాండ్రు కావలయు నని గోరునట్టియు కొలది జనసంఖ్య గలిగినట్టియు విశాల దేశము లున్నప్పుడును, అట్టి వ్యత్యాసముల సరిపెట్టు నేర్పాటులకు సమ్మతి నొసంగబడుట లేదు. అమెరికా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మొదలయినవి నల్లజాతులు ప్రవేశించుటకు నిషేధింపబడిన దేశములు. లాటిన్ అమెరికాలోని జనులు బహుస్వల్ప సంఖ్యాకులు. అది ప్రస్తుత సంఖ్యకు

పదిరెట్లధిక సంఖ్యగల జనులకు సులభముగ నాశ్రయము కాగలదు; ఫలసాయము మితిలేకుండ వృద్ధి నొందించు కొనగలదని చెప్పవచ్చును. జనసంఖ్యకొరకు తపించు నట్టియు, జనులతో నిండి నిబిడీకృత మయినట్టియు ప్రదేశములు గలవు; కాని జాత్యహంకారమును అధికార వాంఛయు ఆదర్శప్రాయమైన న్యాయమునకు, ఆర్థిక మయిన యక్కరకు సంబంధించిన యన్ని విచారణల నణగ ద్రొక్కుచున్నది. జాతీయ సమస్యను సులభముగ పరిష్కరించుటకు నడ్డుగనున్న వాస్తవములయిన వివిధ కష్టములను గూర్చి చర్చించుటకు నే నిప్పుడు తలపెట్ట లేదు. అవి గొప్పవే; కాని పృథివి యేకమహాకుటుంబ మను జ్ఞానము కలిగి యా సత్యమును మన సర్వసంబంధ బాంధవ్యములందు వ్యక్తపరచుటకై ప్రయత్నించుట మూలముననె యవి పరిష్కరింప బడగలవు. తమ ప్రత్యేక స్వభావములను నిలుపుకొని, తమలో నేది శ్రేష్ఠతమ ముగ నుండునో దానిని పెంపొందించు కొనుచున్నను, పరస్పరము మిళిత మగుటకు పూనుకొను వివిధ జాతులకు నిలయముగ ప్రపంచమును మార్చుటకై మనము పాటు పడవలెను.

హిందూమతచరిత్రమునందు ప్రథమముననే యే

వివిధాంతస్థులుగ హిందూసంఘము రూపముజెందెనో, ఆ యంతస్థులను వర్ణభేదము తెలుపుచువచ్చెను. ప్రతి వర్ణముయొక్క జీవనక్రమమును నడపునవియై యిప్పటికిని దుర్లంఘనీయములుగ నున్న నియమములలో, జాతుల యాచారములకు సంబంధించినట్టియు జాతులను వేర్వేరుగ నుంచునట్టియు ప్రాచీనమయిన కట్టుబాటు నిలచి యుండుటకు కారణము, జాతిభేదములను వృత్తిభేదములను విచక్షణచేయక పోవుటయె. సాంఘికముగ, వర్ణసంస్థ మానవనిర్మాణకౌశలమువలన నేర్పడినదె; ఈశ్వరనిర్ణయమునకు సంబంధించిన యద్భుతాంశమం దేమియు లేదు. వాస్తవములైన భేదములను ఆదర్శమైన యైక్యతను దృష్టియం దుంచుకొని సంఘమును క్రమపద్ధతికి దెచ్చు మానవకృషియె దానిమూలమున జరుగుచున్నది. దానినిగురించి పురుషసూక్తమునందు మొట్టమొదట ముచ్చటింపబడెను. అందులో వివిధసంఘాంతర్భాగములు పరమపురుషుని యంగములుగ వర్ణింపబడెను. హిందూసంఘము సంపూర్ణశరీరమువంటిది. దాని వివిధ భాగములు స్వాభావికముగ పరస్పరాధీనములు. ప్రతి భాగము తన ప్రత్యేకకార్యమును నిర్వర్తించుచు తన్మూలమున ఇతరభాగములు తమ కార్యములు నిర్వర్తించు

టకు సాయపడును. అట్లే యితరభాగములు తమ కార్యముల నిర్వహించుచు తనస్థాలమున దాని నటిసితియందుంచుటకు తోడ్పడును. ఈ యర్థమునందు, ప్రతిభాగము యావత్సంఘమున కవసర మగుచు యావత్సంఘము ప్రతిభాగములో నంతర్నిహితమై యుండును. సంఘము యొక్క యక్కరలను దీర్చునిమిత్తము పాటుపడు కొన్ని తెగలు ప్రతిసంఘములోను గలవు. వేర్వేరు తెగలు ఒక సమానోద్దేశము నెరవేర్చుటకు పాటుపడు నప్పుడు, అవి యేకీభావముచేతను సాంఘికస్వాతంత్ర్యముచేతను నడుపబడును. జ్ఞానవంతులై యాధ్యాత్మికధర్మసాధన సలుపువారు, యుద్ధకుశలులై రాజకీయకార్యముల నిర్వహించువారు, ఆర్థికవ్యాపారముల నడపువారు, విద్యాశూన్యులై సేవకావృత్తిలో నుండువారు, వర్ణసంస్థలోని చతుర్విధములయిన తెగలకు జెందియున్నారు. మానవజీవనము నందలి భిన్నకార్యములు స్పష్టముగ వేరుపరుప నలవి కానివి. అవి ప్రత్యేకములును పరస్పరసహకారములునయి యున్న వని గుర్తింపబడెను. ప్రతివర్ణము తాను సంఘము కొరకు నిర్వహించు ధర్మమును ఆచరణమును కలిగి సొంత శాసనస్మృతిని సంప్రదాయమును నిర్మించుకొనును; అది యాహారవిహారములకు సంబంధించినకొన్ని యాచారముల

పాటించుచు సంప్రదాయసిద్ధమయిన స్వపరిపాలనముతో జీవించు సన్నిహితబంధువర్గము. ప్రతివర్ణము ఇతరుల జోక్యము లేకుండ తన యుద్దేశముల నెరవేర్పుటకు స్వాతంత్ర్యము కలిగియున్నది. వివిధవర్ణముల కార్యములు యావత్సంఘశ్రేయమునకు సమముగ ముఖ్యములె యని పరిగణింపబడెను. ఉపాధ్యాయుని గభీరతయు, సైనికుని పరాక్రమమును, వర్తకుని న్యాయశీలమును, సేవకుని శక్తిసహనములును సంఘాభివృద్ధికి తోడ్పడును. మరియు వానిలో నొక్కొక్కటియు ప్రత్యేకముగ ఉత్తమస్థితి జెందును.

వర్ణనియమములు సంఘమునందలి వేర్వేరు తెగలకు సఖ్యతను సమకూర్చును. ఆధ్యాత్మికాదర్శములను వృద్ధి నొందించి వ్యాపింపజేయుటకై స్వాతంత్ర్యమును విరామమును బ్రాహ్మణుల కీయబడెను. ఇతరులు వారికి పారితోషికము లియ్యవలయు నని ప్రోత్సహింపబడుటయె గాక శాసింపబడిరి. అందువలన బ్రాహ్మణులకు తమ పోషణభారము తొలగినది. వారు స్వప్రయోజనపరత్వమునకును ద్వేషమునకును లోనుగాక విశాలనిష్పాక్షికదృష్టిని కలిగియుండి రని ప్రతీతి గలదు. ప్రభుత్వము బ్రాహ్మణుల సలహాలను గైకొనినను, వారు ప్రభుత్వ

భృత్యులు గారు. పాలకవర్గము సంఘములోని తెగలలో నొకటియై, దాని నిర్మాణక్రమమునుబట్టి యుద్ధనైపుణ్యము బడయుటకు ప్రధానముగ ప్రయత్నించును. దాని ప్రత్యేకమగు పని శాంతిక్రమముల కాపాడి వేర్వేరు తెగలు స్నేహముతో పాటుపడునట్లును వర్ణవృత్తులు తారుమారు గాకుండునట్లును చూచుట. ప్రజల యుత్తమప్రయోజనములను ఫలసిద్ధి నొందించుటకు పాటుపడు కార్యనిర్వాహకవర్గమె ప్రభుత్వము. బ్రాహ్మణులు ప్రభుత్వమంత్రు లయి సంఘమునకు యథార్థముగ శ్రేయోదాయకములగు విషయములను తెలుపుదురు.

సంఘములోని రాజకీయార్థికజీవనము ఆధ్యాత్మిక జీవనముచే పురిగొల్పబడవలె నని హిందువుల యాశయము. అందువలన, ప్రభుత్వము కేవలము సైనికుల నిరంకుశపరిపాలనము గాకుండ రక్షింపబడినది. ఉన్నతాధికారము పరిపాలకవర్గముయొక్క లాభములను ప్రయోజనములను గాక మొత్తముమీద జనులకు గల యక్కరలను దీర్చుటకు సాయపడెను. ఎల్లరి క్షేమమును సమకూర్చి ప్రజాజీవనము ఆనందభరితముగ జేయు సంస్థలకు ఆధారభూతము ధర్మము; అటులనె రాజ్యాంగము

శ్రేష్ఠతమజీవనము పెంపొందింపగల పరిస్థితులు జనులందరకు లభ్యము జేయు నుపకరణము. ప్రభుత్వమునందు వర్తకసంఘములకును కుటుంబములకును తదితరసంస్థలకును జోక్యము లేదు. వానికి తమ వ్యవహారముల నిర్వహించుకొనుటకు స్వాతంత్ర్య మొసంగబడెను. కళలకును విజ్ఞానమునకును మతమునకును వలసిన శాంతి స్వేచ్ఛల నొసంగు బాహ్యాపరిస్థితులను ప్రభుత్వము సమకూర్చెనె గాని, అది వాని స్వవిషయములలో కల్పించుకొనలేదు. నే డన్ననో, ప్రభుత్వకార్యములు నిజముగ మితిమీరి దాదాపుగ యావత్సంఘజీవనమందు విస్తరించినవి.

అహింసా సిద్ధాంతమునకు బద్ధమైయున్నను, హిందూసంఘము శరీరబలప్రయోగమునకు జీవితముల నర్పించుకొన్న యొక తెగకు తా వొసంగెను. ఇప్పు డున్నట్లె మానవ స్వభావ ముండునంత కాలము, సంఘముచ్ఛ్రతమస్థితికి రానంత కాలము, దేహబలప్రయోగము మన కవసరము. సకలశాంతి క్రమములకు విరోధులయిన వ్యక్తులు సంఘమునం దున్నంత కాలము, సంఘము విప్లవకారుల నణచుటకు నిరోధమార్గముల నారయుచుండవలెను. సంఘస్వరూపము యుద్ధముచేత గాని

యంతఃకలహాములచేత గాని వైకల్యము జెందినప్పుడు, సర్వవిప్లవశక్తులు తిరుగుబాటు నిమిత్త మేకమగును. తొమ్మిది రోజులవరకు గ్రేటుబ్రిటనులో పనివాండ్రెల్లరు జరపిన సమ్మెవలన అత్యల్పముగనె దుండగములును నేరములును సంఘటిల్లి యుండుట, అచ్చటి సంఘము ఇతర దేశసంఘములకంటె నన్ని శాఖలయందు నెంత దృఢతరమై యున్నదో తెలిసికొనుటకు ప్రబల నిదర్శనము.

వైశ్యులు, అనగా ఆర్థికసంఘము, అత్యాశ నణచుకొని ధనమునకు సంబంధించిన నైతికబాధ్యతలు గమనింపవలయు నని గోరబడుచున్నారు. ధనము సేవాసాధనముగ భావింపబడును. పూర్వ సుదినములలో ధనవంతుడు తన ధనము సంఘమునిమిత్త ముపయోగించుటకై తన కప్పగింపబడిన సొత్తుగా నెంచి విద్యాదానము, వైద్యసాహాయ్యము, తటాకాది నిర్మాణము, సంఘవినోదకరసంస్థా ప్రతిష్ఠాపనము మున్నగు ధర్మకార్యములకై వినియోగించెను. దురదృష్టవశమున, ప్రస్తుతము దాదాపుగ ప్రపంచములోని యన్ని భాగములందు ద్రవ్యార్జనమునకై కృషి యత్యధికముగ నున్నది; బహుజనులు దాని భారమున నలుగుచున్నారు. ధనతృష్ణ సంఘజీవనమును పీల్చి పిప్పిచేయుచు ఆత్మశక్తిని అణగ ద్రొక్కుచున్నది.

ధనము స్వసౌఖ్య నిమగ్నతకు సాధన మయ్యెను; ప్రపంచములో కానవగు నమిత నీచత్వమునకును క్రూరత్వమునకును అందరిలో ప్రబలిన యత్యాశయె కారణము. "ధర్మమును వ్యవహారమును మిలనముచేయుట యన రెండు మంచి వస్తువులను పాడుచేయుటయె." అను నభిప్రాయమును హిందూధర్మ మాదరింపదు. లౌకిక జీవితమునకు శాశ్వతములగు పరమార్థములు గలవు. వానిని తొలగింప గూడదు.

విద్యావిహీనులయిన సేవకులును సేద్యకాండ్రును మిక్కిలి క్రిందిశ్రేణికి జెందియున్నారు. ఈవర్ణములు సాంఘిక శరీరమందు యథార్థములగు నజీవాంగములు. ప్రత్యంగము తనలో కేంద్రీకృతమై యితరాంగములతో కలసి సహకారమున కృషి సలుపును. ఒక క్రొత్త తెగ హిందూసంఘములోనికి తీసికొనబడి నప్పుడు, నాలుగు వర్ణములలో నేదో యొక దానితో నది జతపరుపబడును. బయటనుండి పలు తెగలు క్షత్రియులుగ స్వీకరింపబడెను. జాక్సన్ (jakson) గా రిట్లు వ్రాయుచున్నారు: "అడవి జాతులగు టర్కోమనులు సుప్రసిద్ధ రాజపుత్రులలో గొన్ని రాజవంశములుగ పరివర్తనము నొందింపబడిరి. మధ్య ఆసియాలోని దిమ్మరులను హిందూదేశ మెట్లు

సాధుశీలుర జేసి, నాగరికత నొందించెనో గ్రహించని హిందూదేశస్థులకు తమదేశ ఘనతనుగూర్చి యేమియు తెలియ దనియె చెప్పవచ్చును."*

సాంఘికశాసనము ప్రాణవిహీనమును క్రూరము నగు పోటీపద్ధతిని గాక సామరస్యమును సహాకారమును నెలకొల్పునది యయి యుండవలె నని వర్ణవిధానము విధించును. సంఘము వ్యక్తులొకరితో నొకరు పోటీపడు రంగము కాదు. వర్ణము లొకదానితో నొకటి పోటీ పడుట కనుజ్ఞ నీయుబడదు. ఒక నిర్దిష్టసంఘమున జనిం చిన మనుష్యుడు దాని పద్ధతుల కలవడియుండుటచే నొక నూతన మార్గము ననుసరించుట వాని కమిత కష్టము. ప్రతిమనుష్యుడు తనను స్వధర్మమునకు సన్నద్ధుని జేయు స్వభావము కలిగియుండు నని చెప్పబడును. స్వధర్మమును మార్చుకొనుటకు ప్రోత్సాహ మీయ బడదు. ఒకధర్మమును క్రమముగ నెరవేర్చుట కనువగు స్వభావము మనలోనున్న యెడల, ఆ ధర్మమును ఆకస్మి కముగ త్రైకొనుట మూలమున మన జీవనవ్యక్తిత్వము నకే వినాశము చేకూరును. మన ప్రత్యేక జీవనపద్ధతిని మార్చుటకు గాని సవరణ చేయుటకు గాని మన మభిల

* **Indian Antiquary, January 1911.**

పింప వచ్చును; కాని యట్లు జరిగించుటకు మనము శక్తివంతులము కాము. మన కోరికలకు దగినటుల మన స్వభావమును వేగిరముగ మార్పజాలము. నాలుగు వర్ణములు జ్ఞానాధికులకు, కార్యశూరులకు, భావప్రధానులకు, జ్ఞానము, కార్యము, భావము—వీనిలో నెద్దియు నెక్కువగ వృద్ధి పొందించుకొనని యితరులకు జెందియున్నవి.* ఇవి ప్రధానస్వభావము లయినను వీనిలో దేనికది ప్రత్యేకముగ నుండవనుట నిజము. అన్యసంపర్కమునకును మిశ్రమజాతికిని అవకాశ మిచ్చుచు నవి యనేక విధములయిన మిలనములును కలయికలును జెందును. భగవద్గీతాకారుడు వర్ణవివక్షత ప్రతిమనుజుని గుణాభిరుచులనుబట్టి యేర్పడిన దని నమ్ముచున్నాడు.♦ కర్మము గుణము ననుసరించి యేర్పరుపబడినది. స్వభావసిద్ధములయిన గుణములు క్రమక్రమముగనె మార్చ నగును. ప్రతివ్యక్తియొక్క యభిరుచు లేమైయుండునో మనము నిశ్చయింపజాలము కనుక, వంశ పరంపరాగత స్వభావమును శిక్షణమునుబట్టి యాతని వృత్తి నిర్ణయ

* సత్వగుణో బ్రాహ్మణో వర్ణః క్షత్రియస్తు రజోగుణః
తమోగుణ స్తథా వైశ్యః గుణ సామ్యాత్తు శూద్రతా

♦ iii. 21 ; xvii. 13, 41, 45–6.

మగును. ధర్మములు వంశపరంపరాగతము లే యని తలంపబడినను, అందులకు వ్యతిరేకముగా జరుగుటకును పూర్ణముగ నవకాశ మొసంగబడెను; నిమ్నజాతీయుల నుండి సయితము అగ్రవర్ణములవారు జ్ఞానము బడయ శంకింపరు. జనులందరు, హెచ్చుతగ్గులతో, అన్నిగుణ ములను కలిగియుందురు. బ్రాహ్మణుడు యోధుడగుటకు వలసిన శక్తులను తనయందు కలిగియున్నాడు. ప్రాచీన ఋషులు సేద్యకాండ్రును, కొన్ని సమయములందు యోధులును గూడ నైయుండిరి.

జీవనవృత్తి మానవసేవయే యని చెప్పు వర్ణ సంస్థ, దాని పూర్వసంప్రదాయములను ఆధ్యాత్మిక లక్షణముల ననుసరించి, అతృప్తితోడను కేవలార్థికదృష్టితో డను సలుపబడు నీచదాస్యమును జీవనవృత్తిగ పరిగ ణించు భావమును ఎన్నడును పెంపొందింప లేదు. ప్రతి వృత్తిసంఘమునకు నియమితమయిన యాధ్యాత్మికా దర్శ మేమన, దాని స్వధర్మమును ఉన్నతస్థితి నొందిం చుటయె. కార్మికుడు తన జీవనసాఫల్యమును తన కర్మ మునందును తన కర్మద్వారమునను బడయవలయును. భగవద్గీత నుడువునట్లు, ఒకడు, తన విధికృత్యమును సరి యయిన నిష్కామబుద్ధితో నిర్వర్తించినయెడల, ఉన్నత

స్థితి జెందును. లోతుసముద్రములలో బెస్తలు ఇతరులు భుజించుటకై చేపలు పట్టుచు ప్రతిదినము తమ ప్రాణముల గోల్పోవుటకు సిద్ధపడుదురు గాన, వారి యాధిక్యతను గమనింపు డని మనలను హెచ్చరించుచు మతబోధకుడు విచిత్రధర్మోపదేశమును చేయును. కాని సేవ సేవకుని కెట్లు ప్రయోజనకారియో యాతనికి తెలియకున్నది. ఇతరుల కొరకును ఇతరుల యాహారముకొరకును గాక తమ యాత్మతృప్తినిమిత్తము వారు సముద్రముల కరుగుదురు. వారి శ్రమతోపాటు, ఉద్దేశింపబడకయే, ఇతరుల సౌకర్యము నెరవేరుచున్నది. ప్రతి మనుజుని శ్రేయము సర్వజనులశ్రేయము కూడ నైయుండునట్లు, ప్రపంచ మానందకరముగ నిర్మింపబడినది. కళాభినివేశమును గోల్పోయి పారిశ్రామికజనులు చాల నష్టపడిరి. పూర్వకాలములో కార్మికుడు కొలది రాజకీయస్వాతంత్ర్యములను తక్కువవేతనమును స్వల్పసౌఖ్యమును కలిగియున్నను, వానికి కార్యమునందు ఉత్సాహము కలదు, కావున నెక్కుడు సంతోషముతో నుండెను. వోట్ల నిచ్చు హక్కుగల యిప్పటి కార్మికులు, ప్రాచీనకార్మికు డట్టి హక్కు కలిగియుండ లేదు కావున, వానిని బానిసగ పరిగణింతురు. కాని వృత్తి వాని జీవన

వికాసమె. శిల్పము, కమ్మరము, వడ్రంగము మున్నగు చేతిపనులలో దేనిని గావించు వాడైనను కోమలచిత్తము గలిగియున్న ప్రాయముననె తన వృత్తిరహస్యములు గరపబడి పరస్పరసహకారజీవనము గల మహాసంఘమందు సభ్యుడగును. కళాసౌందర్యమును సృజింపవలయునను నాసక్తి వానిని సదా పురిగొల్పును. తన వృత్తి తనకు విధింపబడుటచే, వాడు దానియందు గర్వము జెందనేరడు. వృత్తి యీ రోజులలో వ్యాపారముగ మారినది ; కార్మికుడు దానినుండి తప్పించుకొనగోరును ; దాని వెలుపల గాన సభలలోను సినీమాలలోను సంతోషమునకై యన్వేషించును. కార్మికజనులు తమ జీవనము సుఖప్రదముచేసికొనుటకు కలిగియుండు ఆటపాటలు పూర్తిగ నవసరములె యయినను, ఐశ్వర్యమె సుఖమని భ్రమించు దోరణి వారిలో దురదృష్టవశమున పెరుగుచున్నది. సంఘోద్ధరణవిషయమున ప్రస్తుతము గల యాదర్శమునందు ప్రాపంచికదృష్టి ప్రాముఖ్యత జెందినది. జీవనవికాసమునకు వాస్తవముగ కొంత సౌఖ్యము గూడ తప్పక యుండవలెను. దానిని కలిగియుండుటకు కార్మికునికి హక్కు గలదు; కాని జీవనవికాసమె సమస్తవృత్తుల యథార్థపరమావధి.

కులకలహములు మనల నీ రోజులలో బాధించు చున్నవి. అనుమానము, ద్వేషము, ఈర్ష్య, మాత్సర్య ము మున్నగు దుర్గుణములతో గూడిన తీవ్రకులాభిమా నము ప్రబలుచున్నది. మనము జీవించిన విధమున మన బిడ్డలును జీవించు నట్లు వారిని పెంచుటకు మనము ఇచ్ఛ గించుట లేదు. జ్ఞానము సంపాదించిన వారెల్లరు అన్ని వృత్తులలో ప్రవేశించుట కవకాశ ముండవలయు నని వాదించుచున్నాము. కొన్ని వృత్తులలో నెక్కువ ద్రవ్య మార్జించుటకు వీలుండుటవలన కలతలు పెరుగుచున్నవి. అందరు ఎక్కుడు లాభకరమగు వృత్తి నవలంబింపగోరు దురు. ధనము దేశీయులెల్లరకు సమముగ పంచిపెట్ట వలె ననెడు మిగుల న్యాయమైన యాశయమును మా త్రమె గాక, జ్ఞానము సయితమందరిలో సమముగనె యుండునట్లు చేయవలె ననెడు తీవ్రవాంఛను గూడ, సమర్థించుటకు మానవసమత్వవాదులు పూనుకొనుచు న్నారు. ఆ ప్రయత్నము ఫలింపనేరదు. నాయకులై మార్గదర్శకులుగ నుండుటకు సమర్థులయినవారు కొంద రును, వారికి విధేయులయి వారి యడుగుజాడల చరించు వారు కొందరును, ఎల్లప్పుడు నుందురు. జ్ఞానమును శీల మును అగ్రస్థానము నాక్రమించుకొనును. ప్రజాప్రభుత్వ

రాజ్యాంగమునందు ఉన్నతాధికారముగల పాలకవర్గ మొకటి యిమిడి యుండును. సర్వమానవులు సమాన శక్తి సామర్థ్యములతో జన్మింతు రనియు, ప్రతిమానవుడు దేశమును పాలించుటకు గాని సేద్యము చేయుటకు గాని సమానముగ నర్హుడై యుండుననియు చెప్పుమాటలలో సత్యము లేదు. వృత్తులవిషయమున జనులకుగల భిన్నాభిరుచుల నణచుట యసాధ్యము. అభివృద్ధికి దోడ్పడు ప్రతివృత్తియు ప్రత్యేకలక్షణము గలిగి యితరవృత్తుల నుండి భిన్నముగనుండును. మన మొకవృత్తి నవలంబింప దలచినయెడల, ఇతరవృత్తులనుండి మన దృష్టిని మరల్పవలెను. మనము హానికరములైన నిర్బంధములను తొలగింపవలెను; సామాన్యజనుల యజ్ఞానమును బాపవలెను; వారి యాత్మగౌరవము పెంపొందింపవలెను; వారు త్తమ జీవనము బడయుటకు సౌకర్యములు కల్పింపవలెను. కాని మహాజ్ఞానికిని జ్ఞానశూన్యునకును గల తారతమ్యమును, శక్తివంతుడైన పాలకునకును వినమ్రుడైన సేవకునకును గల వ్యత్యాసమును రూపుమాపగల మని మనము భ్రమింప గూడదు. నవీనప్రజాప్రభుత్వములు మనలను కేవల "మానవజీవులు"గ జేయుటకు యత్నించును. కాని యట్టి జీవులు ఎచ్చటను గానరారు.

యంత్రసాహాయ్యమున నిర్వహింపబడు పరిశ్రమల మూలమున కలిగెడు ననర్థములు హిందూదేశమునకును త్వరలో ప్రాప్తములు గానున్నవి. యంత్రశాలలందు చేసెడు పనివలన మానవులు యంత్రసమాను లగుదురు; తయారగు వస్తువుతో వారికి నిమిత్తము లేదు; అది వారికి ఆనందము గొలుపదు. అట్టితరి, కృషి శుష్కశ్రమమై యాత్మకు తృప్తి నొసంగదు. జ్ఞానము అక్కర లేకయె జరుగవలసిన పని యంత్రములమూలమున జరుగుటకు సాధ్యముకాని యెడలను, మానవులె దానిని సలుపవలసిన యెడలను, వారది యెంత తక్కువగా చేసిన నంత శ్రేయస్కరము. తన కృషియందు జ్ఞానముపయోగింప నవసరము లేక విసుగు జనించుచున్నకొలదిని, కృషికుడు ఎక్కువ విశ్రాంతి కలిగి తన కృషిని జ్ఞానపూర్వకముగ నిర్వహించుటకు వలసినశక్తి నధికముగ సంపాదించుట యావశ్యకము. సేవయొక్క యాధిక్యత, జీతముల నెక్కువచేయుటవలననే గాక సేవకుల క్షేమము విశేషముగ నారయుటమూలమున, పెంపొందింపవలెను. కళానిపుణుడు గాని రాజ్యతంత్రజ్ఞుడు గాని పొందు ద్రవ్యముకంటె చేతిపనులు చేయువారు అధికమయిన జీతములను బడయవలెను. జ్ఞానము ద్వారమున

జరగు పనులకు ఆ పనులె బహుమతులు. హిందూదేశ
మున ప్రాచీనకాలములో ఆధ్యాత్మికజ్ఞానసంపదను కాపా
డుట యుత్తమకార్యముగ గణింపబడినను, తన్నిమిత్తము
పాటుపడువారు అందరికంటె తక్కువ ద్రవ్యము పొందు
చుండిరి. బ్రాహ్మణునకు రాజకీయాధికారము గాని ప్రాపం
చికైశ్వర్యముగాని లేదు. ఆత్మసంతోషమున కవకాశ
మియ్యని వృత్తియందు ప్రవేశించువాడు అధికాదర
ణము బడయుచుండెను. కావున ఆ పద్ధతియందు కొంత
న్యాయము కలదనియె నా యభిప్రాయము. మానవజీవిత
ములో ముఖ్యముగ గణింపవలసినది, ఆర్థికస్థితి గాదు.
ఒకని ఘనత వాని యార్థికస్థితినిబట్టి నిర్ణయింపజనదు.
జూదగాండ్రగు ప్రభువులు గౌరవజీవనము గడపు కృషి
కులకంటె నధికులు గారు. ద్రవ్యముమీద నెక్కువ దృష్టి
నిలుపుటవలన, శీలము క్రమముగా భ్రష్టత జెందును.
మరియు మన మొక విషయము మరువగూడదు. జాతి
యందలి వ్యక్తులందరు రాజకీయనాయకులయొక్క గాని
సైనికాధికారులయొక్క గాని క్షాత్రవృత్తి నొకదానినె
యనుసరింప జాలరు; అనేకవృత్తులందు ప్రవేశపెట్టబడు
దురు; ఈ వృత్తులు భిన్నములగు అభ్యాసములను అభి
రుచులను జనింపజేయును. ఒక వర్ణమునుండి మరొకవర్ణ

ములోనికి నొక వ్యక్తి పోవచ్చును గాని, అట్టి వ్యక్తులు పలువు రుండజాలరు.

ఒక శతాబ్దముక్రిందట సాంఘికజీవనమునందు వ్యక్తిసర్వప్రాధాన్యత వహించెను. కాని యిప్పుడు వ్యక్తికి అట్టి ప్రాముఖ్యత నీయబడుట లేదనియె చెప్ప వచ్చును. వ్యక్తియు, సంఘమును అంగాంగీసంబంధమున నున్నవని గ్రహించు ఆధ్యాత్మికదృష్టి వలన కలుగు నైతికగుణసంపద యెక్కుడుగ గుర్తింపబడుచున్నది. ఎక్కువ జీతములకొరకును, సౌఖ్యములకొరకును పరస్పరము పోటీపడుచు వర్తకులయొక్కయు, అధ్యాపకుల యొక్కయు, నేతగాండ్రయొక్కయు, న్యాయవాదుల యొక్కయు, సేద్యగాండ్రయొక్కయు, వడ్డీవ్యాపారము చేయువారియొక్కయు వివిధసంఘములు సఖ్యత లేకుండ నొక మహాసమూహముగ కూడినచో, అది సజీవమ యినది యగునా ? భిన్నసంఘస్థులు తమ యంతర్గర్భిత శక్తులను వృద్ధి నొందింప దలచినయెడల, తాము ఒకే మహాసంఘమునకు జెందినవారమను నభిమానమును, కష్టసుఖములయందు ఒకరితోనొకరు కలసి జీవింపవలసిన వారమను ప్రేమభావమును, తమలో పెంపొందించుకొన వలెను. ఈ దృష్టితో చూచిన వర్ణసంస్థ యెంతయో శ్రేష్ఠ

మయినది. వర్ణసంస్థ సంఘము వివిధాంగములు గల శరీరమువంటి దని దృఢముగ విశ్వసించును; ఆర్థికౌన్నత్యమును, తాత్కాలికావసరమును బట్టి వ్యక్తులను గౌరవించు పద్ధతికి బదులుగా వ్యక్తులయొక్క లాభములను కోర్కెలను అతిక్రమించు నుత్తమ జీవనవిధానమును కనపరచును. తోడిజనులను సేవించుట ధర్మముద్వారమున నేర్పడు బాధ్యతయె. దానిని నిరాకరించుట ద్రోహము.

భేదములన్నియు రూపుమాపుటకయి వ్యక్తులందరొకేమాదిరి జీవనము గడపునట్లు చేయుట మానవ సమత్వాదర్శము గాదు. అందరి యాత్మలు సమరూపము దాల్చునట్లు మనము చేయజాలము. అట్లు చేయుట యధికారనిరంకుశత్వమె. స్వభావసిద్ధముగ లభించి శ్రేయోదాయకములై యున్న తమ శక్తిసామర్థ్యములను వృద్ధి నొందించుకొనుటకు మానవసమత్వాదర్శము ఎల్లరకు స్వాతంత్ర్య మొసంగును. ఒక్కొక్క మాదిరి జీవనమునందు ఒక్కొక్క ధార్మికలక్షణము ఇమిడియుండి కాలక్రమమున వికాసము గాంచనున్నదని మనము విశ్వసింతుమేని, ఏమాదిరి జీవనమునయిన వినాశము నొందించుట మూలమున సృష్టిక్రమమునందు కొంత లోపము కలిగించిన వార మగుదుము. ఆత్మ

నుండి వెలువడి యుపయోగకరముగ నుండు ప్రతి జీవనమును మానవసమత్వాదర్శము పోషింపవలెను. సర్వవిధములైన జీవనములు ప్రపంచమునకు సమానముగ ముఖ్యములు. సంఘము సజీవమయిన శరీరము వంటిది. జననమునుబట్టియు, పరమావధినిబట్టియు సంఘస్థులెల్లరు సమానులె. కాని జీవనవికాసములనుబట్టి బహువిధములుగ నున్నారు. అందరు బానిసత్వమున మునిగి యున్నంత కాలము ఏకొలది మందియొ స్వాతంత్ర్యము ననుభవింపజాలరు. "సకల మానవులు జీవనమందలి దుర్గమస్థానములను దాటుదురు గాక, శ్రేయమును పొందుదురు గాక, సద్బుద్ధిని బడయుదురు గాక, సర్వత్రఆనందింతురు గాక!"* ఈ వాక్యములం దుచ్ఛరింపబడినది, నిజమయిన మానవసమత్వాదర్శమె. వర్ణసంస్థ ధనముకొరకు గాని ప్రాపంచికసుఖము కొరకుగాని వ్యక్తులు ప్రయత్నముచేయుటకు ప్రోత్సహించు మానవసమత్వవిధానము గాదు; కాని ఆధ్యాత్మికగుణసంపదకు సంబంధించినంతవరకు మాత్రము వారియందట్టి కృషిని పెంపొందించు సమత్వవిధానమె. ఏలయన, ప్రతిమానవాత్మయందు

* సర్వ స్తరతు దుర్గాణి సర్వో భద్రాణి పశ్యతు
సర్వ స్తత్ బుద్ధి మాప్నోతు సర్వ స్సర్వత్ర నందతు.

సర్వాతీతమయి తారతమ్యములకు తావొసంగని స్వభావము కలదని యది యంగీకరించును; సాంఘికపదవులకు సంబంధించిన సర్వభేదములను పాటింపక సర్వమానవులు సమానులని చాటును. ఆర్థికముగ, హిందువులు సహకారసంఘముగ, అనగా సోదరబృందముగ, నున్నారు. అందలివ్యక్తులు తమ శక్త్యనుసారము ఇతరులకు కొంత సాహాయ్య మొసంగుచు తమ యక్కరలకు దగినటుల నితరులనుండి కొంత గైకొందురు. రాజకీయముగ, వారికి న్యాయచట్టమునందు సమానస్వామ్యములు గలవు. ఈరెండు రాజకీయార్థికపద్ధతులు వారికి యథార్థమగు నాధ్యాత్మికస్వాతంత్ర్యము లభించుటకు సాయపడును. న్యాయసమ్మతమయిన సంఘము ఆధ్యాత్మిక స్వాతంత్ర్యముమీదను, రాజకీయసమత్వము మీదను, ఆర్థికసౌభ్రాత్రముమీదను ప్రతిష్ఠింపబడవలెను.

సాంఘికజీవనమునందు సమర్థులైన ఒక తెగవారు ఇతరులను తప్పక లోబరచుకొందురు. పూర్వము భూస్వాములు స్థాపించిన (ఫ్యూడల్) రాజ్యాంగమునందు సైనికజీవనము అత్యంతప్రశంసకు పాత్రమయ్యెను. నవీనముగ ధనికులు నెలకొల్పిన రాజ్యాంగమునందు ధనమునకు అధికారము చేకూరెను. హిందూవిధానమునందు

జ్ఞానము ఉన్నతస్థానమును, ద్రవ్యము నిమ్నస్థానమును ఆక్రమించెను. జ్ఞానము, ధర్మము—వీనికృషియొక్క ఫలితములును అవియె; ఏ యన్యలాభము నిమిత్తము అవి యలవరచుకొనబడవు. సాంఘికశ్రేణులలో నున్నతపదవి యందు బ్రాహ్మణుడు కలడు. ఆతనియందు పరస్పర విరుద్ధవిషయముల సంపూర్ణైక్యతయు, యథార్థస్వాతంత్ర్యమని చెప్పదగిన స్వార్థత్యాగమును, పరిపూర్ణసేవ యని చెప్పదగిన సంపూర్ణాత్మవిలయమును, అపారమగు సర్వమానవప్రేమతో బాటు నిష్కామజీవనమును మనము కనగొందుము. పరాక్రమయోధుడగు క్షత్రియ వీరుడు హిందూదేశమునందు ఆదర్శపురుషుడు గాడు. ఏలయన, సమగ్రజీవనము ఆతని దృష్టియం దుండదు. ఆతడు ఒక పక్షమునకు వ్యతిరేకముగ మరొక పక్షమున జేరియుండును. వశపరచుకొనవలసిన దేదియో యొకటి ఆతని కెల్లప్పుడు నెదురువచ్చును. సమగ్రజీవనము దర్శించు ఋషి, బ్రాహ్మణుడు, నిష్పక్షపాతి యయి సర్వజీవన వికాసములను పరిశీలించుచు పరిపూర్ణమునందు కేంద్రీకృతుడగును. ఒక పక్షమునకు వ్యతిరేకముగ, మరొక పక్షముతో జేరినయెడల, ఆతడు ఆత్మవంచకుడగును. ఆతడు యుద్ధము చేయనియెడల, అందులకు కారణము

యుద్ధము నిష్ప్రయోజన మని ఆతఁడు దానిని మానుట గాదు; ఆతఁడు సర్వవైరుధ్యములను అతిక్రమించుటయె. తనకును ప్రపంచమునకును నడుమ పొడసూపిన వైరుధ్యము లన్నిటి నతీతించి ఆతఁ డిప్పుడు విశ్రాంతినొంది యున్నాఁడు. బుద్ధుడును క్రీస్తును ఇరువురు దుష్టత్వముచే ప్రలోభపెట్టబడిరి; వారు దాని నోడించి ముక్తిని బడసిరి. సర్వజనమైత్రి బ్రాహ్మణుని ముఖ్యగుణము.* మనలో దాదాపుగ నెల్లరు దానిని క్రమక్రమముగ గాని పొందఁజాలరు. ప్రథమమున మహాయోధు డయినవాఁడె పిదప ఋషిసత్తము డగును. సైనికుఁడై శౌర్యముతో పోరాడువాఁడు రణరంగమున ప్రత్యక్షానుభవమును సంపాదించి పరిపక్వము జెంది జ్ఞానఫలితమగు పరమశాంతిని బడయును. ఇతరులకు గాయములు కలిగించుచు తాను పొందుచు, పరులను మృత్యుముఖమున ద్రోయుచు తాను దానిని ధైర్యముతో నెదుర్కొనుచు, యుద్ధక్షేత్రమున వీరుఁడు జూపు పరాక్రమమును అరిస్టాటిలు (Aristotle) మొదలగు ననేక యుద్ధప్రతిపాదకులు శ్లాఘించిరి. జీవితము నర్పించుట కుండు నభిలాష వీరపురుషుని చిహ్నము. శౌర్యము క్షత్రియుని ముఖ్యసద్గుణ

* మైత్రీ కర్మ సమస్తేషు బ్రాహ్మణస్య ఉత్తమం ధనమ్.

మగును. కాని క్షాత్రజీవనము శ్రేష్ఠతమమయినదికాదు. ఏలయన, క్షత్రియపరాక్రమము నెంత పవిత్రముగ మార్చినను, అది మనలోని యాదిమస్వభావమును వ్యక్త పరచును. మనలో నున్న మృగము మచ్చికపడ నంతకాలము, యుద్ధములు జరుగుచుండును; యోధులు అవసర మగుచుందురు. విశేషనాగరికత జెందిన జనులు కూడ కొన్ని సమయములందు పశుప్రాయు లగుదురు. వారి లోని క్రూరస్వభావము జయింపబడక యణగియుండును.

ఘోరపాపకృత్యమును జూచి యాత్మ దుఃఖము తోడను ఆగ్రహముతోడను పీడింపబడునట్టి భయంకర సమయములందు, "ఇదిగో, నీ వది చేయవద్దు; చేయు దువా, నిన్ను వధించెదను." అని క్షత్రియుడు రోష ముతో బల్కును; "నీ వది చేయకుము. చేసితివో, నేను మరణించెదను." అని యథార్థబ్రాహ్మణుడు చెప్పును. మనుష్యు డున్నతి జెందినకొలది, వాని హక్కులు తగ్గుచుండును; వాని విధికృత్యములు పెరుగుచుండును.

స్వప్నలోలుడు తన యాదర్శములు పరిపూర్ణముగ తత్క్షణమె ఫలింప వలయు నని యూహించును. కాని హిందూస్మృతి క్రమపరిణామమునె విధించును. అది యీశ్వరశాసనములను ప్రస్తుతపరిస్థితులను దృష్టియందుం

చును. పెడత్రోవ త్రొక్కిన ఆదర్శనిరతుడు మనుజుని లోప ములను గని యాశ్చర్యపడును; కలుగునట్టి కొలది వృద్ధిని జూచి నిట్టూర్పు విడుచును; ఆదర్శములందు తనకు గల యుత్సాహము ఇతరులెల్లరకు గలదని తలంచును; కొన్ని తరముల తరువాత సిద్ధింపదగిన పరివర్తనము శీఘ్రముగ సాధించుటకై సులభోపాయముల నన్వేషించును; విప్లవ కార్యములకు గడంగును. ఆతని వలన సంఘమునకు హాని కలుగునని ప్రభుత్వము భయపడును. నీమములను నిషేధ ములను నిర్మూలింప యత్నించుచు ఆతడు సంఘమున అరా చకము ప్రబలచేయును. మనము పాదములను నేలపై మోపి నక్షత్రములమీద దృష్టి నిలుపుట శ్రేయస్కరము. అధికులు, అధములు, పండితులు, పామరులు మున్నగు సర్వమానవులు ఏస్వభావము కలిగియున్నారో దానిద్వార మున ఆదర్శములు కార్యరూపము నొందింపవలయును. సకలజనులు జ్ఞానవంతులై యుండినయెడల, జీవితము చాల సుకరముగ నడచి యుండెడిది. కాని యనేక వ్యత్యాసము లతో మానవులు జ్ఞానమును బడయ గలుగుచున్నారు గావున, జీవితసమస్యలు ఇప్పు డున్నరీతిని నుండవలసి వచ్చెను. ఆత్మపరీక్షయు, ఆత్మప్రేరణయు లేక కొలది మాత్రముగ వృద్ధి బెందినవారిని, అధికముగ వృద్ధినొంది,

అనగా ద్విజత్వము బడసి, బ్రాహ్మణవైశ్యక్షత్రియ జాతులకు క్రమవిధాన మనుసరించి చేరియున్నవారినుండి హిందూతత్త్వజ్ఞులు వేరుపరచెదరు. ఒకడు ఎంత హీన స్థితిలో నున్నను, సాధారణపరిణామక్రమము ననుసరించి యాలస్యముగనో శీఘ్రముగనో యున్నతస్థాన మధిష్ఠించి కాలపరివర్తనములనుండి విముక్తిని బడయును. ఒక్కొక్కడు స్వాభావికముగ పొందగల యున్నతిని పొందుటకు కాలమును స్థానము నొసంగబడును. అభ్యున్నతి జెందగల ప్రతివ్యక్తి తన యున్నతశక్తులకు దగినస్థానము నాక్రమించుటకై సాయ మొసంగబడును.

వివిధవృత్తులయందు కొన్ని ఘనమనియు కొన్ని హీన మనియు జనులు తలంపసాగిరి. కొందరికి సౌకర్యములును కొందరికి నిర్బంధములును కలిగింపబడుట మూలమున, కొన్ని తెగలు హీనత్వము జెందెను. తెగ లొకదానికంటె నొకటి అధికతరముగ గౌరవనీయములై యున్నవను భావము వాని యాధ్యాత్మికప్రకృతికిని, సమత్వమునకును భంగకరముగ నుండుచు వచ్చినప్పుడెల్ల, ధిక్కారములు పొడసూపెను. అర్థములేని సాంఘిక గౌరవము లన్నియు ఖండింపబడెను. సైనికు డెంత నాగరికుడో చేతిపని చేయువాడును అంత నాగరికుడే.

సర్వమానవులు పరమేశ్వరునినుండి జన్మించి రనియు* కావున, వారిలో నెట్టి భేదములు లేవనియు పూర్వకాలమున తలంపబడినట్లు తెలియుచున్నది. బెస్తలు, బానిసలు, జూదరులు—ఎల్లరు ఈశ్వరస్వరూపులు♦ అని శ్రుతి చెప్పును. పరమాత్మ డొక్కడని, యటులనె మానవకోటి యంతయు నొక్కటి యని, భగవద్గీత ప్రతిపాదించును. సర్వమానవులు ప్రథమమగు, అనగా భౌతిక మగు, జననమునుబట్టి శూద్రులని, అట్లయ్యు ద్వితీయమగు, అనగా ఆధ్యాత్మికమగు, జననమునుబట్టి ద్విజు లగుదురని మనువు చెప్పెను. వర్ణము గుణమునకు సంబంధించిన విషయము. "తన వంశమునుబట్టిగాని జన్మమునుబట్టిగాని యొకడు బ్రాహ్మణుడు కానేరడు; తన కర్మములమూలముననె బ్రాహ్మణు డగును. పరిశుద్ధవర్తను డయినయెడల, చండాలుడు సయితము బ్రాహ్మణుడె."⸗ బ్రాహ్మణులచే సన్మానింపబడు కొందరు మహర్షులు వర్ణాంతరసంయోగములచే జనించినవారు. వశిష్టుడు వ్యభిచారిణికిని, వ్యాసుడు బెస్తస్త్రీకిని, పరాశ

* సర్వమ్ బ్రాహ్మ మిదమ్ జగత్.
మహాభారతము, శాంతి. 186.

♦ బ్రహ్మదాశా బ్రహ్మదాసా బ్రహ్మైవేమే కితవాః

⸗ ix 14. 48.

రుడు చండాలయువతికిని జన్మించిరి.* పరిగణింపబడు నది, వర్తనముకాని, జన్మముకాదు. ఆధ్యాత్మికోన్నతి "ఆగ్ర" వర్ణమువారు బడయునంత "నిమ్న" జాతులు నయితము బడయవచ్చును. "హీనకులములందు జన్మించిన వారు నయితము స్త్రీలును శూద్రులును నన్ను శరణు జొచ్చి యుత్తమపదవిని బడయుదురు."[1] అని శ్రీకృష్ణుడు చెప్పినట్లు భగవద్గీతయందు కలదు. "సంఘబహిష్కృతులు భక్తిని సంపాదించి భగవదారాధనద్వారమున పరమజ్ఞానము బడయుట కర్హులు. స్త్రీలు, శూద్రులు, పతితబ్రాహ్మణులు దానిని తంత్రములమూలమున బడయుట కర్హులు."♦ సిద్ధిత్వవాంఛ ధనికులలోను దరిద్రులలోను, బలాఢ్యుల లోను, బలహీనులలోను సమానతీక్ష్ణముతో ప్రజ్వ రిల్లును. ప్రేమ యేదోయొక తెగవారికి మాత్రమె చెంది నది కాదు; గభీరభక్తి యంగడియందు దొరకు వస్తువు

* గణికాగర్భసంభూతో వశిష్ఠశ్చ మహామునిః.
తపసా బ్రాహ్మణో జాత స్సంస్కార స్తత్ర కారణమ్
జాతో వ్యాసస్తు కైవర్త్యా శ్వపాక్యా స్తు పరాశరః
బహవోన్యేపి విప్రత్వమ్, ప్రాప్తా ఏ పూర్వ మద్విజాః.

**ix. 32.**

♦ అంత్యజాభి ఏ భక్తానామ్ అజ్ఞానాధికారిణః
స్త్రీశూద్రబ్రహ్మబంధూనామ్ తంత్రజ్ఞానాధికారితా.

కాదు. ఈ యీశ్వరప్రసాదములకు సంబంధించినంత వరకు సాంఘికభేదము లదృశ్యము లగును.

హిందువులందరు సిద్ధిత్వము బడయ సమర్థులై యున్నను, వేర్వేరు తెగలవారు, తమ వర్ణసంస్థలద్వారమున తమకు లభించిన పద్ధతులం నవలంబింప వలయునని కోరబడుచున్నారు. మూడు అగ్రవర్ణములవారు వైదిక కర్మములద్వారమున సిద్ధిత్వము నొందుట కర్హులు. చతుర్థవర్ణమువారు వైదికకర్మములుం చేయ తగదు. ఉపనయనసంస్కారము, వేదాధ్యయనము వారికి నిషేధింప బడెను. ఉపయోగకారులైన సంఘస్థులు వేదములను తల కెక్కించ లేక మతి పోగొట్టుకొనకుండ జేయుటకై యట్టి యేర్పాటు జరిగి యుండవచ్చును. వేదాధ్యయనము, వైదికకర్మానుష్ఠానము అక్కరలేకయె బ్రహ్మజ్ఞానము బడయవచ్చును. పూర్వజన్మసుకృతమువలన, సూతుడు, విదురుడు ఉత్తమజ్ఞానము పొందిరని శంకరుడు తెలుపుచున్నాడు. పురాణేతిహాసపఠనము, జపము, ఉపవాసము, ఈశ్వరపూజ—వీనిద్వారమున పరమాత్మను పొంద నగును. మానవమాత్రుడై యున్నంత కారణముననె ప్రతిమానవుడు సిద్ధి నొందుటకు సమర్థుడు.*

* శంకరుడు. బ్రహ్మసూత్రములు, iii. 4. 38.

హిందూదేశచరిత్ర ప్రారంభమునుండియు, మానవసమత్వస్థాపనోద్యమము దేశములో నుండియె యున్నది. అందుల కొక నిదర్శనము, పూర్వాచారపోషకుడును సంస్కరణవిరోధియు నయిన వశిష్ఠునకును, సంస్కరణోద్యమనాయకుడును స్వాతంత్ర్యరక్షకుడును అయిన విశ్వామిత్రునకును, జరిగిన కలహము. పూర్వాచారపరాయణుడైన వశిష్ఠుడు వైదికధర్మమును ఆర్యులు మాత్రమె యవలంబింపవలయు నని యభిలషించుచుండ, విశ్వామిత్రుడు సర్వజనుల కది లభింపజేయుటకై పాటుపడెను. ఉపనిషత్తులు ప్రారంభించిన యుద్యమము అట్టి విశ్వజనీన మగు నాదర్శము నిమిత్తమె. హెచ్చుతగ్గులను కాపాడు సర్వవిధములైన సాంఘికభావములను అణగ ద్రొక్కుటకు బౌద్ధమతము బయలుదేరె నని యెల్లరకు దెలిసిన విషయము. శంకరుని తత్త్వబోధన ప్రధానముగ విశ్వజనీనము. శూద్రపంచమజాతుల సభ్యులను ఆళ్వారుల జేసి రామానుజుడు గౌరవించెను.

వేదములలో పేర్కొనబడిన యీశ్వరానుభవములను కలిగి వాని ప్రేరణముచే ధర్మజీవనము పెంపొందించుకొనిన జనులు మాత్రమె వైదికవిధుల ననుసరింపవలె నని చెప్పబడెను. వైదికాచారపద్ధతులు విస్పష్టమయిన

యొక ప్రత్యేకరూపము దాల్చెను. అవి యితరుల పద్ధతులనుండి చాలవరకు భేదించుటచే వానిని వేరుపరచుట యవసర మయ్యెను. విజాతీయభావశృంఖలమున తగుల్కొని స్వీయపరమావధిని గుర్తింపక పోవుట గాని విస్మరించుట గాని సంభవముగాకుండ, ప్రతిసంఘము తన జీవితము నిర్మించుకొనుట కనుజ్ఞ నీయబడెను. కాని ఈ ప్రత్యేకపద్ధతులు కొందరు మాత్రమె యనుసరింపవలెనని త్వరలో నిర్ణయ మయ్యెను. వర్ణసంస్థ సంఘాభివృద్ధి నిమిత్తము నెలకొల్పబడెను ;* కాన నేను సంఘశ్రేయమును గమనించి ధర్మజీవనము ప్రత్యేకముగ నెవరిసొత్తు కాకుండ సర్వప్రయత్నములు గావించుట యావశ్యకము. సంఘము మొత్తముమీద సమానత్వము వ్యాపించిన కొలది, ఆదర్శములు అధికముగ విశ్వజనీనము లగును. అతిప్రాచీనకాలమున బ్రాహ్మణులు మాత్రమె, తదనంతరము బ్రాహ్మణులును క్షత్రియులును, దాని తరువాత మూడు అగ్రవర్ణములవారును, అటుపిమ్మట నాలుగువర్ణములవారును, తపోనిష్ఠలు సలిపిరి. ఆ మాటలయుద్దేశము, వర్ణవిచక్షణయు, స్త్రీపురుషభేధమును పాటింపక

* లోకానామ్ తు వివృద్ధ్యార్థమ్.

మనువు i. 32.

ప్రస్తుతకాలమున హిందూధర్మగ్రంథములు పఠించుట కయి సర్వజనులకు అధికార మీయవలె ననియె గదా?

ఇప్పటి నా యుపన్యాసములు అంతమునకు వచ్చినవి. ఈశ్వరునకు అనేకనామము లొసంగబడినను, ఆయన యొక్కడే యని హిందువులు గమనించిరి. వారి సంఘనిర్మాణవిధానము వివిధవర్ణములకు తా వొసంగినను ఏకసంఘమునె స్థాపించెను. దేశమున అనేకజాతులును తెగలును గలవు; కాని యవి యన్నియు ఒక సమానాశయముచే సఖ్యత గలిగియున్నవి. అనేకవిధములయిన వివాహములు జరుగుటకు అనుమతి నొసంగబడెను; కాని ఒకయుత్తమవిధమయిన వివాహమె యాదర్శముగ నుంచబడెను. జీవనము బహుశాఖోపశాఖలుగ చీలియున్నను, ఒకే లక్ష్యము వానియంతరమున నిమిడియున్నది. హిందూజీవనపథము యొక్క ప్రధానాదర్శమును గురించియు, ధార్మికసాంఘికసమస్యల నది పరిష్కరించు విధానమునుగురించియు క్లుప్తముగ నిప్పుడు కొంత వివరించి యీ యుపన్యాసములు విరమించుట యుపయోగకరముగ నుండు నని తలచెదను.

నిరంతర పరిణామము నొందుచున్న ప్రపంచమె సర్వమును గాదు. ప్రపంచము శాసనాధీనమై పరిపూర్ణ

స్థితి జెందగలిగియుండుటనుబట్టి అది ఏ వస్తువునందు గాని, ఏ వస్తు సముదాయమునందు గాని పరిపూర్తి నొందనట్టి సత్యస్వరూపుడయిన పరమాత్మునిపై నాధారపడియున్నదని తెలియుచున్నది. ప్రపంచరూపమున గాకపోయినను, ప్రపంచమునందు పరమేశ్వరుడు గలడు. పరిణామవిధాన మందలి ముఖ్యశ్రేణులేవియు ఆయన సృష్టివ్యాపారమునకు మేరలు గావు. చైతన్యమునో, ఆత్మజ్ఞానమునో సృజించుటకు పూనుట మాత్రమె గాక, ఆయన సదా సృష్టికార్యము సలుపుచుండును. ప్రాపంచికమును, ప్రపంచాతీతమును అని ద్వంద్వము లేదు. పరమాత్ముడు ప్రాపంచికమునందు వేరూని దానిని వికాసము నందించు శక్తిస్వరూపుడై యున్నాడు. దృగ్గోచరమును నశ్వరమును అయిన ప్రపంచము నందలి యనంత విభిన్నత, దృగ్గోచరుడును నశ్వరుడును గాని పరమాత్మునిచే పోషింపబడుచు కాపాడబడుచున్నటుల నిరూపించి జీవనరహస్యమును వ్యక్తపరచు పరిజ్ఞానమే హిందూధర్మతత్త్వము.

దుష్టత్వము, దోషము, కురూపము సృష్టిలో నుత్తమావస్థలు గావు. శిష్టత్వము ఏ స్థితినుండి ఏ స్థితి వరకు వర్థిల్లగలదో దుష్టత్వము సూచించును. సౌంద

ర్యము యొక్క సగము వికాసము కుర్ఘూపమున గాన్పిం చును. సత్యమార్గమందలి మజిలీనె దోషము కనపర చును. ఆ యవస్థలన్నియు గడచిపోవును. సంపూర్ణబహి ష్కారార్హుడుగ ఏ మానవుడును దుష్టుడై యుండడు; పూర్తిగ ఏ యభిప్రాయమును దోషయుక్తమై యుండదు.

ఒక మానవాత్మయైన ఈశ్వర నిర్దిష్టమగు గమ్య స్థానము చేరలేదేని, అంతవరకు విశ్వము పరాజయము నొందినట్లే. ప్రపంచములో నే యొక యాత్మయు నితరా త్మలను పోలియుండదు గాన, అత్యంత దుష్టాత్మ యయి నను వినాశము జెందిన నక్కాలమున ఈశ్వరకార్య క్రమమునందు లోప మేర్పడును. నరక మనునది లేదు. ఏలయన, ఈశ్వరుడు లేని ప్రదేశము గలదనియు, ఆయన ప్రేమకు వశముగాని పాపములు గలవనియు నిర్ధారణ యగును. ఈశ్వరుడు వాస్తవముగ నపారకరుణాళుడైన యెడల, సర్వమానవులకు ముక్తి కలుగుట నిశ్చయము. కాని ముక్తి సంఘటిల్లువరకు, మానవులయందు దోషమును అపరిపూర్ణతయు నుండును. నిరంతర పరిణామయుతమగు విశ్వములో దోషమును దుష్టత్వమును క్రమముగ క్షీణించుచునే యున్నను, అవి యనివార్యములు.

మతవిషయమున, హిందూధర్మము ఆధ్యాత్మిక

జీవనమును ఆధారము చేసికొని ధర్మానుభవము సిద్ధాంతమునందు వివిధరూపముల ప్రకటితమగు నని చాటును. ప్రపంచమునందును, మానవజీవితమునందును ఈశ్వరుడు ప్రధానసత్య మని గ్రహింపబడువరకు, ఒక దృష్టాంతము తరువాత మరియొక దృష్టాంతము కనపరుపబడును. తన తోటయందలి మొక్కలు ఈశ్వరుడు మొలిపించినవనియు, తోడి మనుజుని తోటలోని మొక్కలు పిశాచముచే నాటబడి తనచేత ఎంత శ్రమతోనైన నిర్మూలింపబడవలసినవనియు తలంచునట్టి ద్వైతభావజనిత మగు విశ్వాసమును హిందూధర్మము త్రోసిపుచ్చును. శ్రేష్ఠమునకు శ్రేష్ఠతమము విరుద్ధము కాదను సత్యమును పాటించి హిందూధర్మము అనుభవముయొక్క సమస్త బాహ్యరూపములను అంగీకరించి వానిని ఉచ్ఛస్థితికి దెచ్చును. దోషము కఠినదండనములవలన గాని హింసా నిర్బంధములవలన గాని నివారింప బడక జ్ఞానప్రబోధము మూలముననె క్రమముగ నిర్మూల మగును.

ధర్మ మనుసరించుటలో, కొందరు పరమేశ్వరుని ప్రత్యక్షముగ దర్శింపగోరుదురనియు, కొందరు తత్సంబంధమగు యాథార్థ్య మంతయు తెలిసికొన ప్రయత్నించుచు నానందింతురనియు హిందూధర్మము అంగీకరిం

చును. కొందరు ప్రవృత్తియందును, కొందరు నివృత్తి యందును శాంతిని బడయుదురు. ప్రత్యేకసామర్థ్యములు గలిగియున్నను, అందరు ఏకదైవమును పొంద నభిలషించు చున్నారు గాన, వారివారి మార్గముల వారు తమ యేక గమ్యస్థానమును జేరుటకు సర్వజనీన మగు ధర్మము తోడ్ప డును. మనము ప్రత్యేకముగ గలిగియున్న దానికి సర్వ ప్రాముఖ్యము నీయదగదు. బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, సన్యాసము—వీనిలో దేని మూలముననైన పరిపూర్ణత జెందనగును. సర్వమును ఏకరూపమున జూచు సంకీర్ణ దృష్టి సరియైనది గాదు. ప్రపంచములో విశుద్ధపురుషుని యొక్క పవిత్రజీవనమొకటి యుండిన, పతివ్రతయగు భార్యయొక్క నిశ్చాంచల్యముగాని శిశువుయొక్క ఆడంబ రములేని అమాయకత్వముగాని అనావశ్యములు గానేరవు. వివిధజీవితములయొక్క పరిపూర్ణతయు ఈశ్వర ప్రేరితమె. "ఎయ్యది ఘనమును శ్రేష్ఠమును సుందరమును శక్తివంత మునై యున్నదో, అయ్యది నా తేజోంశమునుండి వెలు వడునని తెలిసికొనుము." *

వ్యక్తి జీవించునది యీ జీవితమె గాక జీవితముల పరంపర యని కర్మసిద్ధాంతము మనకు చెప్పుచున్నది.

* భగవద్గీత. 10. 41.

జీవనయాత్రయొక్క గమ్యస్థానము మనము జేరువరకు నూతనావకాశములు మనకు కలుగుచుండును. మన మన లంబించు చరిత్రసిద్ధములగు నాచారవ్యవహారములు మన పూర్వకర్మ ఫలితములై యుండును. నిరంతరాయముగ ప్రవర్ధమానమగు నేకజీవనమందలి నిమ్నోన్నతావస్థలె నరకస్వర్గములు. వాని ననుభవించు వ్యక్తుల కవి బాహ్యములు గావు. పాపవిసర్జన ద్వారమున పావనత్వము సిద్ధించును. బాధ పాపముయొక్క ఫలము. పాపము మన పుట్టుకతోడను, పుణ్యము పరులు మనకొరకు శ్రమపడుటవలనను, లభించునవి యని మనము తలంప నక్కరలేదు. ఎట్టిజీవితము మనకు ప్రాప్తమగునో దాని యందే మన విధిని మనము నిర్వర్తింపవలెను. జీవన వృత్తిని నిర్ణయించుకొనుటయందు మనలో పలువురకు స్వేచ్ఛలేదు. వంశపరంపరాగత గుణములు, శరీరారోగ్యము, మానసిక శక్తులు మన కేవి లభించునో వానిని పూర్తిగ సద్వినియోగము జేసికొనుటకు మాత్రము స్వాతంత్ర్యము గలదు. ఎట్టి సామర్థ్యమయినను, ఎట్టి వృత్తియయినను, చక్కగా నుపయోగింపబడినచో, మనలను కేంద్రస్థానమునకు గొంపోవును.

భార్యాభర్తలు పూర్తిగ అన్యోన్యమగు శారీరిక

మానసిక అధ్యాత్మిక సంబంధమును కలిగియుండుటకు యావజ్జీవిత వివాహానుబంధము అత్యుత్తమ సాధనముగ కనుపరుపబడినను, భిన్నములయిన ఆదర్శములు, అభిరుచులు, అభ్యాసములు, ఆశయములు గలిగిన జనులు తమ అభ్యున్నతికి తగినటుల ఇతరవిధములయిన వివాహములు చేసికొనుట కనుజ్ఞ నీయబడెను. శాంతప్రవర్తనమువలనను, అతి సాహసపూర్వక ప్రయత్నముతోడను, వివాహము సుఖదాయకముగ చేయనగును. స్వభావమునందు అననుకూల్యము గలదను కారణముచే, వివాహవిచ్ఛేదము న్యాయమయినయెడల, మనలో అనేకులు వివాహములను విచ్ఛేదము చేసికొనవలసి యుండును. స్త్రీలు నిర్వహించు కార్యములు పురుషులు నిర్వహించుకార్యములకు భిన్నములై యుండగా, స్త్రీలు పురుషులకన్న తక్కువ యనుట కెట్టిహేతువును గాన్పించదు. వర్ణభేదము మిక్కిలి అరిష్టదాయకముగ పరిణమించినను, కొన్ని సహేతుకములయిన సిద్ధాంతములు దానికి మూలాధారముగ నున్నవి. ఆదిమ నివాసులని మనము నిరసించువారియెడ మనము సానుభూతి కలిగి యుండవలెను. నిమ్నజాతులయందలి జీవశక్తులను అంతరింపజేయుట గాక, వానిని గౌరవించి పెంపొందించు

టయె నాగరికజాతుల కర్తవ్యము. సంఘము వేర్వేరు తరగతులు గల సమిష్టిజీవి. మానవ ప్రవృత్తులు గుణము నందును రీతియందును భేదించుచుండును. కాని ప్రతి ప్రవృత్తియు సర్వమానవప్రయోజనమునకు సాయపడు నంతవరకు, అది విలువగలదియె. ఒక్కొక్కమాదిరి ప్రవృత్తిద్వారమున వృద్ధి నొందింపబడవలసిన ఒక్కొక్క మాదిరి స్వభావ ముండును. ఏకకాలమున ఎవ్వడును ఉత్తమభక్తుడును, ఉత్తమ చిత్రలేఖకుడును, ఉత్తమ తత్త్వజ్ఞుడును కాజాలడు. ఒక్కరీతిని స్పష్టముగ గాన్పించు ప్రతిజీవితమును కొన్ని హద్దులు గలిగి ప్రత్యేకముగ నుండును. దానికి అవి యితరవిధములయిన యభివృద్ధులు కలుగనీయవు. పాటుపడు ప్రతివ్యక్తియు తన విధికృత్యము ద్వారమున తనయందు గర్భితములై యున్న శక్తులను వర్ధిల్లజేసి లోకసంగ్రహమునకు తోడ్పడు సేవగా దానిని చేసికొనవలయును. ప్రతి విధికృత్యము నేర్పుతో సాధింపబడవలసిన వృత్తియు మానవసేవయు నై యున్నది. ఏకత్వమును గుర్తించు తీవ్రసద్బుద్ధి కొరవడి భిన్నజాతులు ఒక్కటిగ బంధింపబడక పోవుటచే మనయందు జాతి సంఘర్షణములు ప్రబలుచున్నవి.

ఇవియే హిందూధర్మముయొక్క కొన్ని మూలసూత్ర

ములు. నేడు హిందూధర్మము జీవించియున్న యెడల, అవియె అందునకు కారణము; కాని దాని జీవశక్తి బహ్వాల్పముగ నున్నది. ఉబుకుచుండు జలవలె ఒకప్పుడు జీవశక్తి యుండినచోట, సోమరితనము ప్రబలినది. నేడు మేము కొట్టుకొనిపోవుచున్నాము గాని ముందునకు సాగిపోవుట లేదు. మాకాళ్ల దగ్గరకు మాభావ్యభ్యున్నతి రానున్నదని యెదురుచూచుచున్నాము. జీవశక్తి అభావమైనది; ఆధ్యాత్మిక పతనము ప్రాప్తించినది. రాజకీయముగ మాకు కలుగుచువచ్చిన మార్పుల మూలమున, పరిణామ సూత్రములను విస్మరించినారము. హిందూనాగరికత విజృంభించియుండిన సుదినములలో, సముద్రమును దాటుట, వలస రాజ్యములు స్థాపించుట, లోకమునకు జ్ఞానము గరపుట, లోకమునుండి జ్ఞానము బడయుట -ఇట్టివి సాధించుచు అది జీవముతో నుత్తేజితమై యుండెను. అత్యున్నత స్థితికి వచ్చిన ప్రపంచజాతులలో దేని నాగరికతకును అది ప్రకృతిశాస్త్రము లందును, చిత్రకళలందును, వర్తకవ్యాపారములందును, కడచిన అయిదు శతాబ్దముల వరకు వెనుకబడి యుండలేదు. నేడు మమ్ములను జూచి మేమే భయపడుచున్నాము. కావున ఆత్మ సంరక్షణమునకై మా మతముయొక్క బాహ్యాచారములను

పట్టుకొని పెనగులాడుచున్నాము. వేనిమూలమున ప్రాణమును కాపాడుకొన యత్నించుచున్నామో ఆ యాచారములే దాని వృద్ధికి అడ్డువచ్చుచున్నవి. వృక్షము యొక్క లోపలిభాగము ఎంత సజీవముగ నుండునో దానిని కాపాడు బెరడును అంత సజీవముగ నుండవలెను. వృక్షము పెరుగుట కది యాటంకముగ నుండరాదు. అంతర జీవబలమున కనుగుణముగ నది విస్తరింపవలెను.

మానవాభివృద్ధియందు ఒక స్థితికి అర్థమును ఉపయుక్తమును అయినట్టి సంస్థ, మనము మరియొక స్థితి పొందినప్పుడు అనర్థమును అనర్థదాయకమును అగును. ఇది సనాతనపద్ధతియని, సంస్కరణమున కాటంకముగ, పూర్వాచారపరాయణులు పెట్టు ఘోష, దార్శనిక జ్ఞానమునకును ఆచరణమునకును, అభిరుచులకును నీతులకును, శాసనములకును సంఘమునకును నడుమ నున్నట్టియు ప్రాచీన హిందువులు స్పష్టముగ గ్రహించినట్టియు పరస్పర సంబంధమును నిరూపించు ముఖ్యసిద్ధాంతములను గమనింపదు. లెక్కింప శక్యము గాని శతాబ్దములనుండి హిందూదేశమునందు కాలము ఒకే విధముగ నున్నదనియు, సృష్టిప్రారంభమందుండిన మహాసముద్రము లెండి పోయిన నాటినుండి ఎట్టి

మార్పును కలుగలేదనియు తలంచుట కేవలము పొర పాటు. ప్రాచీనముతో సంబంధ మున్నట్టులనే కాలము-నకు పరివర్తనము కూడ గలదు. యజ్ఞయాగాది హీన కర్మములతో గూడిన వైదిక మతమును అతిక్రమించిన స్వచ్ఛమగు నాధ్యాత్మికోద్యమము యొక్క ఫలితములే ఉపనిషత్తులు. ఉపనిషన్మతము సిద్ధాంతరాద్ధాంతము లందు శుష్కించి వాదప్రతివాదముల యొక్కయు కల హాముల యొక్కయు నుద్రేకముచే ధర్మసంబంధమైన స్వాతంత్ర్య భావమును కోల్పోయినప్పుడు, సత్యము యొక్క సరళతను నైతికనియమములయొక్క గాంభీర్య మును బౌద్ధమతము జనులకు బోధించెను. దాదాపుగ నా కాలమందె ధర్మవితర్కములు సేయు బుద్ధిచేతను, శుష్కజ్ఞానార్జనముచేతను ధర్మము అమానుషమైన విప రీతపాండిత్యముగ పరిణమించి కష్టసాధ్యమగు నా నికృష్ట పాండిత్యము బడసిన విద్వాంసులు అత్యంత గర్వభూయి ష్ఠులయినపుడు, హృదయపారిశుద్ధ్యముగలవా రెల్లరకు స్వర్గకవాటములను భగవద్గీత తెరచెను. కర్మిష్ఠులు నజీవ ధర్మమును పట్టి కర్మకలాపములందు బంధింపగలిగినప్పుడు, యథార్థప్రవక్తలగు వైష్ణవశైవభక్తులును, శంకరరామా నుజులవంటి దార్శనికులును, సచేతనుడైన పరమేశ్వరుని

యుపాసన సలుపుటకు జనులను హెచ్చరించిరి. మధ్వ చైతన్యులు, బసవరామానందులు, కబీరునానకులు, కలిగించిన ధర్మోత్సాహము అసాధారణము. జనులలో ప్రబలుచువచ్చిన విశ్వాసములను గాని ఆచరణములను గాని పరిశీలించినచో, ఏకరూపము గలిగి యెట్టిమార్పు జెందని నిశ్చల హిందూధర్మ మనునట్టిది కానబడదు. హిందూధర్మము ఒక నిశ్చలస్థితి గాక సంచలనము; పరిమితమగు ప్రబోధము గాక ప్రవర్ధమానమగు సంప్రదాయము. జ్ఞానవిషయమునగాని, సంఘవిషయమున గాని భవిష్యత్కాలమున ఎట్టి క్లిష్టసమస్య ఎదుర్కొనినను, దానిన హిందూధర్మము పరిష్కరింపగల దని గత చరిత్రవలన రూఢియగుచున్నది.

కొన్నిశతాబ్దముల దీర్ఘకాల విలంబనము తరువాత, హిందూధర్మము తిరిగి సృజనశక్తిని వ్యక్తపరచుచున్న కాలములో మేము నేడు జీవించుచున్నాము. మా పురాతన మతమును నూతనదృష్టితో పరీక్షించుటకు మొదలిడినారము. మా సంఘము కదలికను జెందుచున్నట్లు తెలిసికొనుచున్నారము. శుష్కించి నశించినదియు ఛేదింపవలసినదియు నగు నరణ్యమెంతయో గలదు. హిందూధర్మమూలసూత్రములు త్యజింపక,

సంచలన మందుచు నెక్కువ క్లిష్టముగ గాన్పించు నేటి సాంఘికపరిస్థితుల యక్కరలకు తగినటుల వానిని మరల ప్రతిపాదించుటయె యావశ్యమని హిందూజీవనపథము యొక్క తత్త్వమును, దాని యనుసరణ విధానమును నేడుద్బోధించుచున్న హిందూనాయకులు నమ్ముచున్నారు. హిందూ ధర్మముయొక్క పూర్వచరిత్రమందు అనేక పర్యాయములు జరుగుచువచ్చిన కృషియె యీ ప్రయత్నము. క్రొత్త పరిస్థితులందు సామరస్యము సమకూర్చుటయె నేడు జరుగుచున్నపని. వేరులు లోతుగ ప్రాకినప్పుడు వృక్షము నిదానముగ పెరుగును. కాని చీకటిలో చిన్నదీపము వెలిగించువారు కూడ ఆకాశమంతయు ప్రకాశమానము చేయుటకు సాయపడుదురు.

సంపూర్ణము

శ్రీ అద్దేపల్లి లక్ష్మణస్వామినాయఁడుగారిచే రాజమండ్రి సరస్వతీ
పవర్ ప్రెస్ నందు ముద్రింపఁబడియె. 7455-38.